# ది క్రైమ్ న్యూస్

Crime News

తెలుగు దినపత్రిక

మంగళవారం, ఏప్రిల్ 21, 2026 | సంపుటి - 20 | సంచిక 216 | వెల - 4రూ | పేజీలు - 12


Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## పశ్చిమ బెంగాల్లో అభివృద్ధి శూన్యం

### 15 ఏళ్లుగా అధికారంలో బెంగాల్ వెనకబాటు

### కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ విమర్శలు

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో దశాబ్దానికి పైగా టీఎంసీ అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రం అభివృద్ధికి నోచుకోలేదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. దేశంలోని చాలా రాష్ట్రాలు కేవలం 5 నుంచి 8 ఏళ్లలో అభివృద్ధి సాధించాయని, దేశ ఆర్థిక వృద్ధిలో 10 శాతంగా ఉన్న పశ్చిమబెంగాల్ టీఎంసీ అధికారంలోకి వచ్చాక 5 శాతానికి పడిపోయిందని తెలిపారు.



2లో



2లో

### దక్షిణ కొరియా ద్వైపాక్షిక

## సంబంధాలు బలోపేతం

### అధ్యక్షుడు లీజె మ్యూంగ్‌తో ప్రధాని మోడీ

హైదరాబాద్ : తెలంగాణలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు గడువును ఇంటర్మీడియట్ బోర్డు పొడిగించింది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి

## తెలంగాణ ఇంటర్ సప్లింయెంటరీ పరీక్షలు

2లో

### ఫీజు గడువును 23 వరకు పొడిగించిన బోర్డు

### తెచ్చుకున్న తెలంగాణను

# ఆగం చేశారు

## ప్రజల ఆశలపై మట్టి కొట్టారు

### అవినీతి అక్రమాలతో నట్టేట ముంచారు

### హరీష్‌రావు విమర్శలపై మండిపడ్డ మంత్రి తుమ్మల



ఖమ్మం : గత పది సంవత్సరాలు ప్రజలు తెచ్చుకున్న తెలంగాణలో ప్రజల ఆశలపై మట్టి కొట్టి మన్ను పోశారని బిఆర్‌ఎస్‌పై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. రాజకీయ పార్టీలను మోసం చేసి, ప్రజలను వంచించి, వ్యవస్థలను దోచుకున్నారని విమర్శించారు. అవినీతి, అక్రమాలతో రాష్ట్రాన్ని రావణ కాష్టం చేశారని మండిపడ్డారు. ఈ మేరకు మాజీ మంత్రి హరీశ్ రావుపై మంత్రి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. అన్ని రాజకీయ పార్టీల విలువలను కాదని, పూర్వీకుల మాట పక్కన పెట్టి అహంకారంతో, దౌర్జన్యంతో పాలన చేశారని మంత్రి అన్నారు. ఒక్కొక్కరిపై వందల కేసులు పెట్టి, కబ్జా కోరులు కబ్జా చేసిన స్థలంలో మీటింగ్ పెట్టి పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని తుమ్మల వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్‌లో కాళేశ్వరరావు అనే హరీశ్ రావు రాజకీయ భవిష్యత్తు అంధకారంలో ఉందని, ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో మాజీ మంత్రి మాట్లాడుతున్నారని విమర్శించారు. టీఆర్‌ఎస్‌లో గతంలో జరిగిన, ప్రస్తుతం జరుగుతున్న 2లో

### జమ్మూకాశ్మీర్‌లో

# ఘోర ప్రమాదం

### బస్సు బోల్తాపడి 15మంది మృతి



శ్రీనగర్ : జమ్మూ కాశ్మీర్ కాగోర్ట్ సమీపంలోని రామ్‌నగర్-ఉదంపూర్ జాతీయ రహదారిపై బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 15 మంది ప్రయాణికులు మరణించారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.

2లో

### 30 వరకు అజారుద్దీన్

# మంత్రి పదవి



#### ఈలోగా ఎమ్మెల్సీగా గవర్నర్ ఆమోదించాలి

#### సిఎం వినతితో గవర్నర్ ఆమోదంస్తారా అన్న ఉత్కంఠ

హైదరాబాద్ : గతేడాది అక్టోబర్ 31న అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. నిబంధనల ప్రకారం చట్టసభల్లో సభ్యుడు కాకుండా మంత్రి పదవి చేపడితే కచ్చితంగా ఆరు నెలల్లో ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీగా ఎన్నిక కావాల్సి ఉంటుంది. అజారుద్దీన్‌కు ఈ నెల 30తో ఆ గడువు ముగుస్తుంది. ఈలోగా ఆయన ఎమ్మెల్సీ కాకపోతే మంత్రి పదవికి రాజీనామా చేయక తప్పదు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ముందు 2లో

### బిఆర్‌ఎస్‌లో జీవన్‌రెడ్డి ఒక్క రోజు

# విఐపి మాత్రమే

### హరీస్ రావు ఢిల్లీ పర్యటనపై అనుమానాలు

### ఎంపీ చామల కిరణ్ రెడ్డి వ్యాఖ్య



హైదరాబాద్ : బీఆర్‌ఎస్ భవిష్యత్తు అంధకారంలో ఉందని ఎంపీ చామల కిరణ్ రెడ్డి అన్నారు. జీవన్ రెడ్డి బిఆర్‌ఎస్‌లో ఒక్కరోజు విఐపి మాత్రమేనని అన్నారు. జీవన్ రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీలో చేరడం వలన లాభం కంటే నష్టమే ఎక్కువని ఎంపీ అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. జీవన్ రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీలో చేరడం వాళ్ల కార్యకర్తలకే ఇష్టం లేదని తెలిపారు. జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉంటూ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మాట్లాడారని విమర్శించారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ సముచిత స్థానం ఇచ్చిందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీలో జీవన్ రెడ్డి ఒక్క రోజు మాత్రమే వీఐపీ అంటూ కామెంట్స్ చేశారు. బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన సీనియర్ నేతల పరిస్థితి ఇప్పుడు

తరువాయి 2లో



### కాళేశ్వరం విస్తరణకు

# రేవంత్ శంకుస్థాపన

#### కాళేశ్వర ముక్తేశ్వరస్వామిని దర్శించుకున్న సిఎం

#### రూ.198 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం

జయశంకర్ భూపాలపల్లి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరంలోని కాళేశ్వర ముక్తేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం రూ.198 కోట్లతో చేపట్టబోయే ఆలయ అభివృద్ధి పనులకు సీఎం భూమిపూజ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటించారు.

తరువాయి 2లో





### జపాన్‌లో భారీ

## భూకంపం

#### రిక్టర్ స్కేల్‌పై 7.4గా నమోదు

#### సునామీ హెచ్చరిక జారీ

టోక్యో : జపాన్‌లో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 7.4గా నమోదైంది. దీంతో సునామీ హెచ్చరిక జారీ చేశారు. భూ ప్రకంపనల తీవ్రత కారణంగా వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న టోక్యో వరకు పెద్ద భవనాలు కంపించాయి. మూడు మీటర్ల అంటే సుమారు 10 అడుగుల ఎత్తు వరకు అలలు ఎగసిపడే అవకాశం ఉందని జపాన్ వాతావరణ సంస్థ సునామీ హెచ్చరిక జారీ చేసింది. 2లో



# ఎన్డీఏతోనే అభివృద్ధి సాధ్యం

### ఎంజిఆర్, ఎన్టీఆర్ మంచి మిత్రులు

### తమిళనాడు ప్రచారంలో చంద్రబాబు

కోయంబత్తూరు : థల్లి నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి నగేష్ తరఫున ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సీఎం తమిళంలో ప్రసంగాన్ని ప్రారంభించారు. తనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన వారికి ధన్యవాదాలు చెప్పారు. తన పుట్టినరోజున ఇక్కడకు వచ్చానని సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. పుట్టిన రోజున ఇక్కడికి వచ్చానంటే ప్రాధాన్యం అర్థం చేసుకోవాలని అన్నారు. తమిళనాడులో ఈసారి జరిగే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి నాయకులను ప్రజలు గెలిపించాలని కోరారు. తమిళభాషకు ఎంతో ప్రాధాన్యం ఉందని ఉద్ఘాటించారు. మనందరికీ మదరాసు రాజధానిగా పరిపాలన కొనసాగిందని తెలిపారు. తరువాయి 2లో

ఏపీకి, తమిళనాడుకు ఎనలేని అనుబంధం ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. తనకున్న రాజకీయ అనుభవంలో ఎంతోమంది నాయకులను చూశానని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాత్రం అరుదైన వ్యక్తి అని ప్రశంసించారు. దేశ గౌరవాన్నిమోదీ నిలబెట్టారని కొనియాడారు. మహిళలకు మోదీ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పకొచ్చారు. సోమవారం తమిళనాడులోని ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు.

## ప్రజలకు సేవచేయడమే బాబు తపన

#### కొడుకు అయినందుకు గర్విస్తున్నా

#### ఎక్స్ వేదికగా లోకేశ్ వెల్లడి

#### టిడిపి కార్యాలయంలో ఘనంగా వేడుకలు



అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పుట్టినరోజు సందర్భంగా ఆయన కుమారుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు సోమవారం తన ఎక్స్ ఖాతాలో ఎమోషనల్ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'గౌరవనీ యులైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి పుట్టినరోజు శుభాకాంక్షలు. ఆయన స్ఫూర్తిదాయకమైన నాయకుడు. 2లో

### ప్రతీ జిల్లాకు ఐదు చొప్పున

# పశువసతి గృహాలు

- పశు కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా పశు పోషకులకు ఆర్థిక సాధికారత..
- పశువసతి కేంద్రానికి రూ. 10 లక్షల అంచనా వ్యయం అరెకరం స్థలం కేటాయింపు..
- పశుకిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రూ. 3 లక్షల వరకూ రుణ సదుపాయం..
- పశువసతి గృహాల ద్వారా నిరాశ్రయ పశువులకు ఆశ్రయం
- పశుసంవర్ధక శాఖ సంచాలకులు డా. టి. దామోదర్ నాయుడు.

విజయవాడ : గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలు, పందులు పెంచే పశువుల కాపరులకు చేయూతను ఇచ్చేందుకు పశు కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు పశు సంవర్ధక శాఖ సంచాలకులు డా. టి. దామోదర్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. అంతే కాకుండా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను వినియోగించి జిల్లాకు ఐదేసి చొప్పున నియోజకవర్గాల కేంద్రాలకు సమీపంలో పశు వసతి గృహాలను నిర్మించనున్నట్లు ఆయన చెప్పారు. పశుకిసాన్ క్రెడిట్ కార్డు పొందడానికి రాష్ట్రంలోని స్వంత భూమి కవులు భూమి కలిగిన పశుపోషకులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు అర్హులు. పశువుల సంఖ్యను బట్టి ఎలాంటి పూచీకత్తు లేకుండా గరిష్టంగా 3 లక్షల వరకూ తరువాయి 2లో

## పశ్చిమ బెంగాల్లో అభివృద్ధి శూన్యం

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ మార్పును తీసుకురావాలని ఓటర్లను కోరారు. సోమవారంనాడిక్కడ మీడియాతో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలు వరుసగా మూడుసార్లు టీఎంసీకి అధికారం ఇచ్చారని, 15 ఏళ్ల అంటే అదేమంత తక్కువ సమయం కాదని చెప్పారు. పశ్చిమబెంగాల్ ప్రజలు భయం గుప్పిట్లో ఉన్నారని, ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఈసారి బీజేపీకి బాసటగా నిలవాలని రాజ్‌నాథ్ సింగ్ కోరారు. 'భయాందోళనల మధ్య ఇక్కడి ప్రజలు కాలం నెట్టుకొస్తున్నారు. వారందరికీ ఒకటే చెప్పదలచుకున్నాను. ఈసారి మార్పు తప్పనిసరిగా రావాలి. బీజేపీకి మీరంతా అండగా నిలబడాలి' అని విజ్ఞప్తి చేశారు. మహిళా సాధికారతకు కేంద్రం కట్టుబడి ఉందని, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ప్రధానమంత్రి మోదీ స్థిరనిశ్చయంతో ఉన్నారని చెప్పారు. 'ఇవాళ కాకపోతే, రేపు అది జరిగి తీరుతుంది' అని భరోసా ఇచ్చారు.పశ్చిమబెంగాల్‌లో బీజేపీ విజయావకాశాలపై రాజ్‌నాథ్ సింగ్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్ని సీట్లు వస్తాయనేది చెప్పలేను కానీ, బీజేపీకి స్పష్టమైన మెజారిటీ వచ్చితీరుతుందన్నారు. మూడింట రెండు వంతుల సీట్లు ఖాయమని చెప్పారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ రెండు విడతలుగా ఏప్రిల్ 23, 29 తేదీల్లో జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

## జమ్ముకాశ్మీర్‌లో ఘోర ప్రమాదం

మెరుగైన వైద్య చికిత్స కోసం వారిని ఉదంపూర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ ప్రమాద ఘటనపై సమాచారం అందుకోగానే జిల్లా ఉన్నతాధికారులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అతివేగం కారణంగా బస్సు డ్రైవర్ నియంత్రణ కోల్పోవడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. సోమవారం రామనగర్ నుంచి ఉదంపూర్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాద ఘటనపై ఉదంపూర్ జిల్లా ఉన్నతాధికారులతో స్థానిక ఎంపీ, కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ స్వయంగా ఫోన్ చేసి మాట్లాడారు. ఈ ప్రమాదంపై ఆయన ఆరా తీశారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. తీవ్రంగా గాయపడిన వారికి అత్యవసర వైద్య సహాయం కోసం ఎయిర్ అంబులెన్స్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. మరోవైపు జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఈ ప్రమాద ఘటనపై తీవ్ర దిగ్భ్రాం+-తి వ్యక్తం చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితులకు సాధ్యమైన మేరకు అన్ని సహాయ సహకారాలు అందించాలని జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించినట్టు వెల్లడించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా ద్వారా జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా స్పందించారు.

## కాళేశ్వరం విస్తరణకు
## రేవంత్ శంకుస్థాపన

ఈ సందర్భంగా ఆయన దక్షిణ కాశీగా పేరుగాంచిన కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి , మేడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ పనులపై ఈ పర్యటనలో ఆయన ప్రధానంగా దృష్టి సారించారు. కాళేశ్వరం చేరుకున్న ముఖ్యమంత్రికి ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. రేవంత్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, ఆలయ ప్రాంగణంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజ చేశారు. భక్తుల సౌకర్యార్థం కాళేశ్వరం క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా ప్రభుత్వం సూచనప్రాయంగా వెల్లడించింది. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, గడ్డం వివేక్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ దర్శనం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేరుగా మేడిగడ్డ బ్యారేజ్ వద్దకు చేరుకున్నారు. గత కొంతకాలంగా వివాదాస్పదంగా మారిన మేడిగడ్డ పిల్లర్ల కుంగుబాటు, ప్రస్తుత స్థితిగతులు , పునరుద్ధరణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బ్యారేజ్ మరమ్మతులు ఎంతవరకు వచ్చాయి, వర్షాకాలం లోపు చేపట్టాల్సిన రక్షణ చర్యల గురించి ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై గత ప్రభుత్వంపై విమర్శలు చేసిన నేపథ్యంలో, స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి మేడిగడ్డను సందర్శించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రాజెక్టు భద్రత , భవిష్యత్తు కార్యాచరణపై ఈ పర్యటన ద్వారా ఆయన అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. సీఎం పర్యటన దృష్ట్యా పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు , ఉన్నతాధికారులు ఈ పర్యటనలో ముఖ్యమంత్రి వెంట ఉన్నారు.

## ఎన్డీఏతోనే అభివృద్ధి సాధ్యం

తమిళ ప్రజలంటే క్రమశిక్షణ, శ్రమ కలిగిన వారు.. వారి విజయానికి అదే సూత్రమని చెప్పారు. ఎంతోమంది ప్రముఖులు, చిత్రకారులు తమిళనాడు వారు ఉన్నారని ప్రస్తావించారు. దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ ద్రవిడ భావాలను ప్రోత్సహించారని చెప్పుకొచ్చారు. ద్రవిడ యూనివర్సిటీని ప్రారంభించారని ప్రస్తావించారు. ఎన్డీఏ కూటమికి ప్రజలు బ్రహ్మరథం పట్టారని తెలిపారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. ఎన్టీఆర్ కూడా తమిళనాడులోనే జీవించారని.. తనకు పెళ్లి జరిగింది కూడా తమిళనాడులోనేనని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.ఎన్టీఆర్, ఎంజీఆర్‌లు చాలా దగ్గరి స్నేహితులని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. వారిద్దరూ కలిసి తమిళనాడుకు నీళ్లు తీసుకురావడానికి తెలుగు గంగ ప్రారంభించారని గుర్తుచేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తమిళనాడులో కొలువుతీరబోయే ఎన్డీయే భాగస్వామ్య పక్షాల తరఫున ప్రచారం నిర్వహించారు. నదుల అనుసంధానంతో దేశానికి నీటి భద్రత వస్తుంది. భవిష్యత్తులో అన్నీ కుదిరితే గోదావరి- కృష్ణ- కావేరీ నదులు అనుసంధానం కావాలి. ప్రధాని నరేంద్ర మోదీ ద్వారానే ఇది సాధ్యమవుతుంది. తమిళుల ప్రయోజనాలు పట్టని పార్టీలు మనకొద్దు. తమిళనాడు అభివృద్ధి, దేశ ప్రగతి కోరుకునేది.. ఎన్డీయే మాత్రమే అని చంద్రబాబు అన్నారు.

## బిఆర్ఎస్‌లో జీవన్‌రెడ్డి ఒక్కరోజు విఐపి మాత్రమే

ఎలా ఉందో తెలంగాణ ప్రజలకు తెలుసన్నారు. జీవన్ రెడ్డిని చేర్చుకుని కాంగ్రెస్ బలహీన పడిందని చెప్పే ప్రయత్నం బీఆర్ఎస్ చేస్తోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ మునిగిపోయే పడవ అంటూ ఎంపీ చామల కిరణ్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇకపోతే మాజీ మంత్రి హరీశ్ రావు ఢిల్లీ టూర్‌పై ఎంపీ చామల కిరణ్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పార్టీలో ముసలం మొదలైందన్నారు. జీవన్ రెడ్డి పార్టీలో చేరడం బీఆర్ఎస్ నేతలకు ఇష్టం లేదన్నారు. జీవన్ రెడ్డిని ఎప్పుడూ హరీశ్ రావు పార్టీలోకి ఆహ్వానించలేదని తెలిపారు. జీవన్ రెడ్డి ఇంటికి కేటీఆర్ వెళ్లినప్పుడు హరీశ్ వెళ్లలేదని అన్నారు. రెండవ సారి జగిత్యాలకు వెళ్లినప్పుడు కేటీఆర్.. హరీశ్ రావు ఇంటికి వెళ్లి బ్రతిమిలాడి తీసుకువెళ్లారంటూ వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ఇంటికి జీవన్ రెడ్డి వచ్చినప్పుడు కూడా హరీశ్ రావు వెళ్లలేదని ఎంపీ తెలిపారు. కవిత బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చి కొత్త పార్టీ పెట్టుకున్నారని అన్నారు. కేసీఆర్ సంవత్సరం తర్వాత ఫామ్‌హౌస్ నుంచి బయటకు వస్తుంటే హరీశ్ రావు ఢిల్లీ వెళ్లారంటూ వ్యాఖ్యానించారు. హరీశ్ రావు ఢిల్లీలో ఎవరిని కలిసి మాట్లాడారు అనేది త్వరలో బయటకు వస్తుందన్నారు. హరీశ్ భవిష్యత్తు ప్రణాళికలు ఏంటి అనేది ప్రజలకు తెలుసన్నారు.




# తెచ్చుకున్న తెలంగాణను ఆగం చేశారు

అవమానాలతో ఆయన మానసిక స్థితి సరిగా లేదన్నారు. హరీశ్ రావు మానసిక వేదనతో బాధపడుతున్నారని, అది దౌర్భాగ్యమో లేక మరేదైనా కావచ్చని మంత్రి అన్నారు. ఆయనకు ఒక్కటే పని.. ఎక్కడికి వెళ్లినా ఒకే ఆవు కథ, ఒకే రికార్డింగ్ క్యాసెట్ వినిపించడమని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పదవి పోయిన బాధలో, అస్తిత్వంతో టీఆర్ఎస్ నాయకులు ఇతర పార్టీలను విమర్శిస్తున్నారని తుమ్మల తెలిపారు. 'మీ అహంకారంతో రాష్ట్రంలో వ్యవస్థలను సర్వనాశనం చేశారు. మీరు, మీ కుటుంబం, మీ తాబేదారులు రాష్ట్రాన్ని దోచుకున్నారు' అని ఆరోపించారు. ప్రజలు అధికారానికి దూరం పెట్టినా బీఆర్ఎస్‌కు బుద్ధి రాలేదని విమర్శించారు. సీతారామ సాగర్ ప్రాజెక్టు గురించి మాట్లాడే హక్కు బీఆర్ఎస్ లేదన్నారు. 'సీతారామ నా రాజకీయ ఆకాంక్ష.. నా జీవిత లక్ష్యం' అని స్పష్టం చేశారు. పూజ్యులు రాజశేఖర్ రెడ్డి దుమ్ముగూడెం పేరుతో పనులు చేపట్టారని.. ఆయన మరణానంతరం ఆగిపోయిందని చెప్పారు. కేంద్రం, సీడబ్ల్యూసీ అనుమతి లేకుండా రూ.8 వేల కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. బ్యాలెన్స్ రిజర్వాయర్ ఉండాలంటే కాదని.. గోదావరినే రిజర్వాయర్‌గా చూపించారని ఆయన అన్నారు.

బీఆర్ఎస్ చేపట్టిన ప్రాజెక్ట్ డిజైన్ లోపభూయిష్టంతో, కమిషన్ల కోసం అవసరమైన పనులు మాత్రమే చేపట్టారని మంత్రి విమర్శించారు. తాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి వంద కోట్లతో గోదావరి జలాలను వైరా రిజర్వాయర్‌లో నింపామన్నారు. సత్తుపల్లి టన్నెల్‌కు రేవంత్ రెడ్డి రూ.1500 కోట్లు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. కనీసం హెడ్ వర్క్స్ లిఫ్ట్ కూడా బీఆర్ఎస్ పూర్తి చేయలేకపోయిందని.. వారి నిర్వాకంతో జూలూరుపాడు టన్నెల్‌కు ఫారెస్ట్ క్లియరెన్స్ తీసుకురావాల్సి వస్తోందని చెప్పారు. ఎన్నికల ముందు వందల పనులకు శంకుస్థాపన చేసి ప్రజలను మోసం చేశారని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి పెద్ద మనస్సుతో ఆ పనులన్నీ పూర్తి చేయిస్తున్నారని వివరించారు. హరీశ్ హెల్త్ మినిస్టర్‌గా తన పోర్ట్‌ఫోలియోలో సీఎం రిలీఫ్ ఫండ్ దండుకున్నారని, చివరకు దళిత బంధు కూడా దోచుకున్నారని ఆరోపించారు. 'మీ దోపిడీ, అవినీతిని గుర్తించి ప్రజలు మీకు చరమగీతం పాడారు. బతికి ఉండగా మీరు అధికారంలోకి రారు' అని స్పష్టం చేశారు. 'హరీశ్‌కు అక్కడ టీఆర్ఎస్‌లో స్థానం లేదు. మొన్న వరంగల్ మీటింగ్‌లో కూడా నిన్ను పక్కన పెట్టారు. కనీసం నీ ఫోటో కూడా వరంగల్‌లో లేదు. కాళేశ్వరరావు పేరు పెట్టుకున్న నీకు కాళేశ్వరం ప్రారంభోత్సవానికి కనీసం పిలుపు లేదు. అక్కడ నీకు చోటు లేదు. రెండేళ్ల క్రితం మంత్రివర్గంలో నీ పేరు లేదని గుర్తు చేశారు. రుణ మాఫీ చేసి ముఖ్యమంత్రి రేవంత్ చరిత్ర సృష్టించారని మంత్రి తుమ్మల వెల్లడించారు. 21 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమయ్యాయని తెలిపారు. రుణ మాఫీపై విమర్శలు చేసే హక్కు హరీశ్‌కు లేదన్నారు. భారతదేశంలో రుణ మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. కబ్జాలు, కమిషన్ల గురించి బీఆర్ఎస్‌కు తెలిసినంత ఏ పార్టీకి తెలియదన్నారు. సిద్దిపేటలో ఆరు నెలల్లో అత్యాధునిక టెక్నాలజీతో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మించామని చెప్పారు. భవిష్యత్తులో కూడా తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తామని తెలిపారు. అవినీతి పరుల విమర్శలు, శాపనార్థాలు పట్టించుకోమని స్పష్టం చేశారు. రెండేళ్ల పాలనలో అసాధ్యాన్ని సుసాధ్యం చేశామని, రాష్ట్రంలో అన్ని వర్గాలు, అన్ని జాతులకు న్యాయం చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## ప్రతీ జిల్లాకు ఐదు చొప్పన పశువసతి గృహాలు

రుణసదుపాయం బ్యాంకు నియమ నిబంధనలు అనుసరించి పశుపోషకులు పొందవచ్చునని అయన చెప్పారు. రుణ సదుపాయం పొందగోరు పశుపోషకులు సమీప బ్యాంకు శాఖను సందర్శించి పశుకిసాన్ క్రెడిట్ కార్డు నమూనా దరఖాస్తు ఫారం పొందాలన్నారు. ఆధార్ కార్డు, భూమి పత్రాలు, పశువుల వివరాలు, పాస్ పోర్టు ఫోటో, పశువైద్యాధికారి సర్టిఫికెట్ జత చేసి దరఖాస్తు సమర్పించవలసి ఉంటుందని ఆయన చెప్పారు. రుణ సదుపాయం పొందిన రైతులు పశువుల దాణా కొనుగోలు, మెరుగైన పశువుల యాజమాన్యం వంటివి అందించడానికి ఎక్కువ వీలు సమర్థత కలుగుతుందన్నారు. ఎటువంటి పూచీకత్తు లేకుండా 7 శాతం వడ్డీతో ఋణం అందించడం జరుగుతుందన్నారు. సంవత్సరం లోపున ఋణం తిరిగి చెల్లిస్తే మూడు శాతం వడ్డీ రాయితీ పొందవచ్చునని ఆయన తెలిపారు. రాష్ట్రం లోని పశుపోషకులు అందరూ అవగాహనా పెంచుకుని ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు రుణాలు పొందకుండా ప్రభుత్వం వారు అతి తక్కువ వడ్డీకి అందిస్తున్న పశుకిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా పశువుల కొనుగోలు దాణా సౌకర్యం మెరుగైన పశుయజ మాన్యం చేపట్టి ఆర్థిక స్వావలంబన పొందాలని జీవన ప్రమాణాలు మెరుగు పరుచుకోవాలని గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి తొలిమెట్టుగా నిలవాలని పశుసంవర్ధక శాఖ సంచాలకులు ఈ సందర్భంగా కోరారు. పశువసతి గృహాల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని రెవెన్యూ శాఖ ద్వారా కేటాయిస్తామన్నారు. నిర్మాణ బాధ్యతను గ్రామీణాభివృద్ధి శాఖ నిర్వహిస్తుందని చెప్పారు. పశువులకు వైద్య సేవలు అందించే బాధ్యత పశుసంవర్ధక శాఖ చేస్తుందని వసతి గృహాల రోజువారీ నిర్వహణను స్వయం సహాయక సంఘాలు చేపడతాయని అయన చెప్పారు. రాష్ట్రం లోని జంతు అభిమానులు, జంతు సంక్షేమ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ఈ పథకం విజయవంతం కావడానికి తమవంతు సహాయ సహకారాలు అందజేయాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఒక్కొక్క పశువసతి గృహంలో 20 నుండి 25 పెద్ద పశువులకు నివాస సౌకర్యం కల్పించనున్నారు. మిగులు స్థలంలో పశువుల మేత కొరకు గడ్డి సాగు పశువులకు త్రాగునీరు ఏర్పాటు చేస్తారని అయన చెప్పారు. ఒక్క వసతి గృహం నిర్మాణానికి రూ. 10 లక్షలు అంచనా వ్యయం చేశామని అరెకరం స్థలం కేటాయింపు చేశామని చెప్పారు. తప్పిపోయిన పశువులు, పట్టుబడిన పశువులు, నిరాదరణ పశువులు, అనాథ పశువులు రద్దీగా ఉండే ప్రాంతాలలో తిరుగుతూ వాహనదారులకు ఇబ్బందిని కలగజేయడం చేస్తున్నాయని చెప్పారు. వసతి గృహాల ద్వారా నిరాశ్రయ పశువులకు ఆశ్రయం పోషణ వైద్య సేవలు అందించడం జరుగుతుందని అయన చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్నీ జిల్లాల్లో నిర్ణీత లక్ష్యం మేరకు 2027 మార్చి 31వ తేదీ నాటికి పశువసతి గృహాల నిర్మాణాలు పూర్తి చేయాల్సిందిగా సంబంధిత శాఖాధికారులకు ఆదేశాలు ఇచ్చామని అయన చెప్పారు. దేశంలో పశువుల వృద్ధి ద్వారా మెరుగైన ఆదాయం సాధించవచ్చున్నారు. అందులకు పశుసంవర్ధక శాఖ ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టి రాయితీలు అందిస్తున్నదని ఆయన చెప్పారు. పశువుల కాపరులు, పాలేర్లు, పశువుల పోషకులు ఈ పథకాలను వినియోగించుకోవాలని అప్పుడు ఎంతో మేలు కలిగి పశువుల యాజమాన్యం తేలిక అవుతుందని సంచాలకులు డా. టి. దామోదర్ నాయుడు ఈ సందర్భంగా పశువుల కాపరులకు సూచనలు చేశారు.

## కావాలనే రేంవత్ సభకు పోటీ

### జగిత్యాల సభపై మండిపడ్డ పిసిసి చీఫ్

హైదరాబాద్,ఏప్రిల్20 : సీఎం రేవంత్ రెడ్డి రైతుసభకు పోటీగా కేసీఆర్ సభ పెట్టారని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు.రేవంత్ సభ 20 రోజుల ముందే ఫిక్స్ అయిందని గుర్తు చేశారు. కేసీఆర్‌కి మాది కౌంటర్ ప్రోగ్రాం కాదని కుండబద్దలు కొట్టారు. ఆశల పల్లకిలో ఊరేగించడం బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కి అలవాటేనంటూ వ్యంగ్యంగా అన్నారు. జీవన్ రెడ్డికి కేసీఆర్ ఏం ఆశలు చూపించారో అంటూ ఎద్దేవా చేశారు. కేసీఆర్ అనే పులి ఫాం హౌస్‌కే పరిమితమైందని విమర్శించారు. పులి తిన్న ఆవుల గురించి బయటపెడతామని ఆయన స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌లో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విలేకర్లతో మాట్లాడుతూ.. కేసీఆర్‌ను దగ్గర నుంచి చూస్తేనే జీవన్ రెడ్డికి ఆయన కథేమిటనేది అర్థమవుతుందన్నారు. జీవన్ రెడ్డి చేస్తున్న విమర్శలు ఆయన ఎమ్మెల్యే, ఎంపీగా పోటీ చేసినప్పుడు కనిపించ లేదా? అని ఆయన్ని సూటిగా ప్రశ్నించారు. మేడిగడ్డలో కేసీఆర్ చేసిన మోసాలపై జీవన్ రెడ్డే తమకు పాఠాలు చెప్పారని ఈ సందర్భంగా టీ పీసీసీ చీఫ్ గుర్తు చేసుకున్నారు. అలాంటి జీవన్ రెడ్డి ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీకి కోరస్ ఇస్తున్నాడని విమర్శించారు. గతంలో కేకే, డీఎస్ లాగే జీవన్ రెడ్డి కూడా బాధపడుతారని చెప్పారు. రేవంత్ రెడ్డిని తెలంగాణ ప్రజలు కోరుకున్నారని స్పష్టం చేశారు. రేవంత్ పోవాలి మార్పు రావాలి అనే హక్కు జీవన్ రెడ్డికి ఎక్కడిదని అంటూ ఆయనపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నిప్పులు చెరిగారు.

## 30 వరకు అజారుద్దీన్ మంత్రి పదవి

హడావిడిగా ఆయనను కేబినేట్‌లోకి తీసుకున్నారు. ప్రస్తుతం గవర్నర్ కోటాలో రెండు ఎమ్మెల్సీ పదవులు ఖాళీగా ఉన్నాయి.వీటిపై గత బీఆర్ఎస్ నుంచి వివాదాలు కొనసాగుతున్నాయి . కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కోదండరాం, అమీర్ అలీఖాన్ పేర్లను మంత్రివర్గం సిఫార్సు చేసింది. దీన్ని బీఆర్ఎస్ నేతలు న్యాయస్థానంలో సవాల్ చేశారు. ఇద్దరి ఎమ్మెల్సీ పదవులను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఆ తర్వాత మంత్రివర్గం అమీర్ అలీఖాన్ స్థానంలో అజారుద్దీన్ పేరును చేర్చి.. మళ్లీ కోదండరాం, అజారుద్దీన్ పేర్లను సిఫార్సు చేసింది కానీ, విషయం న్యాయస్థానంలో ఉండటంతో వారు ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేయలేదు. తెలంగాణలో ఎమ్మెల్సీల ఎంపికకు తమ ఉత్తర్వులు అడ్డుకావని ఇటీవల సుప్రీంకోర్టు చెప్పిన నేపథ్యంలో.. గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న ఎమ్మెల్సీ ఫైల్ క్లియరెన్స్ కోసం సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్‌ను కలిసినట్టు సమాచారం. వీరిద్దరి అభ్యర్థిత్వాలను ఆమోదించాలని కోరారు. ఈ వారం, పదిరోజుల్లో గవర్నర్ ఆమోదిస్తే అజారుద్దీన్ మంత్రిగా ఉంటారు. లేదంటే మళ్లీ మాజీ కాక తప్పదు. గవర్నర్ కోర్టులో ఇప్పుడు బాల్ ఉంది. ఇద్దరు ఎమ్మెల్సీల్లో కోదండరాం పేరును ఆమోదించేందుకు గవర్నర్ సానుకూలత వ్యక్తం చేసినట్టు తెలిసింది. అజారుద్దీన్ విషయంలో సందిగ్ధంలో ఉన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. హెచ్‌సీఏ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో జరిగిన ఆర్థిక అవకతవకలపై ఏసీబీ కేసు నమోదైందని, మూడు ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయని గవర్నర్ కార్యాలయం గుర్తించినట్టు తెలిసింది. రూ.3.8కోట్ల ఆర్థిక అవకతవకల మీద ఈడీ విచారణ ఎదుర్కొని, ఇదే కేసులో ఆయనపై చార్జ్‌షీట్ ఉన్నదని గుర్తించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఫైల్‌ను న్యాయసమీక్షకు పంపినట్టు తెలిసింది. న్యాయనిపుణుల సలహా మేరకు తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్టు సమాచారం. రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్‌ను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నామినేట్ చేసేందుకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా అభ్యంతరం వ్యక్తం చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఆర్థిక అవకతవకల కేసులో ఈడీ విచారణ ఎదుర్కొన్న నేపథ్యంలో ఆయన్ను నేరుగా ఎమ్మెల్సీగా ఆమోదించేందుకు అంగీకరించలేదని తెలిసింది. న్యాయనిపుణుల సలహా తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని గవర్నర్ తేల్చిచెప్పినట్టు తెలిసింది. అజారుద్దీన్‌కు మరో 10రోజులే డెడ్‌లైన్ ఉన్నది. ఆయన మంత్రిగా కొనసాగాలంటే ఈలోగా ఎమ్మెల్సీ కావాల్సిన అనివార్యత ఏర్పడింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం గవర్నర్‌తో భేటీ అయ్యారు. గవర్నర్ కోటాలో ముద్దసాని కోదండరాంరెడ్డి, మహ్మద్ అజారుద్దీన్ పేర్లను సిఫార్సు చేస్తూ రాష్ట్ర మంత్రివర్గం ఇప్పటికే గవర్నర్‌కు పంపింది. ఈ ఇద్దరు పేర్లను ఆమోదించాల్సిందిగా రేవంత్‌రెడ్డి గవర్నర్‌ను అభ్యర్థించారు. గవర్నర్ తీసుకునే నిర్ణయంతో ఈ ఇద్దరి భవితవ్యం ఆధారపడి ఉంది..

## చమురు ధరలు దిగిరావచ్చు

### యూఎస్ ఇంధన శాఖ మంత్రి క్రిస్‌రైట్

వాషింగ్టన్,ఏప్రిల్20 : యూఎస్, ఇరాన్ మధ్య రాజీ కుదరకపోవచ్చన్న భయాలతో చమురు ధరల మళ్లీ పెరగడం మొదలెట్టాయి. ఈ నేపథ్యంలో అమెరికా ఇంధన శాఖ మంత్రి క్రిస్‌రైట్ కీలక వ్యాఖ్యలు చేశారు. యూఎస్‌లో ఇంధన ధరలు ఇప్పటికే గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయని అన్నారు. అయితే, వచ్చే ఏడాది వరకూ గ్యాలన్ పెట్రోల్ ధరలు 3 డాలర్లకు పైబడే ఉండవచ్చని అన్నారు. 'ధరలు ఇప్పటికే పతాకస్థాయికి చేరుకున్నాయి. కాబట్టి ఇక తగ్గడం మొదలు కావచ్చు. ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాదికి కానీ ధరలు దిగిరాకపోవచ్చు' అని తాజాగా ఒక మీడియా సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పేర్కొన్నారు. యుద్ధానికి ముగింపు పడితే ధరలు సహజంగానే తగ్గుముఖం పడతాయని అన్నారు. ప్రభుత్వ వర్గాలు మాత్రం ఇందుకు భిన్నమైన వాదనను వినిపిస్తున్నాయి. ప్రస్తుతం చట్టసభల్లో అధికార రిపబ్లికన్ పార్టీకి స్వల్ప స్థాయి మెజారిటీ ఉంది. నవంబర్‌లో మిడ్‌టర్మ్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రజల మద్దతును నిలుపుకోవడం ట్రంప్ ప్రభుత్వానికి సవాలుగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. ఇక హోర్ముజ్ దిగ్బంధనం కొనసాగుతున్న వేళ అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర ఆరు శాతం మేర పెరిగి 95.86 డాలర్లు చేరుకుంది. మరోవైపు, ఆ జలసంధిలో ఇరాన్ నౌకను అమెరికా తాజాగా స్వాధీనం చేసుకోవడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది. యూఎస్ చర్యలపై ఇరాన్ అగ్గిమీద గుగ్గిలమవుతోంది.

## గడ్డపోతారం పారిశ్రామికవాడలో అగ్నిప్రమాదం

### ఎరిత్రో ఫార్మా పరిశ్రమలో రియాక్టర్ పేలుడు

సంగారెడ్డి,ఏప్రిల్20 : సంగారెడ్డి జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. గడ్డపోతారం పారిశ్రామికవాడలో ఉన్న ఎరిత్రో ఫార్మా పరిశ్రమలో అకస్మాత్తుగా రియాక్టర్ పేలుడు సంభవించింది. ఈ ఘటనతో ఒక్కసారిగా మంటలు పరిసర ప్రాంతాలను ఆవరించాయి. పేలుడు తీవ్రత ఎక్కువగా ఉండటంతో సమీప ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. దట్టమైన పొగ పరిశ్రమ పరిసరాల్లో వ్యాపించింది.

## దక్షిణ కొరియా ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం


న్యూఢిల్లీ : భారత్, దక్షిణ కొరియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ మూడు రోజుల పర్యటన కోసం భారత్ వచ్చారు. ఇరు దేశాల మధ్య సోమవారం పలు ఒప్పందాలు కుదిరాయి. అనంతరం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల్లో ఇది కీలక ముందడుగు అని అన్నారు. భారత్, దక్షిణ కొరియా మధ్య సంబంధాలు కేవలం వాణిజ్యానికి మాత్రమే పరిమితం కాకుండా టెక్నాలజీ, రక్షణ, షిప్ బిల్డింగ్, ఎనర్జీ వంటి విభిన్న రంగాల్లో విస్తరిస్తున్నాయని ప్రధాని పేర్కొన్నారు. చిప్స్ నుంచి షిప్స్ వరకు, ట్యాలెంట్ నుంచి టెక్నాలజీ వరకు, ఎంటర్‌టైన్‌మెంట్ నుంచి ఎనర్జీ వరకు.. ఇలా వివిధ రంగాల్లోని అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా దక్షిణ కొరియాతో భాగస్వామ్యం చేసుకుంటున్నట్టు తెలిపారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య సుమారు 27 బిలియన్ డాలర్లుగా ఉన్న వాణిజ్యాన్ని 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ప్రధాని తెలిపారు. ఈ సమావేశంలో పలు కీలక ఒప్పందాలు కూడా కుదిరాయి. ముఖ్యంగా పారిశ్రామిక రంగం, టెక్నాలజీ, ఎనర్జీ, క్రిటికల్ మినరల్స్ వంటి రంగాల్లో పరస్పరం సహకరించుకునేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి. అలాగే ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం రెండు దేశాలు కలిసి పనిచేస్తాయని మోదీ తెలిపారు.

## తెలంగాణ ఇంటర్ సప్లింయెంటరీ పరీక్షలు

చెందిన రెగ్యులర్ విద్యార్థులతో పాటు, ఫెయిలైన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయడానికి ఈనెల 23 వ తేదీ వరకు పొడిగించినట్లు తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు.2025-26 విద్యా సంవత్సరానికి గాను నిర్వహించిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్షల ఫలితాలు ఈనెల 12న విడుదలయ్యాయి. కాగా ఈ పరీక్షలో ఉత్తీర్ణులై మార్కులు ఎక్కువ సాధించాలని భావించే విద్యార్థులు, ఫెయిలైన విద్యారులకు మే 13 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. మే 22 నుంచి 25 వరకు ప్రాక్టికల్స్, మే 26న ఫస్టియర్, సెకండియర్ ఇంగ్లిష్ ప్రాక్టికల్స్, 28న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష, ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష నిర్వహించనున్నారు.

## జపాన్‌లో భారీ భూకంపం

తొలి సునామీ అలలు వెంటనే ఉత్తర తీరాన్ని చేరుకోవచ్చని



వాతావరణ సంస్థ తెలిపింది. సునామీ అలలు పదేపదే తాకే అవకాశం ఉందని.. హెచ్చరికను ఉపసంహరించుకునే వరకు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. సంక్షోభ నిర్వహణ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రధానమంత్రి కార్యాలయం తెలిపింది. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

## ప్రజలకు సేవచేయడమే బాబు తపన

ఆయనను 'నాన్న' అని పిలిచే అదృష్టం నాకు ఉందని అన్నారు. ఏళ్లు గడిచే కొద్దీ ప్రజాసేవపై చంద్రబాబు తపన మరింత బలపడుతోంది. అనుభవం, దూరదృష్టితో ముందుండి నడిపిస్తున్న తీరు ఆదర్శప్రాయం. కష్టసమయంలో పట్టుదల, ప్రజల పట్ల అంకితభావం మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. చంద్రబాబు ఎల్లప్పుడు ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నా' అని లోకేశ్ అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ పుట్టినరోజు సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ కార్యకర్తలు, అభిమానులు ఘనంగా సంబరాలు చేసుకున్నారు. కేక్ కటింగ్, అన్నదానం, రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించి తమ నేతకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సోషల్ మీడియా వేదికగా కూడా సీఎంకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో టీడీపీ శ్రేణులు వివిధ సేవా కార్యక్రమాలు, సంబరాలతో చంద్రబాబు జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు.టీడీపీ కేంద్ర కార్యాలయంలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, వర్ల రామయ్య, టీడీ జనార్ధన్ కేక్ కట్ చేసి ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. సీఎం పుట్టినరోజు వేడుకల్లో పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు 76 కేజీల కేక్ కట్ చేశారు. సీఎం చంద్రబాబుకు బర్త్‌డే విషెస్ తెలియజేస్తూ రెండు ప్రత్యేక పాటలను ఆవిష్కరించారు.

## ప్రారంభానికి ఒకరోజు ముందు
# రాజస్థాన్ రిఫైనరీలో భారీ అగ్నిప్రమాదం
### నేటి ప్రధాని పర్యటనపై అనుమానం

జైపూర్,ఏప్రిల్20 : రాజస్థాన్, బలోత్రా జిల్లాలోని పచ్‌పద్ర రిఫైనరీలో సోమవారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మంగళవారం భారత ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ రిఫైనరీ ప్రారంభం కావాల్సి ఉంది. ఇలాంటి సమయంలో ఇందులో అగ్నిప్రమాదం జరిగింది. గాల్లో వందల అడుగుల ఎత్తు వరకు నల్లటి పొగ కమ్ముకుంది. పెద్ద సంఖ్యలో ఫైర్ ఇంజిన్లు చేరుకున్నాయి. మంటలను ఆర్పటం కోసం తీవ్రంగా శ్రమిస్తున్నాయి. అగ్ని ప్రమాదం జరగడానికి గల కారణాలు తెలియ రాలేదు. అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. పచ్‌పద్ర రిఫైనరీకి 2013 సెప్టెంబర్ 22వ తేదీన కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ శంకుస్థాపన చేశారు. ఆ సమయంలో అశోక్ గెహ్లాట్ రాజస్థాన్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. 37,230 కోట్ల రూపాయల వ్యయంతో రిఫైనరీ పనులు మొదలయ్యాయి. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రధాని నరేంద్ర మోదీ 2018 జనవరి 16వ తేదీన ప్రాజెక్ట్ పనులను మరోసారి ప్రారంభించారు. హిందూస్థాన్ పెట్రోలియం కార్పోరేషన్ లిమిటెడ్, రాజస్థాన్ ప్రభుత్వం సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టాయి. భారతదేశంలో మొదటి గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ రిఫైనరీ కమ్ పెట్రోకెమికల్ కాంప్లెక్స్ ఇదే కావటం విశేషం.

# ఇరాన్- అమెరికా శాంతి చర్చల్లో ప్రతిష్టంభన
### చర్చలకు రావడం లేదని తేల్చిన ఇరాన్

టెహ్రాన్,ఏప్రిల్20 : పాకిస్థాన్ వేదికగా అమెరికా-ఇరాన్ మధ్య సోమవారం జరగాల్సిన రెండో దఫా శాంతి చర్చలు ఆగిపోయాయి. చర్చలకు రావడం లేదని ఇరాన్ స్పష్టం చేసింది. యూఎస్ నౌకాదళం తమ కార్గో షిప్‌ను స్వాధీనం చేసుకోవడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఇరాన్ శాంతి చర్చల్లో పాల్గొనేది లేదని తేల్చి చెప్పింది. 22వ తేదీతో అమెరికా-ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం ముగియనుంది. కాల్పుల విరమణ ఒప్పందం గడువు ముగిసే లోపు అమెరికా-ఇరాన్ మధ్య ఇస్లామాబాద్ వేదికగా శాంతి నెలకొంటుందని చాలా దేశాలు భావించాయి. అయితే ప్రపంచ దేశాల ఆశలు ఫలించలేదు. అమెరికా వైఖరి కారణంగానే శాంతి చర్చలకు వెళ్లడం లేదని టెహ్రాన్ పేర్కొంది. ఇరాన్ జెండాతో ఉన్న వాణిజ్య నౌక తౌస్కాను అమెరికా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. నౌకపై తొలుత కాల్పులు జరిపి ఆపై అదుపులోకి తీసుకున్నాయి . అమెరికా తమ నౌకను స్వాధీనం చేసుకోవడంపై ఇరాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది . ఈ చర్యను ఇరాన్‌పై దాడిగా భావిస్తూ త్వరలోనే ప్రతీకారం తీసుకుంటామని హెచ్చరించింది. అమెరికా చర్యలు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని, ఇస్లామాబాద్‌లో మలి విడత చర్చలకు రావడం లేదని ఇరాన్ తెలిపింది. అలాగే ఇరాన్ నౌకాశ్రయాలపై అమెరికా దిగ్బంధనం కొనసాగించడం, శాంతి చర్చల నేపథ్యంలో అగ్రరాజ్యం పెట్టిన డిమాండ్లు కూడా ఇరాన్‌కు రుచించడం లేదు. ఈ నేపథ్యంలో రెండో దఫా శాంతి చర్చలు ప్రారంభం కాకుండానే విఫలమైనట్టు కనిపిస్తోంది.

# అఫిడవిట్లలో వందకోట్ల తేడా
### విజయ్‌కు హైకోర్టు నోటీసులు

చెన్నై,ఏప్రిల్20 : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి ప్రధాన పార్టీలతో తలబడుతున్న టీవీకే చీఫ్ విజయ్‌కు మద్రాసు హైకోర్టు షాక్ ఇచ్చింది. అసెంబ్లీ ఎన్నికల కోసం పెరంబూరు, తిరుచ్చి తూర్పు నియోజకవర్గాల్లో విజయ్ దాఖలు చేసిన అఫిడవిట్లతో వ్యత్యాసాలు ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై విజయ్‌కు నోటీసులు జారీ చేసింది. ఆయనతో పాటు ఐటీ ఇన్వెస్టిగేషన్ డెరెక్టర్ జనరల్, ఈసీఐ, పెరంబూరు, తిరుచ్చి (ఈస్ట్) రిటర్నింగ్ అధికారులకు నోటీసులు ఇచ్చింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. రెండు నియోజకవర్గాల్లోనూ పోటీ చేసేందుకు విజయ్ సమర్పించిన అఫిడవిట్లలో వ్యత్యాసాలు ఉన్నాయని చెన్నైకి చెందిన వి.విఘ్నేశ్ పిటిషన్ వేశారు. రెండు అఫిడవిట్ల మధ్య రూ.105 కోట్ల భారీ వ్యత్యాసంపై ఆదాయం పన్ను శాఖ దర్యాప్తు చేయాలని పిటిషనర్ కోరారు. పిటిషన్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్ఏ ధర్మాధికారి, జస్టిస్ జి అరుళ్ మురుగన్‌తో కూడిన ధర్మాసనం సోమవారంనాడు విచారణ జరిపింది. ఒక నియోజకవర్గంలో వంద కోట్లకు పైగా ఆస్తులను వెల్లడించకపోవడం అక్రమమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. విజయ్, తదితరులకు నోటీసులు జారీ చేసింది. దీంతో తదుపరి విచారణలో ఏమి జరుగుతుందనేది ప్రస్తుతం చర్చనీయాంశమవుతోంది. ఈనెల 23, 29 తేదీల్లో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరుగనుంది.

## చెట్టును ఢీకొని కుప్పకూలిన ప్రైవేట్ జెట్
### ఇద్దరు పైలట్లు మృతి చెందినట్లు గుర్తింపు

రాయపూర్,ఏప్రిల్20 : ఛత్తీస్‌గఢ్‌లోని జశ్‌పుర్ జిల్లా కొండ ప్రాంతంలో ప్రైవేటు జెట్ ఒకటి సోమవారంనాడు కుప్పకూలింది. ఆరా హిల్స్‌లో తొలుత చెట్టును ఢీకొని ఆ తర్వాత కుప్పకూలినట్టు స్థానికులు తెలిపారు. దీంతో మంటలు ఎగసిపడి పొగ చుట్టుపక్కలకు వ్యాప్తించినట్టు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో జెట్‌లోని పైలట్, కో-పైలట్ ఇద్దరూ మరణించినట్టు ప్రాథమిక సమాచారం. జెట్ కుప్పకూలిన సమయంలో అందులో ఇంకెవరైనా ఉన్నారా అనేది తెలియాల్సి ఉంది. జెట్ కుప్పకూలిన సమాచారం తెలిసిన వెటనే ఎస్ఎస్‌పీ లాల్ ఉమీద్ సింగ్ సహా సీనియర్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

# హర్మూజ్ వద్ద నౌకలకు నేవీ అడ్వైజరీ
### అనుమతి ఇచ్చే వరకు వెళ్లొద్దన భారత నేవీ
### రష్యా చమురు దిగుమతికి బీమా సంస్థల సేవలకు అనుమతి



న్యూఢిల్లీ,ఏప్రిల్20 : హర్మూజ్ జలసంధిలో భారత జెండాతో ప్రయాణిస్తున్న రెండు నౌకలపై ఇరాన్ బలగాలు కాల్పులు జరిపిన నేపథ్యంలో భారత పతాక నౌకలకు మన నౌకదళం అడ్వైజరీ జారీ చేసిందని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. లారక్ ఐలాండ్‌కు దూరంగా ఉండాలని, తమనుంచి ఆదేశాలు వచ్చిన తర్వాతే హర్మూజ్‌లో ప్రయాణించాలని నేవీ పేర్కొంది. ఆ జలసంధిని దాటేందుకు వేచి ఉన్న నౌకల భద్రతను నిర్ధారించేందుకే ఈ సూచనలని. లారక్ ద్వీపం హర్మూజ్‌కు సమీపంలో ఉంటుంది. యుద్ధం ప్రారంభమైన దగ్గరి నుంచి 11 నౌకలు ఈ జలమార్గాన్ని దాటాయి. దానిని దాటిన చివరి ట్యాంకర్ దేశ్ గరిమ . అదే రోజు జగ్ అర్ణవ్, సన్మార్ హెరాల్డ్ ఈ మార్గంలో ప్రయాణిస్తుండగా.. ఇరాన్ బలగాలు కాల్పులు జరిపాయి. ఈ ఘటనను విదేశాంగశాఖ ఖండించిన సంగతి తెలిసిందే. భారత్‌లోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీని పిలిపించి ఈ ఘటనపై నిరసనను తెలియజేసింది. గతంలో తమ దేశానికి బయల్దేరిన అనేక నౌకల సురక్షిత ప్రయాణానికి ఇరాన్ సహకరించిందని ఈ సందర్భంగా గుర్తుచేసింది. ఇకపోతే భారత్‌కు చమురు సరఫరాలో ఆటంకాలు లేకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకొంటోంది. తాజాగా రష్యా నుంచి చమురు దిగుమతికి అవసరమైన బీమా సేవలను విస్తృతం చేయాలని నిర్ణయించింది. దీనిలోభాగంగా 11 రష్యా బీమా సంస్థలకు భారత్‌లో అనుమతులు మంజూరు చేసింది. వాస్తవానికి ఈ సంస్థలు నౌకా రవాణాలో బీమాలను అందించే పీ అండ్ ఐ క్లబ్స్ (ప్రొటెక్షన్ అండ్ ఇండెమ్నిటీ)లో మెంబర్స్ కాకపోవడం గమనార్హం. ఇరాన్-అమెరికా పోటీపడి హర్మూజ్‌ను దిగ్బంధించడంతో చమురు నౌకలు ఈ జలసంధిని దాటడం చాలా కష్టంగా మారింది. మరోవైపు రష్యాకు చెందిన చాలా చమురు నౌకలు ఈ మార్గంలో కాకుండా ఎర్ర సముద్రం మీదుగా ఆసియాలోని తమ గమ్యస్థానాలకు చేరతాయి. అందుకే భారత్ మాస్కో వైపు మొగ్గు చూపింది. వీటిల్లో గ్యాస్‌ప్రోమ్ ఇన్స్యూరెన్స్, రోస్‌గోస్‌స్ట్రాక్, బ్యాలెన్స్, సోగ్లాసీ, ఉగోరియా గ్రూప్, స్బేర్‌బ్యాంక్, ఏఎస్‌టీకే బీమా సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయి. రష్యా నుంచి చమురు కొనుగోళ్లకు గత వారం అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ కూడా అనుమతులను పొడిగించింది. ఐరోపా కేంద్రంగా పనిచేసే 'ఇంటర్నేషనల్ గ్రూప్ ఆఫ్ పీఅండ్ఐ క్లబ్స్' సంస్థే థర్డ్‌పార్టీ, పొల్యూషన్, కార్గో డ్యామేజ్ వంటివి కవర్ చేస్తూ అత్యధికంగా బీమా పాలసీలు ఇస్తాయి. ప్రపంచ సముద్ర రవాణాలో ఈ సంస్థ వాటా 87శాతం వరకు ఉంది. అమెరికా ఆంక్షలు ఉన్న నేపథ్యంలో ఈ సంస్థ రష్యా నౌకలకు బీమా పాలసీలు ఇవ్వదు.

# విజయ్-సంగీతలో విడాకుల వ్యవహారం
### కేసు జూన్ 15కు వాయిదా వేసిన కోర్టు
### భరణంపై కోర్టు బయట బేరసారాలు
### ఎన్నికల అఫిడవిట్ ఆధారంగా భరణం డిమాండ్
### 35 కోట్లు మాత్రమే ఇస్తానన్న విజయ్

చెన్నై,ఏప్రిల్20 : కోలీవుడ్ స్టార్ హీరో, టీవీకే అధినేత విజయ్ వ్యక్తిగత జీవితం హాట్ టాపిక్ గా మారింది. ఒక వైపు రాజకీయంగా ప్రత్యర్థుల నుంచి విమర్శలు, మరోవైపు వైవాహిక బంధంలో ఒడిదుడుకులు ఇప్పుడు దళపతినిఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. విజయ్ భార్య సంగీత దాఖలు చేసిన విడాకుల పిటిషన్ పై చెంగల్పట్టు కోర్టు విచారణను జూన్ 15కు వాయిదా వేసింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల హీట్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ పరిమాణాలు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే విజయ్ - సంగీత జంట పరస్పర అంగీకారంతో విడిపోయేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు శనివారం చెన్నైలో ఇరువురి లాయర్లు కలిసి చర్చించినట్లు సమాచారం. విడిపోయేందుకు తాను సిద్ధంగా ఉన్నానని అయితే సెటిల్ మెంట్ కింద ఎన్నికల అఫిడవిట్ లో ప్రకటించిన ఆస్తుల ఆధారంగా , తన ఇద్దరు పిల్లలు భవిష్యత్తు కోసం సుమారు రూ. 250 కోట్లు భరణం సంగీత కోరినట్లు టాక్ వినిపిస్తోంది. అయితే విజయ్ మాత్రం సంగీతకు రూ. 35 కోట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని సమచారం. కుమారుడు, కుమార్తె బాగోగులు తాను చూసుకుంటానని విజయ్ అన్నట్లు తెలుస్తోంది. అయితే విడాకుల వ్యవహారం కోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోదని సమాచారం. విజయ్ నుంచి విడాకుల కోసం ఈ ఏడాది ఫిబ్రవరిలో సంగీత పిటిషన్ దాఖలు చేశారు. అందులో ఆమె పేర్కొన్న అంశాలు కోలీవుడ్‌లో కలకలం రేపుతున్నాయి. విజయ్ ఒక నటితో వివాహేతర సంబంధం పెట్టుకున్నారని ఆరోపించారు. తనను మానసిక, శారీరక వేధింపులకు గురిచేశారని, కనీస ఆర్థిక స్వేచ్ఛ కూడా ఇవ్వలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. తన కదలికలపై ఆంక్షలు విధించారని, మాటలతో తీవ్రంగా కించపరిచారని ఆమె వాపోయారు. తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి. తన సొంత పార్టీ 'తమిళగ వెట్రి కళగం' ద్వారా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన విజయ్‌కు ఈ ఎన్నికలు అత్యంత కీలకం. అయితే, సరిగ్గా ఎన్నికల ప్రచార సమయంలో ఈ విడాకుల వ్యవహారం తెరపైకి రావడం ఆయనకు ప్రతికూలంగా మారుతుందా అన్న చర్చ సాగుతోంది. మరి ఈ విడాకుల వ్యవహారం రాజకీయంగా ఎలాంటి ప్రభావం చూపుతుందో చూడాలి మరి.

# కెటిఆర్ తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే సంజయ్
### అక్రమ సంపాదనతో వచ్చిన అహంకారమని విమర్శ

జగిత్యాల,ఏప్రిల్20 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌దే క్రాస్‌బ్రీడ్ అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్ కుమార్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. జీవన్ రెడ్డి కాంగ్రెస్‌ను వీడి బిఆర్ఎస్‌లో చేరబోతున్న సమయంలో తనపై వచ్చిన విమర్శలకు ఆయన తీవ్రంగా స్పందించారు. ఆయన జగిత్యాలలో మీడియాతో మాట్లాడుతూ.. తనను క్రాస్ బ్రీడ్ నాయకుడని కేటీఆర్ సంబోధించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'నేను రాజకీయ వ్యభిచారినైతే.. నువ్వు వ్యభిచార కొంప నడిపావా? గతంలో వైసీపీ, కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్న నీదా క్రాస్ బ్రీడ్..? నాదా..?' అని కేటీఆర్‌ను నిలదీశారు. గతంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో చంద్రశేఖర్ గౌడ్‌ను నిలబెట్టి.. జీవన్‌రెడ్డికి క్రాస్ ఓటేయించిన క్రాస్‌బ్రీడ్ నాయకుడు కేటీఆర్.. అక్రమ సంపాదనతో వచ్చిన అహంకారంతో మాట్లాడుతు న్నారని మండిపడ్డారు. కల్వకుంట్ల కుటుంబ అహంకారపూరిత వ్యాఖ్యలతోనే రాష్ట్రంలో వెలమ జాతి గౌరవం తగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేటీఆర్ రాజకీయాల్లోకి రాక ముందు నుంచే తానూ తన కుటుంబం రాజకీయాల్లో ఉన్నామన్న సంజయ్.. రాజకీయాల్లోకి వచ్చాక తన ఆస్తులు తగ్గాయే తప్ప పెరగలేదని స్పష్టం చేశారు.

# కేబుల్ బ్రిడ్జిపై హిట్ అండ్ రన్
### బెంజ్ కారు ఢీకొని వ్యక్తి మృతి

హైదరాబాద్ : హైదరాబాద్ లోని మాదాపూర్ కేబుల్ బ్రిడ్జిపై జరిగిన హిట్ అండ్ రన్ ప్రమాదం కలకలం రేపింది. అతివేగంగా వచ్చిన ఓ మెర్సిడెస్ బెంజ్ కారు ఢీకొనడంతో శ్యామ్ రాజ్ (32) అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. జూబ్లీ హిల్స్ నుంచి ఐకియా వైపు వస్తున్న వెస్ట్ బెంగాల్ రిజిస్ట్రేషన్ కలిగిన బెంజ్ కారు బ్రిడ్జిపై ఆగి ఉన్న శ్యామ్ రాజ్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదం అనంతరం కారు డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనలో కారు ఇంజన్ భాగం తీవ్రంగా దెబ్బతిన్నట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం కారును కొంత దూరం తీసుకెళ్లి అదే కేబుల్ బ్రిడ్జిపై పార్క్ చేసి, డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి అక్కడి నుంచి తప్పించుకున్నారు. ప్రమాదం సమయంలో కారులో ఇద్దరు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మాదాపూర్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి కారణమైన నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.

# పరీక్షల వేళ కట్టుదిట్టమైన భద్రత
### సైబరాబాద్ సిపి రమేశ్ ఉత్తర్వులు

హైదరాబాద్,ఏప్రిల్20 : సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో సైబరాబాద్ సీపీ రమేశ్ కీలక ఉత్తర్వులు జారీ చేశారు. ఇంటర్, తెలంగాణ ఓపెన్ స్కూల్స్ సొసైటీ పరీక్షల సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతని పెంచుతున్నట్లు స్పష్టం చేశారు. ఏప్రిల్ 20వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ప్రత్యేక నిబంధనలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 200 మీటర్ల పరిధిలో గుమిగూడటానికి నిషేధం విధిస్తున్నట్లు సైబరాబాద్ సీపీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుంపులుగా గూడటం నిషేధమని తెలిపారు. పరీక్షా కేంద్రాల దగ్గర వందమీటర్ల పరిధిలో జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు మూసివేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ ఉత్తర్వులు అమలు అవుతాయని వెల్లడించారు. పోలీస్, సైనిక సిబ్బంది, హోం గార్డులకు ఈ ఉత్తర్వుల నుంచి మినహాయింపు ఉంటుందని అన్నారు. విద్యాశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ విధులకు అనుమతి ఉంటుందని, అలాగే అంత్యక్రియల ఊరేగింపులకు మినహాయింపు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్తర్వులు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీపీ రమేశ్ స్పష్టం చేశారు.

# సిఎం రేవంత్‌తో నార్వే బృందం భేటీ

హైదరాబాద్,ఏప్రిల్20 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నార్వే రాయబారి హెచ్.ఈ. మే-ఎలిన్ స్టెనర్ ప్రతినిధి బృందం కలిసింది. జూబ్లీ హిల్స్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలపింది. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధి, పెటటుబడులు తదితర పలు అంశాలు ప్రస్తావనకు వచ్చాయి.

# అమెరికా చరిత్రలో అతిపెద్ద రిఫండ్
### సుప్రీంకోర్టు తీర్పుతో సుంకాల తిరిగి చెల్లింపు

వాషింగ్టన్,ఏప్రిల్20 : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాలు చెల్లుబాటు కావంటూ అక్కడి సుప్రీంకోర్టు తీర్పు వెల్లడించిన నేపథ్యంలో సుంకాల తిరిగి చెల్లింపు ప్రక్రియ ప్రారంభమైంది. అమెరికా కస్టమ్స్ బోర్డర్ ప్రొటెక్షన్ ఇందుకోసం ఆన్‌లైన్ సిస్టమ్‌ను తీసుకొచ్చింది. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 8 గంటల నుంచి దిగుమతిదారులు, వారి బ్రోకర్లు క్లెయిమ్‌లను సబ్మిట్ చేయొచ్చు. అమెరికా చరిత్రలో ఇది అతిపెద్ద రిఫండ్ ప్రక్రియగా నిలవనుంది. గతేడాది ట్రంప్ వివిధ దేశాలపై ఎడాపెడా సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. అయితే, 1977 నాటి అత్యవసర అధికారాల చట్టం కింద ట్రంప్ ఈ సుంకాలను విధించడం రాజ్యాంగ విరుద్ధమని ఈ ఏడాది ఫిబ్రవరి 20న సుప్రీంకోర్టు 6-3 మెజారిటీతో తీర్పునిచ్చింది. పన్నులు విధించే అధికారం కాంగ్రెస్‌కు మాత్రమే ఉంటుందని స్పష్టంచేసింది. సుంకాలు చెల్లుబాటు కాకపోవడంతో ఆ మొత్తం రిఫండ్ చేయాలని కోర్టు ఆదేశించింది. ఈ సుంకాలను చెల్లించిన వ్యాపార సంస్థలు, దిగుమతిదారులు ఈ రిఫండ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ట్రంప్ వెలువరించిన ఉత్తర్వుల అనంతరం 3.30 లక్షల మంది దిగుమతిదారులు దాదాపు 166 బిలియన్ డాలర్లను సుంకాల రూపంలో చెల్లించారు. ఇందులో 56,497 మంది దిగుమతిదారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారికి వడ్డీతో కలిపి సుమారు 127 బిలియన్ డాలర్లు ప్రస్తుతం వాపసు ఇవ్వడానికి ట్రంప్ సర్కారు సిద్ధమవుతోంది. ఆమోదం పొందిన తర్వాత సుమారు 60 నుంచి 90 రోజుల్లో డబ్బు తిరిగి రానుంది. సాంకేతిక సమస్యల వల్ల కొంత ఆలస్యం జరగొచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. ఇటీవల చెల్లించిన సుంకాలను ముందుగా వాపస్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే తొలుత చెల్లించిన వారికి ఆలస్యం కానుంది. దిగుమతిదారులు తాము పొందిన రిఫండ్‌ను వినియోగదారులకు పంచాల్సిన అవసరం లేదు. అయితే, ఫెడ్ఎక్స్ వంటి కొన్ని సంస్థలు మాత్రం తమ కస్టమర్లకు ఈ ప్రయోజనాన్ని బదిలీ చేస్తామని వెల్లడించడం గమనార్హం.

# కాళేశ్వరం పేరుతో కెసిఆర్ భారీ అవినీతి
### అద్భుతమైన కట్టడం అంటూ ప్రచారాలు
### మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి

జయశంకర్ భూపాలపల్లి,ఏప్రిల్20 : కాళేశ్వరం ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో కేసీఆర్ హయాంలో అవినీతికి పాల్పడ్డారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం ప్రపంచంలోనే అద్భుతమని మాజీ సీఎం కేసీఆర్ ప్రచారం చేసుకున్నారని పేర్కొన్నారు. సోమవారం మేడిగడ్డ బ్యారేజీను పరిశీలించి ఇరిగేషన్ క్యాంపు కార్యాలయంలో మంత్రులు, ఎన్డీఎస్ఏ నిపుణులు, ఇరిగేషన్ అధికారులతో సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. మేడిగడ్డ బ్యారేజీలో లోపాలు ఉన్నాయని 2020లోనే ఇంజినీర్లు చెప్పారని, వారి లేఖలను అప్పటి సీఎం, ఎల్ అండ్ టీ అధికారులు పట్టించుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 2023 అక్టోబర్‌లో మేడిగడ్డ బ్యారేజీ కుప్పకూలిపోయిందని గుర్తు చేశారు. అన్నీ దాచిపెట్టి ఎన్నికల్లో లబ్ది పొందాలని ప్రయత్నించారని.. కానీ, ప్రకృతి మరొకటి తలచి బ్యారేజీ పూర్తిగా కుంగిపోవడంతో ప్రపంచానికి తెలిసిందన్నారు. మేడిగడ్డ సందర్శనకు మంత్రులతో కలిసి వెళ్లిన సీఎం.. బ్యారేజీ మరమ్మతుల కార్యాచరణపై అధికారులతో సమీక్షించారు. అనంతరం ఎల్ అండ్ టీ అతిథిగృహంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. 2018 ఎన్నికల్లో కాళేశ్వరాన్ని చూపించి లబ్ది పొందారు. మేడిగడ్డ విషయంలో కేంద్రం సీబీఐ విచారణను ఇప్పటికీ ప్రారంభించలేదు. సీబీఐ విచారణ వెంటనే ప్రారంభించాలని ఇటీవలే మరోలేఖ రాశాం. రూ.1.50 లక్షల కోట్లలో రూ.లక్ష కోట్లు ఇప్పటికే కాంట్రాక్టర్లకు చెల్లించారు. రూ.లక్షన్నర కోట్లు ఖర్చు చేసే ప్రాజెక్టుతో లక్ష ఎకరాలకు కూడా నీళ్లివ్వలేదు. రూ.లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తున్న ప్రాజెక్టును చూస్తూ వదిలేయలేం. సాంకేతిక నిపుణులతో పాటు మేం పరిశీలనకు వచ్చిన రోజే కేసీఆర్ మీటింగ్ పెట్టుకున్నారు. నిజాలు తెలియకూడదనే ఇవాళ కేసీఆర్ సమావేశం ఏర్పాటు చేశారని రేవంత్‌రెడ్డి అన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల లోపాలపై ఎలా ముందుకెళ్లాలో ఓ స్పష్టత వచ్చిందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సమస్యను అర్థం చేసుకోవడమే సగం పరిష్కారమని చెప్పుకొచ్చారు. సమస్యను పూర్తిగా అర్థం చేసుకున్నాకే అధికారులు పనులు ప్రారంభించాలని ఆదేశించారు. సేకరించిన శాంపిల్స్ రిజల్ట్‌కు అనుగుణంగా పనులు చేపట్టాలని సూచించారు. ఎన్డీఎస్ఏ మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రతి పనిలో ఎన్డీఎస్ఏ అప్రూవల్ తీసుకుని పనిచేయాలని దిశానిర్దేశర చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావును.. కాళేశ్వర్ రావు అని అప్పటి గవర్నర్ నరసింహన్‌తో చెప్పించారని ప్రస్తావించారు. కేసీఆర్ అవినీతిని ప్రకృతే గుర్తించి మొదట బయటకు తీసిందని తెలిపారు. 2023 ఎన్నికల ముందు కాళేశ్వరం కూలిపోయిందని చెప్పుకొచ్చారు. అన్ని విషయాల్లో కాళేశ్వరం విఫలమైందని ఎన్డీఎస్ఏ రిపోర్ట్ ఇచ్చిందని పేర్కొన్నారు. కాళేశ్వరంపై శాసనసభలో చర్చించి సీబీఐ విచారణకు ఆదేశించామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. తొమ్మిది నెలలైనా కేంద్ర ప్రభుత్వం సీబీఐ విచారణ ఎందుకు జరిపించడం లేదని ప్రశ్నించారు. ఈ విషయంపై తమ ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించాలని కేంద్రానికి తీర్మానం పంపిందని అన్నారు. కేసీఆర్, హరీశ్‌రావును జైల్లో వేయాలని, ఈ కేసును సీబీఐకి అప్పగించాలని కిషన్‌రెడ్డి ఆనాడు అనలేదా అని ప్రశ్నించారు. కానీ కేంద్ర ప్రభుత్వం దీనిపై నిర్లక్ష్యం వహించిందని ధ్వజమెత్తారు. అంతకుముందు సీబీఐ విచారణకు ఆదేశించాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చెప్పారని.. కానీ ఇప్పటి వరకూ చర్యలు ఎందుకు తీసుకోవట్లేదని నిలదీశారు. కాళేశ్వరం విచారణపై సీబీఐ ఎందుకు మౌనంగా ఉంది..? అని నిలదీశారు. తాము పదే పదే లేఖలు రాసినా ఎందుకు స్పందిచడం లేదు..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరంపై లక్షకోట్లు ఖర్చుచేసి లక్ష ఎకరాలకు సాగునీరు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. దీనిని తాము వదిలేయలేక, దీనిపై ఖర్చు చేయలేక సాంకేతిక నిపుణులతో ఇక్కడికి వచ్చామని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును రిపేర్ చేయాలని తమ ప్రభుత్వం సంకల్పించిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నెల రోజుల ముందే అధికారులతో, సాంకేతిక నిపుణులతో ఇవాళ సమావేశం పెట్టుకున్నామని తెలిపారు. నిజాలు బయట పడతాయని తెలిసి ఇవాళ కావాలని వాళ్లు ఓ మీటింగ్ పెట్టుకున్నారని.. అయినా మేం అనుమతులు ఇచ్చామని స్పష్టం చేశారు. హరీశ్‌రావు తెలివి ఉందని.. మాట్లాడుతున్నారో, తెలివి లేక మాట్లాడుతున్నారో తెలియదని ఎద్దేవా చేశారు. శ్రీపాద ఎల్లంపల్లి ఈ ప్రాజెక్టుకు ప్రాణవాయువు అని ఉద్ఘాటించారు. హరీశ్‌రావు నిక్కర్‌తో తిరక్కముందే ఎల్లంపల్లి ప్రాజెక్టు ఉందని విమర్శించారు. ఎల్లంపల్లి నీటితోనే రాష్ట్రంలో అత్యధిక పంటలు పండించారని ప్రస్తావించారు. కాళేశ్వరంలో దోషులను వదిలేది లేదని హెచ్చరించారు.. దోషులను శిక్షించేందుకు అవసరమైన కార్యాచరణతో ముందుకెళ్తామని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టును కూడా ఊరికే వదలబోమని.. రిపేర్లు చేసి నీరు అందిస్తామని పేర్కొన్నారు. అయితే కేసీఆర్ హయాంలో చేసిన బండారం బయటపడుతుందని వాళ్లు ఈరోజు మీటింగ్ పెట్టుకున్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. సీబీఐ విచారణ జరుపుతారని బీజేపీ వాళ్ల కాళ్లు మొక్కించేందుకే హరీశ్‌రావు, వినోద్ రావు ఢిల్లీకి పోయారని విమర్శించారు. కాళేశ్వరంపై విచారణకు ఆదేశిస్తారని తెలిసి బీజేపీ నేతల కాళ్లు పట్టుకునేందుకు హరీశ్‌రావు ఢిల్లీకి పరుగెత్తారని విమర్శించారు. మీడియా బయటపెట్టినా వాళ్లు ఈ విషయంపై ఎలాంటి ప్రకటన ఎందుకు చేయలేదని నిలదీశారు. బీజేపీని అడ్డుపెట్టుకుని అవినీతి కేసుల నుంచి బయట పడతామంటే రాష్ట్ర ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. అవసరమైన ప్రణాళికలతో ముందుకు వెళ్తామన్నారు. హరీశ్‌రావు ఢిల్లీ రహస్య పర్యటనన మీడియా బయట పెట్టిందని తెలిపారు. హరీశ్‌రావు రహస్య పర్యటన వెనక మతలబు ఏంటో తెలంగాణ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో ఎవరెవరిని కలిశారో హరీశ్‌రావు బయటపెట్టాలని సవాల్ విసిరారు.

## సంపాదకీయం

# కవిత పార్టీతో బిఆర్ఎస్‌కే దెబ్బ !

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కొత్తపార్టీ ప్రకటన మరో నాలుగు రోజుల్లో రానుంది. ఆమె దూకుడు గా రాజకీయాలు నెరపుతున్నారు. టిఆర్ఎస్ పార్టీ పేరు ఖాళీగా ఉంది కనుక దానిని ఎవరైనా వాడుకో వచ్చని అన్నారు. అయితే ఈ నెల 25న ఆమె పార్టీ ప్రకటించనున్నారు. అప్పుడే పార్టీ పేరు ఏంటన్నది తెలుస్తుంది. ఈలోగా చేరికలను ప్రోత్సహిస్తున్నారు. దళితులు, ఆదివాసీలు, బిసిలు లక్ష్యంగా ఆమె చేరికలను ప్రోత్సహిస్తున్నారు. ఇకపోతే టిఆర్ఎస్ పార్టీని పునరుద్ధరించే ఆలోచన ఉన్నట్లు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ ఇటీవల ప్రకటించారు. దీంతో ఇప్పుడు టిఆర్ఎస్ కవితకు దక్కిందా లేదా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే తెలంగాణ ఏర్పడ్డ తర్వాత రెండు పర్యాయాలు అధికారం దక్కడంతో అహంకారంతో విర్రవీగడం, ప్రజలను కావాలనే దూరం పెటట్డం, సిఎం ప్రజలను కలవాల్సిన పనిలేదని చెప్పడం లాంటివన్నీ ప్రజలు గమనించారు. బుద్ది చెప్పాలన్న నిర్ణయానికి వచ్చిన ప్రజలు కెసిఆర్‌ను ఓడించారు. ఎపిలో కూడా జగన్ ఇలాగే నిరంకుశంగా పాలించారు. సొంత డబ్బా కొట్టుకోవడం, సొంత ప్రయోజాలే పాలనగా చూడడం, మద్యం, ఇసుక, మట్టి మాఫియాలు పెరగడం వంటి కారణాలన్నీ తోడయ్యాయి. ప్రజాధనంతో విశాఖలో ఇంద్రభవనాలు కట్టుకోవడం వంటివన్నీ ఎదురుదెబ్బతీసాయి. అందుకే 11 సీట్లకే పరిమితం చేశారు. పాలకులు ఒళ్లు దగ్గరపెట్టుకుని పాలించాలి. తెలంగాణలో ఇప్పుడు రేవంత్ రెడ్డి, ఆయన మంత్రివర్గ సహచరులు కూడా ఇదేవిధంగా పనిచేస్తున్నారు. పైకి ప్రజాపాలన అని చెప్పి ప్రకటనలు చేయడం తప్ప, ఒక్క అభివృద్ధి పని జరగడం లేదు. ఇది రేవంత్ కూడా గుర్తించాలి. లేకుంటె కాంగ్రెస్ పార్టీకి కూడా ఇదే గతి పడుతుంది. ఇకపోతే అపర చాణక్యుడిగా పేరొందిన కేసీఆర్ 2023 ఎన్నికల్లో ఓడిపోయాక కనసీం అసెంబ్లీకి రావడం లేదు. ప్రజల్లోకి రావడం లేదు. ఠంచన్‌గా జీతాలు మాత్రం పొందుతున్నారు. ఈ క్రమంలో పార్టీ పేరును మళ్లీ తెలంగాణ రాష్ట్ర సమితిగా మార్చే విషయం పరిశీలిస్తున్నామని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పుకొచ్చారు. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చాలనుకున్నప్పుడు అది సరైన నిర్ణయం కాదని వచ్చిన విమర్శలను పట్టించుకోలేదు. సరికదా జాతీయ పార్టీగా ప్రకటించి పలు రాష్ట్రాల్లో ఊరేగారు. తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మార్చాలనుకోవడం ఆత్మహత్యాసదృశం అవుతుందని వచ్చిన హెచ్చరికలను పెడచెవిన పెట్టారు. తెలంగాణ అన్న పేరుకు దూరమవడం తెలివి తక్కువ నిర్ణయమని గుర్తించలేకపోయారు. పార్టీలోని మెజారిటీ నాయకులు కూడా ఇదే అభిప్రాయంతో ఉండేవారు. అయితే ఎవరూ నోరు విప్పడానికి సాహసించలేకపోయారు. భిన్నాభిప్రాయాలను కేసీఆర్ ప్రోత్సహించేవారు కాదు. ఎవరు కూడా ఆయన నిర్ణయాలను నిలదీసే ధైర్యం చేసేవారు కాదు. ఇది పార్టీలో ప్రజాస్వామ్యం లేదనడానికి నిదర్శనం. కెసిఆర్ చెప్పిందే వేదం అన్నట్లుగా పార్టీ నడిచింది. ప్రాంతీయ పార్టీల్లో ఇది సహజమే అయినా ఆలోచనలను పంచుకోవాలి. కేసీఆర్‌లో అపర చాణుక్యుడని, అనేక తెలివితేటలు ఉన్నాయని, ఆయన వేసే రాజకీయ ఎత్తుగడలకు తిరుగుండదని, ఆయన ఎలా చెబితే అలాగే జరుగు తుందని నమ్మే స్థితికి పార్టీ నేతలు వచ్చారు. ఈ కారణంగానే తెలంగాణ రాష్ట్ర సమితిని జాతీయ పార్టీగా విస్తరించి భారత రాష్ట్ర సమితి పేరిట ఇతర రాష్ట్రాలలో కూడా పోటీ చేసి తగినన్ని సీట్లు గెలుచుకొని కేంద్రంలో చక్రం తిప్పుతానని కేసీఆర్ పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నారు. ఇతర ప్రాంతీయ పార్టీల నాయకులను కలిసి తనకుతాను అతిపెద్ద నాయకుడిగా ఊహించుకున్నారు. జాతీయ రాజకీయాల పేరుతో నేల విడిచి సాము చేసిన కెసిఆర్ బొక్కబోర్లా పడ్డారు. తెలంగాణను బాగుచేయకుండా, అవినీతికి గేట్లు తెరిచి, జాతీయ రాజకీయాలు అంటూ కేసీఆర్ ఊరేగడాన్ని తెలంగాణ సమాజం కూడా హర్షించలేదు. ఫలితంగానే 2023లో కెసిఆర్ ఓడించారు. పార్టీలో సమష్టి నిర్ణయాలు, ఆలోచనలకు తావులేకుండా చేయడం వల్లనే కేసీఆర్ రాజకీయంగా దెబ్బతిన్నారు. దీనికితోడు తెలంగాణ ఉద్యమంతో సంబంధం ఉన్న వారిని బయటకు తరిమేశారు. తమకు తిరుగు లేకుండా చూసుకున్నారు. పార్టీలో పోరాటం చేసిన వారెవరూ లేకుండా చేయడం వల్లనే బీఆర్ఎస్‌కు ప్రస్తుత దుస్థితి ఏర్పడింది. తండ్రీ, తనయులదే పెత్తనంగా సాగింది. ఇద్దరు నేతల్లో నియంతృత్వ పోకడలు పెరగడంతో సమష్టి నిర్ణయాలకు ఆస్కారం లేకుండా పోయింది. అధికారంలో ఉన్నప్పుడు తప్పులు చేశామని ఇంత కాలానికి కేటీఆర్ అంగీకరించారు. ఇదొక శుభ పరిణామం. అధికారంలో ఉన్నప్పుడు అహంకారంతో, అతిశయంతో వ్యవహరించిన వారికి గుణపాఠాలు తప్పవు. ఎన్టీఆర్ అంతటి నాయకుడు కూడా ఎన్నికల్లో ఓడిపోయారు. ఈ ఉదంతాలు తెలిసి కూడా కేసీఆర్ అదే బాటలో అహంభావంతో వ్యవహరించారు. నేల విడిచి సాము చేశారు. పరాజయం మూటగట్టుకున్నారు. ఏ పార్టీకైనా బలమైన నాయకుడు ఎంత ముఖ్యమో స్వతంత్రంగా ఆలోచించి ప్రజాభిప్రాయాన్ని అధినాయకుడికి నిక్కచ్చిగా చెప్పగలిగిన నాయకులు కూడా అంతే అవసరం. కేవలం కొడుకు, అల్లుళ్లను పట్టుకుని వేలాడడం వల్లనే ఈ దుస్తితి ఏర్పడింది. కూతరు కవిత బయటకు పోయింది. ఆమె పార్టీ పెడితే మొదట దెబ్బతినేది కూడా బిఆర్ఎస్ అని గుర్తించాలి.

# అనుకున్నదొకటి.. అయిందొకటి!



ఆటలో కచ్చితంగా ఓడిపోతామని తెలిశాక ఎవరైనా ఆడతారా? పరాజయంలో కూడా ఏదో ప్రయోజనం ఉంటే తప్ప ఎవరూ ఓడిపోయే ఆట ఆడాలనుకోరు. మరి కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఎందుకని అంకెలు అంత స్పష్టంగా కనిపిస్తూ ఉండగా ఓడిపోవడానికి సిద్ధపడింది? ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం పార్లమెంట్లో మొట్టమొదటిసారి ఓటమిని చవిచూడటానికి ఎందుకు సిద్ధపడింది? ఈ నెల 16 నుంచి 18 వరకు మూడు రోజులపాటు జరిగిన పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలలో ప్రభుత్వం ప్రతిపాదించిన మూడు బిల్లులు వీగిపోతాయని ఆరవ తరగతి చదివే విద్యార్థి కూడా చెప్పగలడు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే హాజరయిన సభ్యులలో తప్పనిసరిగా మూడింట రెండువంతుల బలం ఉంటే తప్ప సాధ్యం కాదన్న విషయం నరేంద్ర మోడీకి, ఆయన ప్రభుత్వంలోని పెద్దలందరికీ బాగా తెలుసు. అయినా సరే, కేంద్ర ప్రభుత్వం ఈ మూడు బిల్లులను ప్రతిపాదించేందుకు ఈ సమయాన్ని ఎందుకు ఎంచుకున్నట్టు? ఇందులో ఒకటి చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు. రెండవది నియోజక వర్గాల పునర్విభజనకు సంబంధించినది. మూడవది కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల సవరణకు సంబంధించిన బిల్లు. నిజానికి మామూలు పరిస్థితుల్లో ప్రతిపక్షాలు కూడా వీటిని వ్యతిరేకించవలసిన అవసరం లేదు. ముఖ్యంగా మహిళా రిజర్వేషన్ బిల్లు. ఈ బిల్లు నిజానికి 2023లోనే ఏకగ్రీవంగా పార్లమెంట్ ఆమోదం పొంది ఉన్నది. దానిని ప్రస్తుతం డీలిమిటేషన్‌తో లింక్ చేస్తూ తీసుకురావడాన్ని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు యోగేంద్ర యాదవ్ భాషలో చెప్పాలంటే ప్రతిపక్షాలను వాటికి ఆమోదం కానీ అంశంలో ఒప్పించేందుకు ఒక చీరను చుట్టి తీసుకొచ్చారు. పోలిక అభ్యంతరకరంగా ఉండవచ్చు కానీ ఆయన ఉద్దేశం డీలిమిటేషన్ బిల్లును మహిళా రిజర్వేషన్ బిల్లు ముసుగులో తీసుకువచ్చారు అని. ఒకవైపు ఐదు రాష్ట్రాలలో శాసనసభ ఎన్నికలు జరుగుతుండగా, ముఖ్యమైన రెండు రాష్ట్రాలలో (పశ్చిమ బెంగాల్, తమిళనాడు) పోలింగ్ ఇంకా జరగాల్సి ఉండగా ఇంత హడావుడిపడి బిల్లులు ఎందుకు ప్రవేశపెట్టాలనుకున్నట్టు? సమాజ్ వాదీ పార్టీ నాయకుడు అఖిలేష్ యాదవ్ నిన్నటి చర్చలో పాల్గొంటూ ఇది నారీ బిల్లు కాదు ఎన్‌డిఎ 'నారా' అన్నారు. ఉర్దూలో 'నారా' అంటే నినాదం. మహిళలను విపక్షాలనుండి దూరం చేసి ఎన్నికలలో లబ్ధి పొందేందుకు నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్‌డిఎ ఈ నారీశక్తి వందన్ అధినియం బిల్లును మరొకసారి తెరమీదకి తెచ్చిందని అఖిలేష్ యాదవ్ అభిప్రాయం. 2029 ఎన్నికలలో మహిళాబిల్లుకు విపక్షాలు అడ్డుకొట్టాయన్న నినాదం తీసుకుని జనంలోకి వెళ్ళే ఆలోచన బిజెపి చేస్తున్నదని. అదే నిజమని ఒకటికి రెండుసార్లు శుక్రవారం సభలోపలా వెలుపలా జరిగిన సంఘటనలు స్పష్టం చేశాయి. సభలో రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయిన వెంటనే భారతీయ జనతా పార్టీ, దాని మిత్రపక్షాల మహిళాసభ్యులంతా ముందే తయారు చేయించి పెట్టుకున్న ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేయడం ఒక ఉదాహరణ. అంతేకాదు, అంతకు ముందురోజు రాత్రి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్వయంగా దేశంలోని మహిళలంతా తమవైపు చూస్తున్నారనీ, విపక్షాలు మద్దతు ఇవ్వకపోయినా, బిల్లు వీగిపోయినా తనకే లాభం అని చేసిన హెచ్చరికలాంటి వ్యాఖ్యలు అయినా, చివరగా చర్చకు సమాధానమిస్తూ హోంమంత్రి అమిత్ షా మాట్లాడిన మాటలు అయినా కచ్చితంగా ఈ సవరణ బిల్లు వీగిపోనున్నదని వారికి ముందే తెలుసునన్న విషయం స్పష్టం చేశాయి. అంతేకాదు, ఇదంతా మోడీ ప్రభుత్వం ఒక రాజకీయ ఎత్తుగడగా చేసిందని అర్థమైంది. ఈ బిల్లును వ్యతిరేకించడానికి మొత్తం ప్రతిపక్షం ఒక్కటైందన్న విషయం కూడా రాహుల్ గాంధీతో సహా ప్రతిపక్ష సభ్యులందరి మాటల్లో స్పష్టంగా అర్థం అయింది. ఎన్నికల్లో మహిళల ఓట్లు సంపాదించుకునేందుకు ప్రతిపక్షాల మీద బురద జల్లి ప్రయోజనం లేదు. మహిళలకు ప్రాతినిధ్యం కల్పించే క్రమంలో అందులో కూడా వివిధ వర్గాలకు రిజర్వేషన్ల విషయం కూడా తేల్చాలి. ఒబిసిలు, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీల ప్రాతినిధ్యం విషయంలో ప్రతిపక్షాలు తెస్తున్న ప్రతిపాదనల్ని పట్టింపులకు పోకుండా చర్చించి ఆమోదిస్తేనే ప్రభుత్వపక్షం ఈ అంశంలో నిజాయితీగా వ్యవహరిస్తోందని అనుకోవచ్చు. మహిళా రిజర్వేషన్ల శాతం ఒకసారి నిర్ణయిస్తే నియోజకవర్గాల సంఖ్య పెంచినప్పుడల్లా అదే శాతం వారికి వర్తింపజేయవచ్చు. దీనికి ఇబ్బంది ఏమీ ఉండదు. ఇక డీలిమిటేషన్ విషయంలో దక్షిణాది రాష్ట్రాలు కేరళ, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలు వెలిబుచ్చిన అభిప్రాయాలను సీరియస్‌గా పరిగణనలోకి తీసుకొని దక్షిణాదిపట్ల కేంద్రం వివక్ష చూపుతున్నదన్న అభిప్రాయం ప్రజల్లో పెరగకుండా చూడాలి. ఆంధ్రప్రదేశ్‌లో అధికార, విపక్షాలు రెండూ కేంద్రప్రభుత్వం తెచ్చిన సవరణకు మద్దతుగా నిలిచి మిగిలిన దక్షిణాది రాష్ట్రాల నుండి వేరుపడి విమర్శకు తావిచ్చాయి. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది కాబట్టి ఇక లోకసభ స్థానాలు 2026 సెన్సస్ (జనాభా లెక్కల) ప్రకారం జరుగుతాయి. అటువంటప్పుడు ఆంధ్రప్రదేశ్ 5, తెలంగాణ 3, తమిళనాడు 10, కర్ణాటక 2, కేరళ 7, ఒడిశా 4, పశ్చిమ బెంగాల్ 4 సీట్లు ప్రస్తుతం ఉన్నసంఖ్య కంటే తగ్గుతాయని, ఉత్తరప్రదేశ్‌కు, బీహార్‌కు 10, మధ్యప్రదేశ్‌కు 5, రాజస్థాన్‌కు 7 స్థానాలు పెరుగుతాయని బిల్లు వీగిపోయి 24 గంటలైనా గడవకముందే ఎన్‌డిఎ అభిమానులు ప్రచారం మొదలుపెట్టారు. దీనివల్ల బిజెపికే లాభం జరుగుతుందని చంకలు గుద్దుకుంటున్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం అన్నిపక్షాలను సమావేశపరిచి, వారితో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన విధంగా నియోజకవర్గాల సంఖ్యను పెంచడం కానీ, వాటి పునర్విభజన జరపడం కానీ చేయకపోతే ముందుముందు దేశ సమగ్రతకు నష్టం జరుగుతుందన్న విషయం బాధ్యతగల రాజకీయ పక్షాలన్నీ గుర్తించాలి. రాజ్యాంగ సవరణ మీద చర్చకు చివరగా సమాధానం ఇస్తున్న సందర్భంగా ఒక దశలో అమిత్ షా దక్షిణాది రాష్ట్రాలన్నిటికీ 50 శాతం స్థానాలు పెరిగే విధంగా ఒక సవరణ బిల్లు తేవడానికి సిద్ధమని చెప్పిన విషయం మర్చిపోకూడదు. అంతా సవ్యంగా సాగితే డీలిమిటేషన్ వల్ల 273 లోకసభ స్థానాలు, రెండువేల అసెంబ్లీ స్థానాలూ పెరుగుతాయి. సహజంగానే రాజ్యసభ స్థానాలూ, శాసన మండలి స్థానాలు పెరగక తప్పదు. ఒక్కో పార్లమెంట్ సభ్యుడికి ఏడాదికి నాలుగు కోట్ల 29 లక్షల రూపాయలు వివిధ పద్దుల కింద ప్రజాధనం ఖర్చు అవుతున్నది. 273 మంది కొత్తగా చేరితే ఈ లెక్కన సంవత్సరానికి 1,171 కోట్లు ఖర్చు అవుతుంది. అంటే, అయిదు సంవత్సరాలకు 5,855 కోట్లు అని ఒక అంచనా. ఇదంతా ఇప్పటికే లోకసభలో ఉన్న 543 మంది సభ్యులకు అయ్యే ఖర్చుకు అదనం. ఇక రాష్ట్రాల శాసనసభల సభ్యులకు అయ్యే ఖర్చు అదనం. వీటితోబాటు చట్టసభల నిర్వహణకు అవుతున్న వ్యయం వేరు. ఇన్ని వేలకోట్ల ప్రజాధనం ఖర్చు చేస్తున్నందుకు ప్రజోపయోగమయిన పనులు ఎన్ని జరుగుతున్నాయి? ఆమ్‌ఆద్మీ రాఘవ్ చడ్డాను అడగాలి.

## వంద రూపాయల అప్ప ఇవ్వనందుకు దాడి

### దంపతులపై దాడిలో భర్త మృతి

మంచిర్యాల,ఏప్రిల్20 : మంచిర్యాలలో దారుణం చోటుచేసుకుంది. అప్పు ఇవ్వలేదన్న కోపంతో ఓ వ్యక్తి ఘాతుకానికి ఒడిగట్టాడు. దంపతులపై కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో భర్త చనిపోగా.. భార్య పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. దండేపల్లి మండలం ముత్యంపేటకు చెందిన శంకరయ్య దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఓ వ్యక్తి దుకాణం దగ్గరకు వచ్చాడు. 100 రూపాయలు అప్పు ఇవ్వమని అడిగాడు. ఇందుకు శంకరయ్య ఒప్పుకోలేదు. దీంతో ఆ వ్యక్తి గొడవకు దిగాడు. గొడవ చిలికిచిలికి గాలివానలా మారింది. విచక్షణ కోల్పోయిన ఆ వ్యక్తి శంకరయ్యపై కత్తితో దాడి చేశాడు. అడ్డం వచ్చిన శంకరయ్య భార్యపై కూడా దాడి చేశాడు. దాడి అనంతరం అక్కడినుంచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడ్డ శంకరయ్య దంపతులను స్థానికులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శంకరయ్య ప్రాణాలు విడిచాడు. ఆయన భార్య పరిస్థితి విషమంగా ఉంది. ఇక, సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుడి కోసం గాలిస్తున్నారు.

## అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో మంటలు

### ఫైర్ సిబ్బంది రాకతో తప్పిన ముప్పు


హైదరాబాద్,ఏప్రిల్20 : గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అపార్ట్‌మెంట్ మొత్తం దట్టమైన పొగ అలముకుంది. ఈ ఘటనలో ఇద్దరు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. బిల్డింగ్ సెల్లార్‌లో షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో సెల్లార్‌లోని 15 ద్విచక్ర వాహనాలు అగ్నికి ఆహుత య్యాయి. తీవ్ర అస్వస్థతకు గురైన ఇద్దరిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

## వాతావరణం అనుకూలించక సమస్య

### హుబ్లీ వెళ్లాల్సిన విమానం బెంగళూరుకు మళ్లింపు

హైదరాబాద్,ఏప్రిల్20 : హైదరాబాద్ నుంచి హుబ్లీ వెళుతున్న ఫ్లై 91 విమానాన్ని బెంగళూరుకు దారి మళ్లించారు. వాతావరణం అనుకూలించకపోవడంతో విమానం గాల్లో ఉండగానే సాంకేతిక సమస్య ఎదురైనట్టు అధికారులు వెల్లడించారు. దీంతో విమానాన్ని దారి మళ్లించాల్సిన పరిస్థితి వచ్చిందని, విమానంలోని ప్రయాణికులంతా సురక్షితంగానే ఉన్నారని తెలిపారు. ఆదివారం రోజు సాంకేతిక సమస్యల వల్ల విమానం మూడు గంటలపాటు గాల్లోనే చక్కర్లు కొట్టింది. ఈ ఘటనతో ప్రయాణికులు భయాందోళనల కు గురయ్యారు. కొందరు భయంతో బిగ్గరగా ఏడుస్తూ, క్షేమంగా కిందకు దిగాలని ప్రార్థనలు చేశారు. ఆదివారం సాయంత్రం 3.30 గంటల సమయంలో హైదరాబాద్ నుంచి బయల్దేరింది. అది 4.30కి హుబ్లీ చేరుకోవాలి. కానీ వాతావరణం అనుకూలించకపోవడంతో దాన్ని బెంగళూరుకు దారి మళ్లించాల్సి వచ్చిందని సంబంధిత అధికారులు తెలిపారు. ఆ తర్వాత బెంగళూరు నుంచి తిరిగి సాయంత్రం 6.30కు ప్రారంభమైంది. హుబ్లీ చేరుకునేసరికి రాత్రి 11 గంటలు అయ్యింది. 22 మంది ప్యాసింజర్లు సురక్షితంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. ఇదిలాఉండగా, వాతావరణ పరిస్థితుల వల్ల ముంబయి నుంచి కొల్హాపుర్‌కు వెళ్లాల్సిన మరో విమానాన్ని గోవాకు మళ్లించారు. విమానంలో సమస్య ఏం లేదు, ఇందులోని ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నారని సంబంధిత అధికారులు తెలిపారు.

## అజ్ఞాన హరణమే.. అంబర అపహరణం



ఆధ్యాత్మికం

శ్రీమద్భాగవతం శ్రీకృష్ణలీలామృత సాగరం. ఈ లీలలన్నీ అప్రాకృతాలు- అభౌతికాలు, చిన్మయాలు. అధ్యాత్మ తత్త రహస్య భావనాగర్భితాలు. అనంత రస వర్షకాలు. అవి భౌతికాల వలె కనిపించినా చక్కగా విచారణ జరిపితే జీవుల భౌతిక-ప్రాపంచిక వాసనలను, జీవత్వాన్ని పూర్తిగా తొలగించి చిన్మయత్వాన్ని ప్రసాదిస్తాయి. జీవుల కర్మలు కర్తృత్వ బుద్ధి (అహంకారం)తోను, స్వార్థం (మమకారం)తోను కూడి ఉంటాయి. కనుక, అవి బంధకాలు- జన్మ సంసార బంధనాలు కలిగిస్తాయి. కాని, (జన్మకర్మ చ మే దివ్యం- గీత) దేవదేవుని కర్మలు దివ్యములు. కాన మోచకాలు- జీవుల బంధనాలు తొలగిస్తాయి. వీటికి 'లీలలు' అని పేరు. 'లయనం లాతి ఇతి లీలా'- మనస్సును లయింపజేసి ముక్తిని కలిగించేదే లీల. 'మనోనాశో మహోదయః'- మనస్సు నశించుటే మోక్షమని శాస్త్రం. అయితే, బాలకృష్ణుని లీలా విమర్శ చేసేటప్పుడు అతని నామ, రూప, గుణచేష్టలు ప్రాకృతాలు-పాంచభౌతికాలు కావు అన్న విషయం చాలా ముఖ్యం. 'న భూత సంఘ సంస్థానో దేవస్య పరమాత్మనః..' అని మహాభారతంలో వ్యాస వచనం. 'దామోదర భగవంతునిలో 'దేహము-దేహి' అన్న భేదం ఉండదు. ఆయన శరీరం పాంచ భౌతికం కాదు. అలా భూత సముదాయంగా భావించేవారు కర్మాధికారాన్ని కోల్పోతారు. అట్టివారి ముఖం చూసినా సచేల స్నానం చెయ్యాలి'. అంటే, అది అంతగా దోషావహ మన్నమాట! భాగవతంలోని నవనీత చౌర్యం, చీర (వస్త్ర) హరణం, రాసలీల- ఇవన్నీ దివ్య చిన్మయి లీలలు. కాని, అధిక ఆక్షేపణకు, అపార్థాలకు గురైన ఘట్టాలు.

# మాతృభూమి సేవ, సమాజ సేవ కోసం వందేళ్లుగా ఆర్ఎస్ఎస్

- ధర్మ, సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణ, దేశ హితం కోసం ఆర్ఎస్ఎస్, అనుబంధ విభాగాలు నిరంతరం పనిచేస్తున్నాయి • ఆర్ఎస్ఎస్ విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ సామల కిరణ్

**కరీంనగర్ టౌన్, ఏప్రిల్20(ది క్రైమ్ న్యూస్):** మాతృభూమి సేవ కోసం, సమాజ సేవ కోసం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వందేళ్లుగా పనిచేస్తుందని ఆర్ఎస్ఎస్ విభాగ్ బౌద్ధిక్ ప్రముక్ సామల కిరణ్ అన్నారు. తిమ్మాపూర్ ఉపమండలం శ్రీ అనంతపద్మనాభ స్వామి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో హిందూ సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఈ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య వక్తక హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వందేళ్లుగా దేశాహితం కోసం, హిందూ ధర్మ, సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణ కోసం పనిచేస్తుందన్నారు. ఆర్ఎస్ఎస్ అనుబంధ విభాగాలు సైతం అదే లక్ష్యంతో ఆయా రంగాలలో రాణిస్తున్నాయన్నారు. సంఘ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆర్ఎస్ఎస్ పిలుపునిచ్చిన మేరకు హిందూ సమ్మేళనాలు దేశవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగు తున్నాయన్నారు. ఆర్ఎస్ఎస్ నేడు శతాబ్ది ఉత్సవాలలో భాగంగా పంచ పరివర్తన్ కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేసిందన్నారు. ముఖ్యంగా సామాజిక సమరత, పర్యావరణ పరిరక్షణ, కుటుంబ ప్రబోధన్, స్వదేశీ ఆచరణ , పౌర బాధ్యత నియమాలు అనే ఐదు అంశాల ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం హిందూ సమ్మేళనాలు హిందూ సమాజం ఐక్యతతో కొనసాగాలనే ఉద్దేశంతో నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రధానంగా సమాజంలో కులాల పేరుతో పెరుగుతున్న విభజన తో హిందువులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని, హిందూ సమాజం ఐక్యంగా ఉన్నప్పుడే దేశం, ధర్మం సుస్థిరంగా ఉంటుందన్నారు. ఐకమత్యత లేని కారణంగా నేడు ప్రపంచంలోని అనేక దేశాలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడు తున్నాయన్నారు. హిందువులు ఐక్యంగా, సంఘటితశక్తిగా మారాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. హిందూ ధర్మం ఎంతో గొప్పదని,. సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రతి ఒక్కరు దేశభక్తి, జాతీయభావం పెంపొందించుకోవాలని సూచించారు. ప్రాంత సేవికా సమితి శారీరక్ ప్రముక్ లెక్కల రమాదేవి, జిట్స్ వేద పాఠశాల ప్రధాన చార్యులు కళకుట్ల వరప్రసాద్ఆచార్యులుమాట్లాడుతూ హిందూ ధర్మం ఎంతో పురాతనమైనదని, హిందూ ధర్మం విశిష్టమైన చరిత్ర కలిగి ఉందన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరు నడుం బిగించాలన్నారు. సనాత ధర్మ పరిరక్షణ మనందరికీ శ్రీరామరక్ష లాంటిదన్నారు. ఆడపిల్లలను లవ్ జిహాద్ భారీ నుండి





రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యువత చెడు మార్గాలను అనుసరించకుండా, సన్మార్గం పైపు పయనించడానికి ఆలోచించాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రశాంత జీవితాన్ని అలవర్చు కోవాలని, ధార్మిక, ఆధ్యాత్మిక మార్గాల వైపు మనసును మళ్లించుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. ధర్మాన్ని రక్షించినప్పుడే ఆ ధర్మం కూడా మనల్ని రక్షిస్తుందని తెలిపారు. శ్రీ అనంత పద్మనాభ స్వామి హిందూ సమ్మేళనం కమిటీ బాధ్యులు, ఆర్ఎస్ఎస్ పెద్దలు కిషన్, సామాజిక సమరత తెలంగాణ ప్రాంత కార్యదర్శి పూల్లూరి రామారావు, తిమ్మాపూర్ ఖండ కార్యవాహ ఆవుల కుమార్, తిమ్మాపూర్ ఉప మండల ప్రముఖ్ కన్నం సాయి, తిమ్మాపూర్ ఉప మండలంలోని 8 గ్రామాల హిందూ బంధువులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో మైనారిటీ గురుకుల విద్యార్థులకు మెరుగైన ఫలితాలు

- మైనార్టీ గురుకుల కళాశాలను విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి • మైనార్టీ గురుకుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పడిశెట్టి సంపత్

**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 20(ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన 2026 విద్య సంవత్సరానికి సంబందించిన ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో మైనారిటీ గురుకుల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని తెలంగాణ మైనారిటీ గురుకుల కళాశాల మానకొండూర్ బాలుర – 1 ప్రిన్సిపాల్ డాక్టర్ పిడిశెట్టి సంపత్ తెలిపారు. ఎంపీసీ / బైపీసీ విభాగంలో హుజురాబాద్ బాలుర కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో ఎన్.రాజకుమార్ స్వామి 948 /1000, అంజన్న 900 /1000 ఎం.రాహుల్ 916 /1000, శ్రీనాథ్ రెడ్డి 913 /1000 అలాగే ప్రథమ సంవత్సరంలో మొహమ్మద్ హనీఫ్ 447 /470, మొహమ్మద్ సమీర్ 445 /470, షేర్ ఖాన్ 431 /440, పి.రోహిత్ 431 /440 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ కుమారస్వామి తెలిపారు. ఆర్ట్స్ విభాగంలో మానకొండూర్ బాలుర కళాశాలలో ప్రథమ సంవత్సరంలో మనోజ్ 460 /500, ఎండీ. రెహాన్ 446 /500, రాజేష్ 442 /500 , ఎం.సాగర్ 433 /500 ద్వితీయ సంవత్సరంలో ఎండీ. అష్రాఫ్ 866 /1000 , సి.హెచ్ చందు 857 /1000, డి.అభిషేక్ 828 /1000 మార్కులు






సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ పిడిశెట్టి సంపత్ తెలిపారు. అదేవిధంగా బాలికల కళాశాలల్లో కరీంనగర్ గర్ల్స్ –2 ఎంపీసీ / బైపీసీ విభాగంలో ద్వితీయ సంవత్సరంలో తబస్సుమ్ లారా 988 /1000, అఫ్రీన్ ఫాతిమా 982 /1000, సాజిదా 981 /1000 ఆలాగే 900 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు సంఖ్య గణనీయంగా ఉన్నారని ప్రథమ సంవత్సరంలో అలీజా మరియం 459 /470, మెహరోజ్ తంకీన్ 458 /470, షైక్ సుహానా 450 /470 లతో 400 పైగా మార్కులు సాధించిన వారు 30 మంది ఉన్నారని ప్రిన్సిపాల్ ఎన్. సరిత ఈ సందర్భంగా తెలిపారు. ఆర్ట్స్ విభాగంలో చొప్పదండి బాలికల కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో జాస్మిన్ 965 /1000 , మౌనిక 959 /1000 , పావని 957 /1000 , శీరీన్ 950 /1000 , రుత్విక 933 /1000 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ జి.వారుణీ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పిడిశెట్టి సంపత్ మాట్లాడుతూ విద్యార్థులు కృషి , ఉపాధ్యాయుల అంకితభావం, క్రమశిక్షణతో కూడిన విద్య విధానం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు. మైనారిటీ గురుకులాల కో ఆర్డినేటర్ రమేష్ లాల్ హత్కర్, విజిలెన్సు అధికారులు ఎం.డి . అక్రమ్ పాషా, ఇంతియాజ్ అలీ, అకాడమిక్ కో ఆర్డినేటర్ ఎం.డి మీరాజ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను అభినందించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , మైనారిటీ గురుకులాల సొసైటీ అధ్యక్షులు ఫహీమ్ ఖురేషి, సెక్రటరీ బి. షఫీఉల్లా, డి.ఐ .ఓ సుభాన్ లకు ప్రిన్సిపాళ్లు కృతజ్ఞతలు తెలిపారు. మైనారిటీ గురుకులాల్లో ప్రవేశాలు కొనసాగుతున్నాయని ఇట్టి అవకాశాన్ని మైనారిటీలు వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 7995057932 కు సంప్రదించాలని కోరారు.

# కాటారం ఆదర్శ హై స్కూల్లో ఘనంగా 36వ వార్షికోత్సవ వేడుకలు

- చిన్నారులే రేపటి దేశ భవిష్యత్తు: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**భూపాలపల్లి/కాటారం/ఏప్రిల్ –20: (ది క్రైమ్ న్యూస్):** మండలకేంద్రంలోని ఆదర్శ హైస్కూల్లో ఆదివారం రాత్రి నిర్వహించిన 36వ వార్షికోత్సవ, గ్రాడ్యుయేషన్ ఫెస్ట్, కల్చరల్ కార్నివాల్ వేడుకలకు రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. చిన్నారులే రేపటి దేశ భవిష్యత్తు అని అన్నారు. 36 ఏళ్లుగా గ్రామీణ ప్రాంతంలో ఆదర్శ విద్యా సంస్థ అందిస్తున్న సేవలను అభినందించి, పలువురు విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్స్, మెడల్స్ ను అందజేశారు. బాల్యంలోనే మంచి విద్య, విలువలు అలవాటు పడితే పిల్లలు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని పేర్కొన్నారు. చిన్నారుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు పాఠశాలలు, తల్లిదండ్రులు కలిసి కృషి చేయాలని సూచించారు. మారుతున్న



కాలానికి అనుగుణంగా విద్యార్థులకు ఆధునిక పరిజ్ఞానం అందించాలన్నారు. కాటారంలో ప్రభుత్వ విద్యాలయాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తూ ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ జనగామ కరుణాకర్ రావు, కరస్పాండెంట్ జనగామ కార్తీక్ రావు, ఏఎంసీ చైర్ పర్సన్ పంతకాని





తిరుమల, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, నాయకులు దబ్బెట రాజేష్, పసుల మొగిలి, కొట్టే శ్రీహరి, ప్రభాకర్, మల్లయ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


# ఘనంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు



**ఎండపల్లి, ఏప్రిల్ 20(ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో ఎండపల్లి మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాయంచు సదాశివ గుప్త ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నలిమెల సముద్రాల రమేష్ గుప్తా, మండప సత్యనారాయణ, అర్ధవెల్లి శంకరయ్య తో పాటు తెలుగుదేశం పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులపై అసత్య ప్రచారం... ఇద్దరు విలేకరులపై కేసు నమోదు

**ఇల్లంతకుంట, ఎప్రిల్ 20(ది క్రైమ్ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని ఇద్దరు విలేకరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సిరిసిల్ల అశోక్ తెలిపారు. మండలానికి సంబంధించిన ఓ వాట్సాప్ గ్రూప్లో ఈనెల 14, 15 తేదీల్లో పిల్లలను బడికి పంపాలంటే భయపడి సమాజంలో ఉపాధ్యాయులపై నమ్మకం పోయేలా వారిని కించపరుస్తూ కీచక ఉపాధ్యాయుడంటూ నిరాధారమైన పోస్టులు పెట్టిన బొల్లం పరశురాం, వడ్డిక అనీల్ రెడ్డి అనే ఇద్దరు విలేకరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలుపుతూ సరైన ఆధారాలు లేకుండా ఊహాగానాలతో వార్తలు ప్రచురించరాదని ఎస్ఐ తెలిపారు.




# కరీంనగర్లో ఘనంగా 'కార్తికేయ జువెలరీస్' ప్రారంభోత్సవం





**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 20(ది క్రైమ్ న్యూస్):** నగరంలోని అజ్మత్పుర, ఎస్ బి ఐ బ్యాంక్ టవర్ సర్కిల్ బ్రాంచ్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన 'కార్తికేయ జువెలరీస్' షోరూమ్ను సోమవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఘనంగా ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం, ఆయన షోరూమ్లోని నూతన ఆభరణాల కలెక్షన్ను ఆసక్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా షోరూమ్ యజమాని మల్యాల ప్రభాకర్ మాట్లాడుతూ వినియోగదారులకు నమ్మకమైన నాణ్యతతో పాటు, సరసమైన ధరలకే అద్భుతమైన డైమండ్స్, వివిధ రకాల రింగ్స్ మరియు అత్యాధునిక డిజైన్లను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ వేడుకలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్తో పాటు కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి, స్థానిక కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, ప్రముఖ వ్యాపారవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నగర ప్రజలకు నాణ్యమైన బంగారు, వజ్రాల ఆభరణాలను అందించాలనే లక్ష్యంతో ఈ షోరూమ్ ప్రారంభించినట్లు యాజమాన్యం పేర్కొంది.

# లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం







**కరీంనగర్ టౌన్, ఏప్రిల్20(ది క్రైమ్ న్యూస్):** లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో కరీంనగర్ పట్టణం భాగ్యనగర్, న్యూ లేబర్ అడ్డాలో గల హరిహర క్లినిక్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా బిపి, షుగర్ పరీక్షలను, నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు, సూచనలు అందజేశారు. డా. రవికాంత్, ఫిజీషియన్ పర్యవేక్షణలో టెక్నీషియన్ జి. రవికుమార్ ల పర్యవేక్షణలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. క్లబ్ ప్రెసిడెంట్ లయన్ డి. తిరుపతి రెడ్డి, సెక్రటరీ జి.చంద్రశేఖర్, లయన్ ఇ.రమేష్, జిఎల్టి కోఆర్డినేటర్ లయన్ ఎం. సత్యనారాయణ రావు పిఆర్సి, లయన్ ఎస్. మనోహర చారి పిపి, లయన్ ఎం. మహేందర్ విపి, లయన్ ఎస్. తిరుపతి, లయన్ ఇ. రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ రాపాక విజయరాజుకు 'దళిత రత్న' అవార్డు




**సంగారెడ్డి, ఏప్రిల్ 20(ది క్రైమ్ న్యూస్):** జర్నలిస్ట్ రాపాక విజయరాజుకు ప్రతిష్టాత్మక 'దళిత రత్న' అవార్డు వరించింది. భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్లోని అంబేద్కర్ కళాభవన్లో ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ, బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఉత్సవాల కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాపాక విజయరాజు ఈ గౌరవాన్ని అందుకున్నారు. ఉత్సవాల కమిటీ కో–చైర్మన్ సుదర్శన్ బాబు, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, దళిత జర్నలిస్టుల ఫోరం వ్యవస్థాపకులు కాశపోగు జాన్ చేతుల మీదుగా అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా రాపాక విజయరాజు మాట్లాడుతూ, "దళిత రత్న అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ గుర్తింపు నా బాధ్యతను మరింత పెంచింది. బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు, సామాజిక సాధికారత కోసం నా వంతు కృషిని మరింత ముమ్మరం చేస్తాను" అని తెలిపారు. ఈ గుర్తింపునకు సహకరించిన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్కు, ఉత్సవాల కమిటీ సభ్యులకు, దళిత జర్నలిస్టుల ఫోరం కుటుంబ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దళిత జర్నలిస్టుల ఫోరం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు దుమ్మాటి శివకుమార్, రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి, పరంజ్యోతి, వర్కింగ్ ప్రెసిడెంట్ ధనుష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జగత్ ప్రకాష్, శ్రీను, కర్రోళ్ల అన్నమ్మ, సంగారెడ్డి జిల్లా గౌరవ అధ్యక్షులు కె. శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ అంశాలకు ప్రథమ ప్రాధాన్యత..

**● ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించవద్దు.. ● గడ్డపోతారం పరిధిలో నూతన ఎస్టిపి ప్లాంట్ ఏర్పాటుకు కసరత్తు.. ● అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి.. ● పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



**పటాన్చెరు, ఏప్రిల్ 20(ది క్రైమ్ న్యూస్):** ప్రజలకు అత్యంత ఆవశ్యకమైన తాగునీరు సరఫరా, నిరంతర విద్యుత్ పంపిణీ, పారిశుధ్యం అంశంలో అలసత్వం వహించవద్దని.. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పర్యవేక్షించాలని ఆయా శాఖల ఉన్నత అధికారులకు ఎమ్మెల్యే జిఎంఆర్ సూచించారు. సోమవారం ఉదయం క్యాంపు కార్యాలయంలో అమీన్పూర్, పటాన్చెరు బల్దియా డిప్యూటీ కమిషనర్లు, ఆయా మండలాల తహసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, మున్సిపల్ చైర్మన్లు, విద్యుత్, నీటిపారుదల, పిసిబి, జాతీయ రహదారులు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటిపారుదల, జలమండలి, పరిశ్రమలు, టౌన్ ప్లానింగ్ శాఖల అధికారులతో వివిధ అంశాలపై ఎమ్మెల్యే జిఎంఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వేసవికాలంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయడంతో పాటు, నిర్దేశించిన సమయంలో తాగునీరు పంపిణీ చేయాలని సూచించారు. లో వోల్టేజి సమస్యలు తలెత్తకుండా విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగా నూతన ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఐదు మున్సిపాలిటీలకు మంజూరైన 75 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు అతి త్వరలో శంకుస్థాపన చేయబోతున్నట్లు తెలిపారు. జిహెచ్ఎంసి పరిధిలోని 9 డివిజన్ల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని సూచించారు. నూతన కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వంతో చర్చించి మరిన్ని నిధులు కేటాయించబోతున్నట్లు తెలిపారు. అమీన్పూర్ పరిధిలో 23 కోట్ల రూపాయలతో 55 పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. నూతన కాలనీలకు సైతం మంచినీటిని పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని జలమండలి జిఎం శ్రీనివాస్ కు సూచించారు. నూతన పైపులైన్ల ఏర్పాటు కోసం నిధులు కేటాయించాలని ఇప్పటికే జలమండలి ఎండి అశోక్ రెడ్డికి సైతం విన్నవించడం జరిగిందని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మంచినీటి పంపిణీ అంశంలో జాప్యం జరగకూడదని ఆదేశించారు. బల్దియా పరిధిలోని పార్కుల సుందరీకరణ కోసం 10 కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయని సంబంధిత అధికారులు తెలిపారు. అభివృద్ధి పనుల అంశంలో విద్యుత్, జలమండలి, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శరవేగంగా జరుగుతున్న పట్టణీకరణ మూలంగా ప్రభుత్వ భూముల లభ్యత అత్యంత ఆవశ్యకమని.. ప్రజా ప్రతినిధులు, ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగానే ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములను పరిశ్రమలకు కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే జిఎంఆర్ ను కోరారు. ఇందుకు భిన్నంగా పరిశ్రమల పేరుతో ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్, పరిశ్రమలకు కేటాయిస్తే ప్రజా ఉద్యమాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. జిన్నారం మున్సిపల్ పరిధిలోని నల్తూరులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులు కొనసాగుతున్నాయని.. అతి త్వరలో శంకుస్థాపన చేయబోతున్నట్లు తెలిపారు. అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని 993 సర్వే నెంబర్ లో నవోదయ పాఠశాల ఏర్పాటు కోసం భూమి కేటాయింపు జరిగిందని, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు భూమి కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు. ఇదే సర్వే నంబర్ లో ఎస్టిపి కోసం కేటాయించిన 10 ఎకరాల భూమిని ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా రద్దు చేయాలని కలెక్టర్ ని కోరనున్నట్లు తెలిపారు. గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని అయ్యమ్మ చెరువు కాలుష్య సమస్య శాశ్వత పరిష్కారం కోసం ఎస్ టి పి ఏర్పాటు చేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. మున్సిపాలిటీ, జిహెచ్ఎంసి పరిధిలో విలీనమైన గ్రామాలలోని గ్రామ కంఠాల పరిధిలో ఇళ్ల అనుమతుల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ అంశంలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కలిసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించకూడదని.. నిధుల కొరత ఉంటే తనను నేరుగా సంప్రదించాలని కోరారు. పటాన్చెరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

# మైనారిటీల సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహణ

**● జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి రమేష్ కుమార్ నాయుడు ● వెల్ఫేర్ వీక్ సందర్భంగా విస్తృత కార్యక్రమాలు అమలు ● ఏప్రిల్ 20 నుంచి 26 వరకు విభిన్న అవగాహన, అభివృద్ధి కార్యక్రమాలు ● అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పథకాలు చేరేలా చర్యలు**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వెల్ఫేర్ వీక్ సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మైనారిటీల సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి రమేష్ కుమార్ నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముస్లిం మత పెద్దలు, క్రైస్తవ పాస్టర్లు, ఫాదర్లు పాల్గొన్నారు. వక్ఫ్ బోర్డు రాష్ట్ర డైరెక్టర్ సనా ఫారూక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ముషారఫ్, పాస్టర్స్ అధ్యక్షుడు డేవిడ్, అశోక్, రాజు తదితరులు హాజరయ్యారు. సమావేశంలో మైనారిటీల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు, వాటి విస్తరణ, లబ్ధిదారులకు చేరవేతపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ వీక్ కార్యాచరణ ప్రణాళికను వివరించారు. ఏప్రిల్ 20న ప్రజా ప్రతినిధులు, కమ్యూనిటీ పెద్దల సమక్షంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించగా, ఏప్రిల్ 21న లబ్ధిదారులతో సమావేశాలు, మైనారిటీ మహిళలకు కుట్టు యంత్రాల పంపిణీ చేపడతారు. ఏప్రిల్ 22న యువతకు నైపుణ్యాభివృద్ధి, కెరీర్ మార్గదర్శక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు టీజీఎంఆర్ సంస్థల్లో మరమ్మతుల గుర్తింపు చేపడతారు. ఏప్రిల్ 23న పేరెంట్-టీచర్ సమావేశాలు నిర్వహించి విద్యార్థులకు అవసరమైన సహకారం అందిస్తారు. ఏప్రిల్ 24న ముస్లిం ఫకీర్, తుర్కా కాషా కమ్యూనిటీ సభ్యులతో సమావేశాలు, చర్చిల నిర్మాణాల పరిశీలన, ఉపాధ్యాయులకు సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 25న అర్హులైన మైనారిటీ మహిళలు, విధవలు, అనాథలతో సమావేశాలు నిర్వహించి ఆర్థిక సహాయం విస్తరణ, చర్చిలలో మరమ్మతులు, క్రీడా శిబిరాల ప్రారంభం చేపడతారు. ఏప్రిల్ 26న ర్యాలీలు, ఫోటో ప్రదర్శనలు నిర్వహించడం, ఎంపీడీవోలను సందర్శించి లబ్ధిదారుల ధృవీకరణ వేగవంతం చేయడం, టీజీఎంఆర్ సంస్థల్లో ఖాళీల భర్తీకి "బడి బాట" కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మైనారిటీల అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తున్నామని, ప్రజలు ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి సూచించారు.

# రామగిరిఖిల్లాపై సీఎం విస్పష్ట ప్రకటన చేయాలి

**● చారిత్రాత్మక స్థలాలకు ఆదరణ కరువు ● పెద్ద మంత్రి ఉన్నా..ఫలితం సున్నా ● ప్రజల అభ్యర్థనలపై చిత్తశుద్ధి ఏది..? ● పర్యాటకానికి రూ.2వందల కోట్లు కేటాయించిన కేంద్రం ● బిజెపి రాష్ట్రనేత సురేష్ రెడ్డి..**

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రామగిరిఖిలా అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంతరెడ్డి చొరవ చూపాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు గొట్టెముక్కుల సురేష్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అదే సభలో పెద్దపల్లి జిల్లా రామగిరిఖిల్లా అభివృద్ధి కొరకు విస్పష్ట ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేసారు. ఈ మేరకు సోమవారం పత్రిక ప్రకటన విడుదల చేసారు. ఆ ప్రకటనలో సురేష్ రెడ్డి మాట్లాడుతూ, స్వయాన శ్రీరామచంద్రుడు సీతాసమేతంగా ఇక్కడ నడయాడిన ఆనవాళ్ళు ఉన్నాయని, రాములవారు స్వయంభుగా ఇక్కడ వెలిశారనడానికి చారిత్రక ఆధారాలు ఉన్నాయన్నారు. ప్రపంచ శాస్త్రవేత్తలను సైతం ఆశ్చర్యచకితులను చేసే వనమూలికలు ఈఖిల్లా సొంతమన్న ఆయన, పేరొందిన సైంటిస్టులు ఇక్కడికి వచ్చి వనమూలిక సేకరణ జరుపుతున్నారన్నారు. ప్రజల అభ్యర్థనలపై చిత్తశుద్ధి ఏది..? ఖిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలనీ ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లినా చిత్తశుద్ధి లేని కారణంగా తాము చేసిన అభ్యర్థనలను పట్టించుకున్న పాపాన ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని, జిల్లాకు ఒక పెద్దమంత్రి నేతృత్వం వహిస్తున్నా ఫలితం మాత్రం శూన్యమని మండిపడ్డారు. పర్యాటక కేంద్రాలపట్ల కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి ఇది నిదర్శనమని, ఆధ్యాత్మిక స్థలాలు అభివృద్ధి చెందడం వారికి ఇష్టంలేదని విమర్శించారు. రామగిరి ఖిల్లా అభివృద్ధి జరిగితే స్థానిక యువతకు ఉపాధి మార్గాలు కల్పించడంతో పాటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని, జిల్లాపేరు దేశ విదేశాలకు విస్తరిస్తుందని తెలిపారు. పర్యాటకానికి కేంద్రం రూ. 2వందలకోట్లు.. రామగిరిఖిల్లా అనగానే శ్రావణమాసం గుర్తుకువస్తుందన్న సురేష్ రెడ్డి, ఆ కాలంలో పర్యాటకులతో ఖిల్లా సందడిగా ఉంటుందన్నారు. ప్రస్తుతం రామగిరిఖిలా రాష్ట్రపరిధిలోని అంశమని కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి నిధులు కేటాయించి పర్యాటక శోభను పెంచాలన్నారు. లేనిపక్షంలో కేంద్ర ప్రభుత్వానికి అప్పగించేలా లేఖ ఇస్తే, అక్కడి నుండే నిధులు తెప్పించి రామగిరికి జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చేలా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. స్వదేశ్ దర్శన్, ప్రసాద్, భారత్ గౌరవ్ పేరుతో ఆలయాలు, పర్యాటక అభివృద్ధి



కొరకు రూ. 2వందల కోట్లను తెలంగాణ రాష్ట్రానికి కేంద్రంలోని బిజెపి సర్కారు కేటాయించిందని సురేష్ రెడ్డి తెలిపారు. రామగిరిఖిలా అభివృద్ధి చెందితే జిల్లాకు అంతర్జాతీయంగా మంచి పేరు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఎరిత్రో పరిశ్రమలో అగ్ని ప్రమాదం రెండు బ్లాక్‌లు దగ్ధం





**పటాన్చెరు, ఏప్రిల్ 20(ది క్రైమ్ న్యూస్):** పటాన్చెరు నియోజకవర్గంలోని గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని ఎరిత్రో పరిశ్రమలో సోమవారం సాయంత్రం ప్రమాదవశాత్తు భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. పరిశ్రమలోని ఏ బ్లాక్, బి బ్లాక్‌లలో ఒక్కసారిగా మంటలు చెలరేగి వేగంగా వ్యాపించడంతో ఆ ప్రాంతంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. అగ్ని ప్రమాదం సంభవించిన సమయంలో పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు వెంటనే అప్రమత్తమై బయటకు పరుగులు తీయడంతో ఎటువంటి ప్రాణ నష్టం సంభవించలేదు. కొంతమంది కార్మికులు స్వల్పంగా భయంతో ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ ఎవరికి గాయాలు కాలేదని అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ సిబ్బంది పలుచోట్ల నుంచి ఫైర్ ఇంజన్లు, నీటి ట్యాంకర్లతో సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దాదాపు గంటల పాటు జరిగిన కృషితో అగ్ని ప్రమాదాన్ని పూర్తిగా నియంత్రించారు. మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో పరిశ్రమలోని యంత్రాలు, ముడి సరుకు, నిర్మాణ సామగ్రి భారీగా దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. స్థానిక పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిసర ప్రాంతాల్లో భద్రతా చర్యలు చేపట్టారు. బొల్లారం సీఐ రవీందర్ ఘటన స్థలాన్ని పరిశీలించి, అగ్ని ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు. సాల్వెంట్ రసాయనాల కారణంగానే ప్రమాదం జరిగి ఉండొచ్చని ప్రాథమిక సమాచారం ఉన్నప్పటికీ పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడించనున్నట్లు తెలిపారు. ఈ ఘటనతో పరిసర ప్రాంతాల్లో కొంతసేపు ఆందోళన వాతావరణం నెలకొంది. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని స్థానికులు, అధికారులు సూచిస్తున్నారు.

# అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

**- ఐటీఐ రిన్నోవేషన్ పనులు, మార్కెట్ యార్డ్‌లో ఇండోర్ స్టేడియం నిర్మాణ పనుల పరిశీలించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**





**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** అభివృద్ధి పనులు 45 రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం ఫీల్డ్ సందర్శనలో భాగంగా ఐ.టీ.ఐ. పునరుద్ధరణ పనులను, మార్కెట్ యార్డ్‌లో నిర్మాణంలో ఉన్న ఇండోర్ స్టేడియం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ చేపడుతున్న అభివృద్ధి పనులు నిర్దేశిత గడువులో పూర్తి కావాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యతలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ఐటీఐ మరియు ఇండోర్ స్టేడియం పనులను వచ్చే 45 రోజుల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పనుల అమలులో సమన్వయం పాటిస్తూ, అవసరమైన వనరులు సమయానికి అందుబాటులో ఉంచాలని, ఎటువంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది, పాల్గొన్నారు.

# సాహితీవేత్త తూము నర్సయ్యను అభినందించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రముఖ రచయిత, వ్యాఖ్యాత తూము నర్సయ్య సాహితీ కృషికి గాను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అభినందించారు. సోమవారం నేను మీ నాను అనే పుస్తకాన్ని రచించిన సందర్భంగా నర్సయ్యను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా స్థాయిలో జరిగే వివిధ కార్యక్రమాలకు నర్సయ్య వ్యాఖ్యాతగా (యాంకర్) వ్యవహరిస్తూ, తన వాక్చాతుర్యంతో అతిథులను, ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేస్తున్నారని కలెక్టర్ కొనియాడారు. నర్సయ్య రాసిన కవితలు సామాజిక స్పృహను, మానవ విలువలను, ప్రకృతి సౌందర్యాన్ని, ప్రేమానురాగాలను ప్రతిబింబిస్తున్నాయని, క్లిష్టమైన భావాలను సైతం సామాన్యులకు అర్థమయ్యేలా సరళమైన పదాలతో వ్యక్తీకరించడం నర్సయ్య ప్రత్యేకత అని, వారి కవితలు పాఠకులను ఆలోచింపజేస్తాయని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. నేను మీ నాను అనే పుస్తకాన్ని రచించిన సందర్భంగా నర్సయ్యకు జిల్లా కలెక్టర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ, భవిష్యత్తులో ఆయన మరిన్ని కవితా సంపుటాలను వెలువరించాలని, సాహితీ రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

# పరామర్శ..



**జమ్మికుంట, ఏప్రిల్ 20 (ది క్రైమ్ న్యూస్):** జమ్మికుంట తాసిల్దార్ నల్ల వెంక రెడ్డి తండ్రి నల్ల నారాయణరెడ్డి మరణించగా వారి గ్రామం ముత్తారం పెద్దపెల్లి మండలంలో వారి కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు దేశిని కోటి పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రం సతీష్ రెడ్డి, ముద్దమల్ల రవి, బొంగోని వీరన్న, మర్రి రామ్ రెడ్డి తదితరు పాల్గొన్నారు.

# ప్రజావాణి నిర్వహణపై అధికారులతో తహశీల్దార్ సమావేశం



**మానకొండూర్, ఎప్రిల్20 (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం ప్రజావాణిని నిర్వహించనున్నట్లు తహశీల్దార్ కె.విజయ్ కుమార్ తెలిపారు. ప్రజావాణి నిర్వహణపై అన్ని శాఖల మండలస్థాయి అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించి దరఖాస్తుల స్వీకరణలో జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతీ సోమవారం ఉదయం10:30 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించే ప్రజావాణిలో అన్ని గ్రామాల్లోని ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులను సమర్పించుకుని కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తహశీల్దార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా ప్రారంభమైన సంక్షేమ వారోత్సవాలు..

## ● పిల్లలతో కలిసి భోజనం చేసిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్





**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 20(ది క్రైమ్ న్యూస్):-** ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు వారం రోజులు రాష్ట్రవ్యాప్తంగా అన్ని వసతి గృహాలు సంక్షేమ విద్యాసంస్థలలో సంక్షేమ వారోత్సవాలు సోమవారం ప్రారంభమైనాయి. మహబూబాబాద్ జిల్లా గూడూరు మరిమిట్ట మహాత్మ జ్యోతిరావు పూలే వసతిగృహం (బాలికలు) లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పాల్గొని పిల్లలతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహాత్మ జ్యోతిరావు పూలే వసతి గృహంలో పరిసరాలను పరిశీలించారు. ఈ వారం రోజులలో ప్రతిరోజు ఒక థీమ్ ద్వారా వసతి గృహాలలో సానిటేషన్, మైనర్ రిపేర్, హెల్త్, స్టోర్ పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వసతి గృహంలోని స్టోర్ గది, తరగతి గదులు, కిచెన్, డైనింగ్ హాల్, మరుగుదొడ్లు, లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సంబంధిత వసతి గృహాల సిబ్బంది ఆదేశించారు, భోజనం సిద్ధం చేసే సిబ్బంది కి షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అన్ని వసతి గృహాలలో ఫిర్యాదుల బాక్సులు ఏర్పాటు చేయాలని సూచించారు, విద్యార్థిని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు, డైట్ నేను ప్రకారం పక్కాగా నాణ్యమైన రుచికరమైన ఆహారాన్ని అందించాలని, విద్యతోపాటు క్రీడా మానసిక వికాసం తదితర అంశాలపై శిక్షణ ఇప్పించాలని, సమ్మర్ క్యాంపు ల ద్వారా పిల్లలకు క్రీడల్లో పాల్గొనే అవకాశం కల్పించాలన్నారు, పిల్లల యొక్క విద్యాసామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు నూతన టెక్నాలజీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డిజిటల్ తరగతుల ద్వారా అత్యాధునిక వినూత్న రీతిలో విద్యాబోధనలు అందించాలని ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులకు సూచించారు. అత్యుత్తమ ఫలితాలను సాధించేందుకు కృషి చేయాలని, ఈ వారం రోజులు అన్ని విద్యాసంస్థలలో రోజువారి కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈరోజు నుండి ఏప్రిల్ 26 వరకు వారం రోజులు జిల్లాలో సంక్షేమ వారోత్సవాలను నిర్వహించడం కోసం ఇప్పటికే పక్కా ప్రణాళికతో ప్రతి ఒక్కరికి వసతి గృహాలు హాస్టల్స్, విద్యాసంస్థలను కేటాయించడం జరిగిందని తెలిపారు, కలెక్టర్ వెంట గూడూరు తాసిల్దార్ నాగభవాని, ఎంపీడీవో, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఏనుగు మొత్తం ఎళ్లింది... తోక మాత్రం మిగిలింది!

- ◆ అభివృద్ధి పరుగెత్తింది.. ఒక కల్వర్టు అడ్డొచ్చింది
- ◆ 17 కోట్ల రోడ్డు - ఒక కల్వర్టు చేత బందీ!
- ◆ నిర్మాణం పూర్తయి మూడేళ్లు.. అయినా రాని మోక్షం



శానగొండ - బాయమ్మ పల్లె గ్రామాల మధ్య పూర్తికాని కల్వర్టు

**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పోత్కాపల్లి నుంచి గుంపుల దాకా డబుల్ రోడ్డు నిర్మాణం ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక. సుమారు 17 కోట్ల రూపాయల వ్యయంతో గత ప్రభుత్వ హయాంలో మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్ పనులు దాదాపు మూడు సంవత్సరాల క్రితమే ప్రారంభమై పూర్తయ్యాయి. నాయకుల మాటల్లో ఇది అభివృద్ధి పరుగులు పెడుతున్న రహదారి... కానీ వాస్తవానికి ఒక చిన్న కల్వర్టు దగ్గరే ఈ అభివృద్ధి బ్రేక్ కొట్టేసింది. అన్ని పనులు పూర్తి అయ్యి రోడ్డు సిద్ధంగా ఉన్నా, శాన గొండ -- బాయమ్మపల్లె గ్రామాల మధ్య ఉన్న ఒకే ఒక్క కల్వర్టు నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోవడంతో మొత్తం ప్రాజెక్ట్ పూర్తి కాలేదు అన్న ముద్రను మోయడమే కాదు పరువు తీసుకుంటున్నది.

99,999 రూపాయలను లక్ష అనలేం... అలాగే ఈ రోడ్డు కూడా పూర్తి అయ్యిందని చెప్పలేం,అన్నట్టుగా పరిస్థితి తయారైంది. కోట్ల రూపాయలతో నిర్మించిన ఈ రహదారి ఒక చిన్న నిర్మాణం కోసం నిలిచిపోవడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోంది. వర్షాకాలం వస్తే ఈ కల్వర్టు వద్ద నీరు నిలిచిపోవడం సాధారణమే. దాంతో వాహనదారులు గతంలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా బైక్ పై ప్రయాణించే వారు జారిపడే ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయి. ఈ రోడ్డు మీద ప్రయాణం అంటే అడ్వెంచర్ ట్రిప్‌లా మారిందని స్థానికులు వ్యంగ్యంగా మాట్లాడుకునేవారు.

మరోవైపు నాయకుల ప్రసంగాల్లో మాత్రం అభివృద్ధి కథలు గర్జిస్తున్నాయి. కోట్ల ప్రాజెక్టులు, ప్రజల సేవ, వేగంగా జరుగుతున్న పనులు అంటూ మాటల వర్షం కురుస్తోంది. కానీ నేలమీద మాత్రం ఒక కల్వర్టు పనులు పూర్తి చేయలేని పరిస్థితి కనిపించడం ప్రజల్లో ప్రశ్నలు లేవనెత్తుతోంది. "నిధుల లోపమా? లేక నిర్లక్ష్యమా?" అన్న సందేహం ప్రతి ఒక్కరి నోట వినిపిస్తోంది. మిగతా అన్ని పనులు పూర్తయిన ప్రాజెక్ట్‌లో ఈ ఒక్కటి ఎందుకు నిలిచిపోయిందన్నది అర్థం కాని ప్రశ్నగా మారింది.

ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణించే ఈ మార్గంలో ఈ ఒక్క కల్వర్టు పెద్ద సమస్యగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మిగిలిన చిన్న పని పూర్తి చేసి ప్రాజెక్ట్‌కు పూర్తి స్థాయి గ్రీన్ సిగ్నల్ ఇవ్వాల్సిన అవసరం ఉంది. లేదంటే రాబోయే వర్షాకాలంలో ఇక్కడ మరిన్ని ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

మొత్తానికి, ఏనుగు మొత్తం ఎళ్లినా... తోక మాత్రం మిగిలి పోయినట్లుగా ఈ ప్రాజెక్ట్ పరిస్థితి తయారైంది. కోట్ల రూపాయల అభివృద్ధి పనులు ఒక చిన్న కల్వర్టు దగ్గర ఆగిపోతే... అది అభివృద్ధి కాదు, ప్రజల కళ్లలో పడే పెద్ద కామెడీగానే మిగిలిపోతుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

# విద్యకు వంతెనగా... సేవకు చిరునామాగా జీలకుంట సర్పంచ్ రాగిడి మంగ శ్రీనివాసరెడ్డి



**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** సామాజిక సేవలో నేనుసైతం అంటూ నిరంతరం ముందుకు సాగుతున్న పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం జీలకుంట సర్పంచ్ రాగిడి మంగ శ్రీనివాసరెడ్డి మరోసారి తన సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. తన కుమారుడు రాగిడి ప్రజ్ఞానాథ్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని, ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచిన దార ఐశ్వర్యకు ఐదు వేల రూపాయల ప్రోత్సాహక బహుమతిని అందజేసి, ప్రతిభకు పునాది వేస్తూ ఆదర్శంగా నిలిచారు. విద్య అంటే కేవలం చదువు కాదు... అది భవిష్యత్తును మలిచే మహాశక్తి. విద్య మన భవితను మార్చగలదు అనే బలమైన నమ్మకంతో ముందుకు సాగుతున్న రాగిడి మంగ, గతంలోనూ ఎంతో మంది విద్యార్థులకు చేయూతనిచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపారు. ప్రతి సంవత్సరం ప్రజ్ఞ జయంతిని కేవలం ఒక జ్ఞాపకంగా కాకుండా, సామాజిక బాధ్యతగా మార్చి వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆమె ప్రత్యేకత. విద్య, సామాజిక సేవ –ఈ రెండు కళ్లతో ఆమె ముందుకు సాగుతున్న తీరు నిజంగా ప్రేరణాత్మకం. పేదరికాన్ని నిర్మూలించడానికి విద్యే అసలైన ఆయుధమని ఆమె ప్రగాఢ నమ్మకం. అందుకే ప్రతి చిన్నారికి, ప్రతి విద్యార్థికి విద్య అందాలని ఆమె కృషి చేస్తోంది. జీలకుంట గ్రామంతో పాటు ఓదెల మండలమంతటా రాగిడి దంపతులు చేపడుతున్న అనేక సేవా కార్యక్రమాలు ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించాయి. ఈ సందర్భంగా రాగిడి మంగ మాట్లాడుతూ... విద్యతో మన భవిష్యత్తును మనమే రాసుకోవచ్చు. ప్రతి ఒక్కరు చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. దార ఐశ్వర్య భవిష్యత్తు మరింత ప్రకాశవంతంగా ఉండాలని, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదించారు. ఇలాంటి నాయకత్వం ఉన్న చోట... అభివృద్ధి కేవలం మాట కాదు, అది జీవన విధానం! రాగిడి మంగ లాంటి నాయకులు ఉన్నంత వరకు గ్రామీణ భారతానికి వెలుగులు తథ్యం అంటూ పలువురు అభిప్రాయపడ్డారు.

# అనుముల మండలంలో...మహిళలు, చిన్నారుల ఆరోగ్యానికి పోషణ పక్షం కార్యక్రమం...

## - పోషణ పక్షం మండల్ స్థాయి కార్యక్రమం నిర్వహణ



**నల్లగొండ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 21 ( ది క్రైమ్ న్యూస్):** నల్లగొండ జిల్లా అనుముల మండలం పరిధిలోని ఎంపీడీవో కార్యాలయం మీటింగ్ హాలులో ఈరోజు పోషణ పక్షం మండల్ స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్పర్సన్ చింతల చంద్రా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామం, వార్డు స్థాయిలో పోషణ లోపం లేకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్థానికంగా లభించే ఆహార పదార్థాలను వినియోగిస్తూ, అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని తల్లులకు అవగాహన కల్పించారు. అనంతరం సీడీపీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలలో పోషణ పక్షాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మహిళలు, చిన్నారులు పోషణ లోపానికి గురికాకుండా సమతుల ఆహారం తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, సీజనల్ పండ్లు రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని చెప్పారు. జంక్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్‌లకు దూరంగా ఉండాలని, ఇంటి వద్దనే పోషకాహారాన్ని తయారు చేసుకొని తీసుకోవడం వల్ల ఐరన్, కాల్షియం లోపాలు నివారించవచ్చని వివరించారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలకు సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు కే. రమాదేవి, ఫరీదా, ఆరోగ్య సిబ్బంది కనకదుర్గ, వెంకటేశ్వర్లు, ఆశా కార్యకర్తలు నాగేంద్ర, సత్యవతి, సునీత, పార్వతి, విజయ, అంగన్వాడీ టీచర్లు, మహిళలు మరియు పిల్లలు పాల్గొన్నారు.

# సమానత్వం, సత్యం, సేవకు ప్రతీక మహాత్మా బసవేశ్వరుడు: జగదీశ్వర్ గౌడ్



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సమానత్వం, సత్యం, సేవకు ప్రతీకగా నిలిచిన మహాత్మా బసవేశ్వరుడు కేవలం ఒక మతపరమైన గురువు మాత్రమే కాకుండా, గొప్ప సమాజ మార్గదర్శి అని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం మహాత్మా బసవేశ్వర జయంతి సందర్భంగా మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎం.ఏ నగర్ బస్తీలో నిర్వహించిన జయంతి వేడుకల్లో ఆయన నియోజకవర్గ నాయకులతో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో మహాత్మా బసవేశ్వరుడు ఒక గొప్ప సామాజిక సంస్కర్త, తత్వవేత్త, కవి అని కొనియాడారు. 12వ శతాబ్దంలో జీవించిన ఆయన సమాజంలో ఉన్న అన్యాయాలు, కులవ్యవస్థ, అసమానతలపై పోరాడి సమానత్వానికి పునాది వేశారని చెప్పారు. బసవేశ్వరుడి ఆశయాలను ప్రతి ఒక్కరూ తమ హృదయాల్లో నిలుపుకొని, సమానత్వం, సేవ, సత్యం అనే మార్గంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మన్నేపల్లి సాంబశివ రావు, రాంచందర్ గౌడ్, కృష్ణ, ప్రభాకర్ రెడ్డి, రవి కుమార్ గౌడ్, రాంబాబు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**జమ్మికుంట ఏప్రిల్ 14 (ది క్రైమ్ న్యూస్):** హుజరాబాద్ పట్టణ కేంద్రంలోని సిటీ ఫంక్షన్ హాల్ హుజురాబాద్ నందు కల్యాణ లక్ష్మి/షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం కలదు. ఇట్టి కార్యక్రమానికి నియోజక వర్గ శాసన సభ్యులు చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమం కలదు కావున లబ్ధిదారులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా జమ్మికుంట ఎమ్మార్వో ఒక ప్రకటనలో కోరారు.

# ఎపిస్టిమో వికాస్ లీడర్‌షిప్ స్కూల్‌లో ఘనంగా రీసైక్లింగ్ డ్రైవ్

## - విద్యార్థుల్లో పర్యావరణ బాధ్యత పెంపు



**పటాన్చెరు, ఏప్రిల్ 20(ది క్రైమ్ న్యూస్):** సంగారెడ్డి జిల్లా పరిధిలోని ఎపిస్టిమో వికాస్ లీడర్‌షిప్ పాఠశాలలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో రీసైక్లింగ్ డ్రైవ్‌ను సోమవారం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఐటీసీ వెల్ బీయింగ్ అవుట్ ఆఫ్ వేస్ట్ సహకారంతో నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సుమారు 4టన్నుల రీసైకిల్ చేయగల వ్యర్థాలను సేకరించడం విశేషం. ప్లాస్టిక్, పేపర్ మరియు ఇతర పునర్వినియోగ పదార్థాలను వేరు చేసి సమర్పించడం ద్వారా విద్యార్థులు తమ బాధ్యతను చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి వెంకటయ్య హాజరై, విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కోఆర్డినేటర్ సుధ, రియల్ ఇంపాక్ట్ ఇన్నోవాషన్స్ డైరెక్టర్ సాహితి, ప్రతినిధి విగ్నేష్, ఐటీసీ ప్రతినిధి ఆజాద్ పాల్గొన్నారు. ఈ రీసైక్లింగ్ డ్రైవ్ ద్వారా విద్యార్థుల్లో పర్యావరణంపై బాధ్యతాభావం పెరగడమే కాకుండా, శుభ్రమైన పరిసరాల నిర్మాణంలో వారి భాగస్వామ్యం పెరిగిందని నిర్వాహకులు తెలిపారు.

## నిరంతరం విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

### - ఏ.డీ.ఈ వెంకటనారాయణ



**రామగిరి, ఏప్రిల్ 20(ది క్రైమ్ న్యూస్):-** నిరంతరం విద్యుత్తు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంథని డివిజన్ ఎన్.పీ.డీ.సీ.ఎల్ విద్యుత్ ఏ.డీ.ఈ వంగల వెంకట నారాయణ అన్నారు. రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలోని 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ మండల విద్యుత్ సమస్యలపై సమావేశం అయ్యారు.విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, తక్కువ వోల్టేజ్ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ లోపాలు, అలాగే గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో వినియోగదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై విస్తృతంగా చర్చించారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఏ. డి.ఈ అధికారులను ఆదేశించారు. ప్రత్యేకంగా, తరచుగా విద్యుత్ కోతలు నమోదవుతున్న ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని నియమించడం, పాడైన ట్రాన్స్‌ఫార్మర్లను త్వరితగతిన మరమ్మతు చేయడం, అవసరమైన చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడం పై దృష్టి సారించాలని సూచించారు. వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించేందుకు కాల్ సెంటర్,ఫీల్డ్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, అలాగే భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు.ఈ సమావేశంలో స్థానిక ఏ.ఈ కోరండ్ల.మహేందర్ రెడ్డి, సబ్ ఇంజినీర్ కుమ్మరికుంట సతీష్ పాల్గొన్నారు.

# భీమాతోనే అందరికీ ధీమా

## - ఎస్ బీ ఐ మేనేజర్ అశోక్ చౌహాన్



**రామగిరి,ఏప్రిల్ 20(ది క్రైమ్ న్యూస్):-** ప్రతి ఒక్కరికి బీమా అనేది ఉండాలని, బీమా ఉంటేనే ధీమాగా ఉండొచ్చని ఎస్బిఐ బ్యాంకు మంథని మేనేజర్ అశోక్ చౌహన్ అన్నారు. సోమవారం బ్యాంకులో ప్రధానమంత్రి జీవన జ్యోతి భీమా యోజన పథకం కింద లబ్ధిదారులకు రెండు లక్షల రూపాయల చెక్కును అందజేశారు మంథని విడ్స్ ఆర్గనైజషన్ ఆర్ బీ ఐ వారి ఆర్థిక అక్షరాష్యత కేంద్రం సహకారంతో ఖాతాదారుడు సాబుద్దీన్ 436 చెల్లింపు చేశాడన్నారు. అనారోగ్య కారణాల వల్ల సబుద్దీన్ చనిపోవడంతో కుటుంబ సభ్యులకు చెక్కు అందించారు. ఈ కార్యక్రమంలో విడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్స్ అశోక్, పూజిత, అమ్మకుంటి సుధాకర్ పాల్గొన్నారు.

# డిసిసి నూతన నాయకులకు ఎమ్మెల్యే కవ్వంపల్లి అభినందనలు



**మానకొండూర్, ఎప్రిల్20(ది క్రైమ్ న్యూస్):** కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ ఏర్పాటులో వివిధ పదవులకు నియామకమైన మానకొండూర్ నియోజకవర్గ నాయకులను టిపిసిసి ఎస్సీ సెల్ చైర్మన్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అభినందనలు తెలిపారు. నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నాయకులకు సూచిస్తూ మంచి పనులతో ప్రజల విశ్వాసాన్ని మరింతగా పొందాలని ఎమ్మెల్యే కోరారు.

# చందానగర్‌లో ఘనంగా హిందూ సమ్మేళనం

## ● భక్తిభావంతో పులకించిన గౌతమీనగర్ బస్తీ





**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** చందానగర్‌లోని శిల్పా ఎన్క్లేవ్ గ్రౌండ్స్‌లో ఆదివారం రాత్రి గౌతమీనగర్ బస్తీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'హిందూ సమ్మేళనం' వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి అన్నపూర్ణ ఎన్క్లేవ్, అర్జున్ రెడ్డి కాలనీ, డిఫెన్స్ కాలనీ, ఫ్రెండ్స్ కాలనీ, గౌతమీనగర్, శిల్పా ఎన్క్లేవ్ తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది హిందూ కుటుంబాలు భారీగా హాజరయ్యారు. దీంతో ప్రాంగణం కిక్కిరిసి కాషాయ వర్ణంలో ముస్తాబైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చందానగర్ అయ్యప్ప స్వామి దేవాలయ గురుస్వామి ప్రసాద్ రావు జ్యోతి ప్రజ్వలన చేసి సమ్మేళనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విశేష ఉపన్యాసకులు, రిటైర్డ్ ఎయిర్‌ఫోర్స్ అధికారి సి.బి.ఆర్. ప్రసాద్ దేశభక్తి, ధర్మం పట్ల అవగాహన కల్పించేలా ప్రసంగించారు. ఆర్ఎస్ఎస్ ఉప్పల్ బాగ్ సంపర్క్ ప్రముఖ్, ఎన్‌జీఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డి. కుమారస్వామి గుళ్ళపల్లి హిందూ ఐక్యత ప్రాముఖ్యతను వివరించారు. హిందూ సమాజం, దేశం కోసం పోరాటం చేసిన వీరుల గురించి ప్రస్తావించారు. అనంతరం జలయోగి, ఆధ్యాత్మిక గురువు విజయ్ ప్రతాప్ భక్తులకు ఆధ్యాత్మిక సందేశాలు అందించారు. మానసిక ప్రశాంతత, ఆరోగ్యం కోసం ఆధ్యాత్మికత ప్రాముఖ్యతను వివరించి భక్తులను ఉత్తేజపరిచారు. 'శ్రీ కృష్ణామృతం' పాటకు నృత్యంతో భక్తులను తన్మయత్వంలో ముంచెత్తారు. రాజస అహంకారాన్ని నియంత్రించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అతిథులను 'జనం కోసం' అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కరరెడ్డి, చెన్నారెడ్డి, శశిభూషణ్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నూనె సురేందర్, కసిరెడ్డి సింధూరెడ్డి, వనమా శ్రీనివాస్ గుప్త, జయకుమార్, వరలక్ష్మీ, సంపత్ కుమార్, సంక మోహన్ రావు, అరవింద్, ధనలక్ష్మి, శివరాజయ్య, వేణుగోపాల్ రావు, పబ్బ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నోరు ఉందని మాజీ మంత్రి కొప్పుల ఇష్టమొచ్చినట్టు మాట్లాడటం సరికాదు

## ● అక్కపల్లి లిఫ్ట్‌తో పాటు రోళ్లవాగు మిగిలిన ప్రాజెక్టులు పూర్తి చేస్తాం ● నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం





**ధర్మపురి, ఎప్రిల్ 20, (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి నియోజకవర్గంలో రోళ్లవాగు, అక్కెపెల్లి ఎత్తిపోతల పథకంతో పాటు నియోజకవర్గంలో పెండింగ్ లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందించే బాధ్యత తాను తీసుకుంటానని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి అక్కెపెల్లి ఎత్తిపోతల పథకాన్ని మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ధర్మపురి నియోజకవర్గంలో 90 శాతం మంది వ్యవసాయ ఆధారితంగా జీవనం సాగిస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలోని రైతులకు సాగునీటిని అందించడానికి రోళ్ళవాగుతో పాటు అక్కెపల్లి ఎత్తిపోతల పథకం, వెల్గటూర్ చెరువు, స్తంభంపల్లి, రంగదామంపల్లి, యశ్వంతరావుపేట చెరువు పూడికతీత పనులు పూర్తి చేసి నియోజకవర్గంలో ని ప్రతి ఎకరాకు సాగునీటి ని అందిస్తానని మంత్రి లక్ష్మణ్ కుమార్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. రైతుల ప్రయోజన మే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల విషయంలో కేవలం కాగితాలకు మాత్రమే పరిమితమైందని అన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే పనులు ప్రారంభించి అంచనాలు పెంచి మధ్యలోనే నిలిపివేశారని మంత్రి ఆరోపించారు. నియోజకవర్గంలోని రైతులకు సాగునీటిని అందించే రోళ్ల వాగు ప్రాజెక్ట్ భూ సేకరణ చేయకుండానే పనులు ప్రారంభించారని మంత్రి అన్నారు. రోళ్లవాగు ప్రాజెక్ట్ విషయంలో ధర్మపురి మాజీ ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ రూ. 60 కోట్ల అంచనాలతో 2016లో ప్రారంభించి రూ. 140 కోట్లకు పెంచారని మంత్రి ఆరోపించారు. అంచనాలు ప్రాజెక్టు నిర్మాణం ఎందుకు పూర్తి కాలేదో మాజీ మంత్రి కొప్పుల సమాధానం చెప్పాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. రిజర్వ్ ఫారెస్ట్ అనుమతి లేకుండానే రోళ్లవాగు ప్రాజెక్టు ప్రారంభించారని మంత్రి అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రోళ్ళవాగు ప్రాజెక్టు రిజర్వ్ ఫారెస్ట్ అనుమతులు తీసుకువచ్చి ఇందుకు సంబంధించి ఆడవిశాఖకు రూ.31 లక్షలు చెల్లించినట్లు మంత్రి తెలిపారు. నోరు ఉందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడితే సహించేది లేదని మంత్రి హెచ్చరించారు. అక్క పెల్లి ఎత్తిపోతలకు సంబంధించి కనీసం డ్రాయింగ్ పనులు చేయించలేని కొప్పుల ఈశ్వర్ తనపై తప్పుడు ఆరోపణ చేస్తున్నారని మంత్రి అన్నారు. వారం రోజుల క్రితం అక్క పెల్లి ఎత్తిపోతలకు సంబంధించి డ్రాయింగ్ పనులు పూర్తి అయ్యాయని మంత్రి తెలిపారు. త్వరలోనే అక్కపెల్లి రిజర్వాయర్ పనులు ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు.

# మియాపూర్‌లో ఘనంగా మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకలు



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎం.ఏ. నగర్ కాలనీలో శ్రీ వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో సోమవారం మహాత్మా శ్రీ బసవేశ్వర జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ కాలనీ వాసులు, డివిజన్ నాయకులతో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ మహాత్మా బసవేశ్వరుడు సమానత్వం, సత్యం, సేవకు ప్రతీక అని కొనియాడారు. ఆయన కేవలం మతపరమైన గురువు మాత్రమే కాకుండా గొప్ప సమాజ మార్గదర్శి అని పేర్కొన్నారు. సమానత్వం, సేవ, నిజాయితీ వంటి విలువలను మన జీవితంలో పాటించాలని బోధించిన మహానుభావుడని తెలిపారు. భారతదేశ చరిత్రలో బసవేశ్వరుడు ఒక గొప్ప సామాజిక సంస్కర్త, తత్వవేత్త, కవి అని గుర్తుచేస్తూ, 12వ శతాబ్దంలో జీవించి సమాజంలోని అన్యాయాలు, కులవ్యవస్థ, అసమానతలపై పోరాడారని అన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ తమ హృదయాల్లో నిలుపుకొని సమానత్వం, సేవ, సత్యం మార్గంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ నాయకులు, వీరశైవ లింగాయత్ సమాజం సభ్యులు శేఖర్, ప్రభు, రాజు, నరేందర్, వీరేశం, విజయ్, జంగం మల్లేష్, లింగాయత్ శివ, వీరన్న, స్థానిక నాయకులు శివ, చందు, ఎం.ఏ. నగర్ బస్తీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా శ్రీమంతం వేడుకలు..



**జగిత్యాల, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా సోమవారం (కొడిమ్యాల మండలంలోని తిప్పాయపల్లె గ్రామంలోని స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలో గ్రామ సర్పంచ్, అంగన్‌వాడీ సిబ్బంది మరియు ఆశా వర్కర్లు ఉత్సాహంగా, పోషకాహార ప్రాముఖ్యత: ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ల్యాగల రాజేశం మాట్లాడుతూ, గర్భిణీ స్త్రీలకు పుట్టబోయే బిడ్డల ఆరోగ్యం కోసం పోషకాహారం తీసుకోవడం ఎంతో కీలకమని ఆయన అన్నారు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కోరారు. ప్రభుత్వ సహకారం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పాలు, గుడ్లు, ఇతర బలవర్ధకమైన ఆహారం తల్లి-బిడ్డల ఆరోగ్యానికి రక్షణ కవచంలా పనిచేస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో తిప్పాయపల్లె అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామ పెద్దలు స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ బసవన్న జీవితం నుంచి స్ఫూర్తి పొందాలి: పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సమసమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ బసవన్న జీవితం నుంచి స్ఫూర్తి పొందాలని, ఆయన చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. యువతకు బసవేశ్వరుడి జీవితం గొప్ప ఆదర్శమని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. సోమవారం శ్రీ మహాత్మా బసవేశ్వర 893వ జయంతి సందర్భంగా హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ ఆధ్వర్యంలో హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీలో బసవేశ్వర జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని బసవేశ్వరుడి చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం సుమారు 200 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ మహాత్మా బసవేశ్వర జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని, ముఖ్యంగాపేద మహిళలకు చీరలు అందించడం గొప్ప సేవగా కొనియాడారు. బసవేశ్వరుడు విద్య, సమానత్వం, సామాజిక న్యాయం కోసం పోరాటం చేసిన మహనీయుడని పేర్కొన్నారు. ఆయన12వశతాబ్దంలోనే కుల, మత, వర్ణ వివక్షలను వ్యతిరేకించి సమసమాజ నిర్మాణానికిపునాది వేశారని తెలిపారు. స్త్రీ-పురుష సమానత్వం కోసం కృషిచేసి, దళితులకు ఆలయ ప్రవేశం కల్పించేందుకు ప్రయత్నించిన ప్రగతిశీలి అని వివరించారు. అదేవిధంగా పాల్కురి సోమనాథుడు బసవేశ్వరుడిపై "బసవ పురాణం" రచించారని,ఆయన గొప్పతనాన్ని గుర్తించిన భారత ప్రభుత్వం పార్లమెంట్ ప్రాంగణంలో విగ్రహాన్ని ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. హైదరాబాద్‌లో ట్యాంక్‌బండ్‌పై కూడా బసవేశ్వరుడి విగ్రహం ఏర్పాటు చేసిప్రతిసంవత్సరం అధికారికంగా జయంతి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, మల్లికార్జున్ శర్మ, బుచ్చిరెడ్డి మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా నల్ల సంజీవ రెడ్డి జన్మదిన వేడుకలు




**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన తెలంగాణ రాష్ట్ర లేబర్ సెల్ ఉపాధ్యక్షులు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్ల సంజీవ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం మయూరి నగర్ డివిజన్ పరిధిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మయూరి నగర్‌లోని హైదరాబాద్ జిల్లా మహిళా మండలుల సమాఖ్య ప్రాంగణంలో శ్రీదేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులతో కలిసి అన్నదానం చేశారు. అనంతరం ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరేందర్ గౌడ్, కృష్ణ ముదిరాజ్, మన్నేపల్లి సాంబశివ రావు, మోహన్ రెడ్డి, తిరుపతి, ప్రభాకర్ రెడ్డి, కట్ల శేఖర్ రెడ్డి, కృష్ణ గౌడ్, రాంచందర్, రవి, రెహమాన్, శివ, విష్ణు, శివ కుమార్, వాసు, శంకర్ రావు, మహిళా నాయకులు సంగీత గౌడ్, శ్రీదేవి, అనిత, శశిరేఖ, శ్రీజ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన ఎన్నిక...!

**- ఉపాధ్యక్షుడిగా నందగిరి రవీంద్రచారి**



**మానకొండూర్, ఎప్రిల్20(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని సోమవారం ఏర్పాటు చేసినట్లు టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా నందగిరి రవీంద్రాచారి, ప్రధాన కార్యదర్శులుగా ముస్కు ఉపేందర్ రెడ్డి, దావు సంపత్ రెడ్డి, అధికార ప్రతినిధిగా అల్వాల కోటి, కార్యదర్శులుగా గొంటి సంతోష్, కనకం కుమార్, పొట్ట శ్రీనివాస్, గట్టు తిరుపతి గౌడ్ నియామకమైనట్లు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా తన నియామకానికి సహకరించిన టిపిసిసి ఎస్సీ సెల్ చైర్మన్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు, టి పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కు, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతూ పార్టీ అభివృద్ధికి, ప్రజాసమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తూ జిల్లాలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని నందగిరి రవీంద్ర చారి పేర్కొన్నారు.

# ఘనంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ జన్మదినవేడుకలు





**ధర్మపురి, ఎప్రిల్ 20, (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ జన్మదినవేడుకలను బిఆరెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. సోమవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ జన్మదినం పురస్కరించుకొని వారు ఆయురారోగ్యాలతో ఉండాలని ధర్మపురి లోని స్థానిక లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత నంది చౌక్ వద్ద బిఆర్ఎస్ శ్రేణుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ సంగి సత్తెమ్మ, ధర్మపురి మండల కన్వీనర్ అయ్యోరి రాజేష్ కుమార్, పట్టణ కన్వీనర్ బండారి రంజిత్, నాయకులు ఓద్నాల మల్లేశం, సంగి శేఖర్, చిలువేరి శ్యాంసుందర్, పెరుమాండ్ల ఎల్లగౌడ్, చిర్నేని నర్సయ్య, బండారి అశోక్, చుక్క రవి, బాకీ శేఖర్, గుర్రాల సుధాకర్, మురికి శ్రీనివాస్, అనంతుల విజయలక్ష్మి, ఎండీ షమీమా, తరాల కార్తీక్, సయ్యద్ ఆసిఫ్, జెట్టి రాజన్న, ఆనందాసు శ్రీనివాస్, స్తంభంకాడి మహేష్, నక్క రాజేందర్, ముత్తినేని లక్ష్మణ్, మామిడి శ్రీనివాస్, అక్కనపెల్లి సురేందర్, చల్ల రవి, కాశెట్టి విజయ్, కుక్కల గంగారెడ్డి, కాశవేని శ్రీనివాస్, అనంతుల లక్ష్మణ్, రాజిరెడ్డి, మొలుగూరి రాజన్న, అంబటి లక్ష్మణ్, నూనె సాయి, మామిడి శివసాయి, జీధుల గంగన్న, ఈర్ల మొండయ్య, మల్లేష్, జగన్, ఆకుల రాజేష్, షెకెల్లి సాయి, రాహుల్, శివ, రాజేశం, సురేష్, యశ్వంత్, మున్నా, నరేందర్ తదితరులు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మొక్కల పరిరక్షణ - పరిసరాల శుభ్రతపై చైర్మన్ దృష్టి



**నల్లగొండ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 21 ( ది క్రైమ్ న్యూస్):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాలలో భాగంగా హాలియా మున్సిపాలిటీ చైర్మన్ చింతల చంద్రా రెడ్డి పర్యవేక్షణలో పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ సందర్భంగా హాలియాలోని సాగర్ రోడ్డులో మెయిన్ రోడ్డు వెంట ఉన్న హరితహారం మొక్కల వద్ద పాదులు తీయించి, కలుపు మొక్కలను తొలగింపజేశారు. అనంతరం ఆ మొక్కలకు మున్సిపల్ ట్యాంకర్ ద్వారా నీరు అందించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా రోడ్డుపై పేరుకుపోయిన మట్టి కుప్పలు, రాళ్లు, చెత్తాచెదారం తొలగించి శానిటేషన్ సిబ్బందితో పరిసరాలను పరిశుభ్రం చేయించారు. ఈ చర్యల ద్వారా పట్టణంలో పరిశుభ్రతతో పాటు హరితహారం మొక్కల సంరక్షణకు ప్రాధాన్యం ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

## విగ్రహా ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే కవ్వంపల్లి




**బెజ్జంకి, ఎప్రిల్20(ది క్రైమ్ న్యూస్):** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గాగిల్లాపూర్లోని శ్రీపోచమ్మ తల్లి ఆలయంలో సోమవారం నిర్వహించిన విగ్రహ పునః ప్రతిష్టాపనా మహోత్సవానికి టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, సర్పంచ్ ఎర్రల జానకి, ఉప సర్పంచ్ చింతలపల్లి పద్మ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, పార్టీ మండలాధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి,ఎర్రల రాజు తదితరులు పతిష్టాపనలో ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

## హాలియా నల్గొండ మార్గంలో ప్రమాదం తప్పిన ఆర్టీసీ బస్సు



**నల్లగొండ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 21 ( ది క్రైమ్ న్యూస్):** హాలియా నుండి నల్గొండకు వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తృటిలో తప్పింది. దాన్యం లోడుతో వెళ్తున్న లారీ బస్సును ఢీకొట్టే పరిస్థితి ఏర్పడింది. అయితే డ్రైవర్ సమయోచితంగా స్పందించడంతో ప్రమాదం నివారించబడింది. ఈ ఘటన వెంకటాపురం స్టేజి సమీపంలో చోటుచేసుకుంది. బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు అందరూ సురక్షితంగా బయటపడ్డారు. ఘటనపై స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

# శ్రేయస్ అయ్యర్‌కు ప్రమోషన్!



పంజాబ్ కింగ్స్ ) కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) భారీ ప్రమోషన్ ఇచ్చే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో శ్రేయస్ అయ్యర్ అటు కెప్టెన్‌గా.. ఇటు ఆటగాడిగా అద్భుత ప్రదర్శన కనబరుస్తుండటంతో టీమిండియా టీ20 సారథ్య బాధ్యతలు అప్పగించాలని బీసీసీఐ భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన వెంటనే టీమిండియా టీ20 సిరీస్ కోసం ఐర్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. ఈ పర్యటనకు శ్రేయస్ అయ్యర్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేసే అవకాశాలు ఉన్నట్లు బీసీసీఐ వర్గాలు మీడియాకు తెలిపాయి. మూడు వేర్వేరు ఐపీఎల్ ఫ్రాంచైజీలను ఫైనల్స్‌కు చేర్చిన ఏకైక కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ రికార్డ్ సాధించిన సంగతి తెలిసిందే. కెప్టెన్‌గానే కాకుండా బ్యాటర్‌గానూ అయ్యర్ సత్తా చాటుతున్నాడు. అతని సారథ్యంలో పంజాబ్ కింగ్స్ సరికొత్త చరిత్రను లిఖించింది. ఐపీఎల్ చరిత్రలోనే తొలి 6 మ్యాచ్‌ల్లో ఓటమెరుగని జట్టుగా పంజాబ్ నిలిచింది. ఈ ప్రదర్శన నేపథ్యంలోనే అయ్యర్‌కు టీమిండియా టీ20 కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించాలనే డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతోంది. మరోవైపు ప్రస్తుత టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ గతేడాదిగా పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నాడు. దాంతో అయ్యర్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించాలని అభిమానులతో పాటు మాజీ క్రికెటర్లు డిమాండ్ చేస్తున్నారు.వచ్చే ఏడాది టీమిండియాకు బిజీ షెడ్యూల్ ఉంది. వన్డే ప్రపంచకప్ 2027తో పాటు ఆసియా గేమ్స్, భారత్-వెస్టిండీస్ టీ20 సిరీస్‌లు ఏకకాలంలో జరగనున్నాయి. దాంతో రెండు వేర్వేరు టీ20 టీమ్స్‌ను సిద్ధం చేయాలనే యోచనలో బీసీసీఐ ఉంది. ఈ క్రమంలోనే చాలా మంది ఆటగాళ్లకు భారత జట్టు తరఫున అరంగేట్రం చేసే అవకాశం లభించనుంది. మరోవైపు సూర్యకుమార్ యాదవ్ వయస్సు పెరుగుతుండటంతో పాటు భవిష్యత్తు అవసరాల కోసం మరొక కెప్టెన్‌ను సిద్ధం చేసుకోవడానికి కూడా ఇదే మంచి అవకాశమని బీసీసీఐ భావిస్తోంది. ఆసియా గేమ్స్, భారత్ వర్సెస్ వెస్టిండీస్ టీ20 సిరీస్ ఒకే సమయంలో జరగనున్నాయి. అందుకే రెండు వేర్వేరు టీ20 జట్లు ఆడేలా మేం ప్రణాళికలు సిద్ధం చేయాలి. అంతర్జాతీయ మ్యాచ్‌ల కోసం ఇప్పటి నుంచే 30-35 మంది క్రికెటర్ల బృందాన్ని అందుబాటులో ఉంచుకోవడం ముఖ్యం. అప్‌కమింగ్ ఐర్లాండ్ టూర్‌తో పాటు యూకే పర్యటనలకు సాధారణంగా వెళ్లే దానికంటే ఎక్కువ మంది ఆటగాళ్లను ఎంపిక చేస్తాం. ఇదే విధానం ఆసియా క్రీడలకు కూడా కొనసాగుతుంది.'అని ఓ బీసీసీఐ అధికారి మీడియాకు తెలిపాడు. టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీతో పాటు ప్రియాంశ్ ఆర్య, అనుకుల్ రాయ్, శశాంక్ సింగ్, అంగ్‌క్రిష్ రఘు వంశీలకు టీమిండియా తరఫున ఆడే అవకాశం దక్కనుంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో ఈ ఆటగాళ్లు అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తున్నారు. ముఖ్యంగా వైభవ్ సూర్యవంశీపై అందరి కళ్లు ఉన్నాయి. అతను భారత్ తరఫున అరంగేట్రం చేస్తే.. ఈ ఘనత సాధించిన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డ్ సాధించనున్నాడు. ఆయుష్ బదోనితో పాటు రజత్ పాటిదార్‌లకు టీమిండియా పిలుపు దక్కనుంది. బౌలింగ్‌లో రవిబిష్ణోయ్, ఖలీల్ అహ్మద్, ప్రసిధ్ కృష్ణలు రీఎంట్రీ ఇచ్చే ఛాన్స్ ఉంది. కార్తీక్ త్యాగి పేరును కూడా సెలెక్టర్లు పరిశీలించనున్నారు. వికెట్ కీపర్-బ్యాటర్‌గా ధ్రువ్ జురెల్ రేసులో అందరికంటే ముందున్నాడు.

## విజయం సాధించాలనే ఉద్దేశంతోనే టీమ్ కాంబినేషన్‌ను మార్చాం

### ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా

ఎలాగైనా విజయం సాధించాలనే ఉద్దేశంతోనే టీమ్ కాంబినేషన్‌ను మార్చామని ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా తెలిపాడు. డానిష్ మలేవార్, క్రిష్ భగత్ అరంగేట్రం చేస్తున్నారని తెలిపాడు. ఈ ఇద్దరి కోసం ర్యాన్ రికెల్టన్, ట్రెంట్ బౌల్ట్‌లపై వేటు వేసామని చెప్పాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా అహ్మదాబాద్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగింది. తుది జట్టులో రెండు మార్పులు చేశామని టాస్ సందర్భంగా వెల్లడించిన హార్దిక్ పాండ్యా.. తమ జట్టు పుంజుకోవడానికి ఈ మ్యాచ్ చివరి అవకాశామని చెప్పాడు. 'టాస్ గెలిస్తే మేం కూడా బౌలింగ్ ఎంచుకోవాలని అనుకున్నాం. ఒక జట్టుగా పుంజుకోవడానికి ఇది మాకు చివరి మ్యాచ్. ముంబై ఇండియన్స్ సత్తా చూపించాలని, అందుకోసం ఎలా ఆడాలనే విషయాల గురించి మేం చర్చించుకున్నాం. అందరూ ఈ మ్యాచ్ కోసం ఆసక్తిగా ఉన్నారు. గతంలో ఇలాంటి విపత్కర పరిస్థితుల నుంచి మేం పుంజుకున్నాం. ఈ సారి కూడా గెలుపు బాట పట్టాలనే పట్టుదలతో ఉన్నాం. ఒకరికొకరు అండగా ఉంటూ ముందుకు సాగాలనుకుంటున్నాం. కష్టకాలం ఉండవచ్చు, కానీ ఒకరికొకరు తోడుగా ఉంటూ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. మేం జట్టుగా మెరుగపడాలి. మా ఓటములకు ఒకే ఒక కారణాన్ని నేను చెప్పలేను. మేం కలిసి గెలుస్తాం. కలిసి ఓడిపోతాం. కాబట్టి ఒక సమూహంగా మేం మెరుగుపడాలి. ఇదొక కొత్త రోజు.. సూర్యుడు మళ్ళీ ఉదయించాడు. మేము సానుకూల దృక్పథంతో ఉన్నాం. మా జట్టులో ఈరోజు ఇద్దరు ఆటగాళ్లు అరంగేట్రం చేస్తున్నారు. డానిష్ మలేవార్‌తో పాటు క్రిష్ భగత్ బరిలోకి దిగుతున్నారు. క్రిష్ భగత్ మాకు నెట్ బౌలర్‌గా సేవలందించాడు. అతని ప్రదర్శన మమ్మల్ని ఆకట్టుకుంది. మూడు రోజుల క్రితమే అతను ప్రధాన జట్టులోకి వచ్చాడు. జీవితం అంటే ఇదే. ఈ రోజు అతను తుది జట్టులో ఆడుతున్నాడు.'అని హార్దిక్ పాండ్యా చెప్పుకొచ్చాడు. మరోవైపు టాస్ గెలిచిన శుభ్‌మన్ గిల్.. బౌలింగ్ ఎంచుకున్నాడు. పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పాడు. తుది జట్టులో ఎలాంటి మార్పులు లేకుండా విన్నింగ్ కాంబినేషన్‌తో బరిలోకి దిగుతామని చెప్పాడు.





## బాబర్ అజామ్ అద్భుత ప్రదర్శన

పాకిస్థాన్ సూపర్ లీగ్ లో పెషావర్ జల్మీ కెప్టెన్ బాబర్ అజామ్ అద్భుత ప్రదర్శనతో మెరిశాడు. క్వెట్టా గ్లాడియేటర్స్‌పై జరిగిన మ్యాచ్‌లో అతను శతకంతో చెలరేగి జట్టుకు కీలకంగా మారాడు. ముఖ్యంగా చివరి ఓవర్ చివరి బంతికి వేగంగా పరుగెత్తి, చాకచక్యంగా డైవ్ చేసి తన సెంచరీని పూర్తి చేయడం ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. టీ20లకు అతను సరిపోడని విమర్శించిన వారికి, 192.31 అద్భుతమైన స్ట్రైక్ రేట్‌తో బాబర్ గట్టి సమాధానం ఇచ్చి పాకిస్తాన్ అభిమానులను ఆశ్చర్యానికి గురిచేశాడు. కరాచీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో బాబర్ అజామ్ ఓపెనర్‌గా వచ్చి మొదటి నుంచే దూకుడుగా ఆడాడు. సాధారణంగా నిదానంగా ఆడే తన శైలిని పక్కనపెట్టి, బంతిని మైదానం నలుమూలలా చెదరగొట్టాడు. కేవలం 52 బంతుల్లోనే అజేయంగా 100 పరుగులు సాధించిన అతని ఇన్నింగ్స్‌లో 6 బౌండరీలు, 4 భారీ సిక్సర్లు ఉన్నాయి.గత మూడేళ్లుగా పెద్ద జట్లపై విఫలమవుతాడన్న విమర్శలను ఎదుర్కొన్న బాబర్, 2026లో తన ఫామ్‌ను తిరిగి చాటుకున్నాడు. పెషావర్ ఇన్నింగ్స్‌లో చివరి ఓవర్‌ను క్వెట్టా బౌలర్ జహాందాద్ ఖాన్ వేశాడు. చివరి బంతికి సెంచరీ పూర్తి చేయడానికి బాబర్ అజామ్‌కు 2 పరుగులు అవసరమయ్యాయి. బంతిని కొట్టిన వెంటనే అతను వేగంగా పరుగెత్తి, రనౌట్ ప్రమాదం నుంచి తప్పించుకోవడానికి డైవ్ చేస్తూ తన శతకాన్ని పూర్తి చేశాడు.బాబర్‌కు అండగా నిలిచిన కుశల్ మెండీస్ 44 బంతుల్లో 83 పరుగులు చేసి మంచి సహకారం అందించాడు. వీరిద్దరూ కలిసి రెండో వికెట్‌కు 75 బంతుల్లో 135 పరుగులు జోడించారు. ఈ శతకంతో బాబర్ అజామ్ కెరీర్‌లో పలు చారిత్రక రికార్డులను సృష్టించాడు. టీ20 క్రికెట్ చరిత్రలో అత్యంత వేగంగా 12,000 పరుగులు పూర్తి చేసిన బ్యాటర్‌గా అతను నిలిచాడు. కేవలం 338 ఇన్నింగ్స్‌లలోనే ఈ అరుదైన మైలురాయిని చేరుకుని రికార్డు నెలకొల్పాడు.వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ (344 ఇన్నింగ్స్‌లు), భారత స్టార్ విరాట్ కోహ్లీ (360 ఇన్నింగ్స్‌లు) సాధించిన రికార్డులను అతను అధిగమించాడు. వారిద్దరి కంటే వేగంగా ఈ ఘనత సాధించాడు.ప్రస్తుత 2026 లో టోర్నమెంట్‌లో బాబర్ అజామ్ అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. అతను ఇప్పటివరకు 7 ఇన్నింగ్స్‌లలో 401 పరుగులు చేశాడు. ఈ సెంచరీ తర్వాత అతని బ్యాటింగ్ సగటు ఏకంగా 100.25కి చేరింది. టీ20 మ్యాచ్‌లలో దూకుడుగా పరుగులు సాధించగల తన సామర్థ్యాన్ని బాబర్ అజామ్ సుదీర్ఘ కాలం తర్వాత మరోసారి నిరూపించుకుని విమర్శకుల నోళ్లను మూయించాడు.



# స్పోర్ట్స్



## రియాన్ పరాగ్ బుర్ర లేని ఆలోచనలు


### టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్

రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్‌పై టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ సెన్సేషనల్ కామెంట్స్ చేశాడు. రాజస్థాన్ జట్టు వరుస పరాజయాలతో సతమతమవుతున్న తరుణంలో ఆ జట్టు కెప్టెన్ నిర్ణయాలపై అశ్విన్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. గత రెండు మ్యాచ్‌ల్లో రాజస్థాన్ ఓటమికి రియాన్ పరాగ్ అనుసరించిన వ్యూహాలే కారణమని అశ్విన్ విశ్లేషించాడు. ముఖ్యంగా జట్టులో స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాను రియాన్ పరాగ్ వినియోగించుకుంటున్న తీరును ఆయన తప్పుబట్టాడు. జడేజా వంటి ప్రపంచ స్థాయి బౌలర్‌పై కెప్టెన్‌కు నమ్మకం లేకపోవడం రాజస్థాన్ పాలిట శాపంగా మారిందని అశ్విన్ పేర్కొన్నాడు. కేకేఆర్‌తో జరిగిన మ్యాచ్‌లో రవీంద్ర జడేజా తన బౌలింగ్ నైపుణ్యాన్ని మరోసారి నిరూపించుకున్నాడు. కేవలం 3 ఓవర్లలో 8 పరుగులు మాత్రమే ఇచ్చి రెండు కీలక వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్టును కట్టడి చేశాడు. రవీంద్ర జడేజా అద్భుతమైన ఫామ్‌లో ఉన్నప్పటికీ.. అతనికి తన కోటాలోని నాలుగో ఓవర్ వేసే అవకాశం ఇవ్వకపోవడం అశ్విన్‌ను ఆశ్చర్యపరిచింది. క్రీజులో ఇద్దరు ఎడమచేతి వాటం బ్యాటర్లు ఉన్నారనే కారణంతో లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ అయిన రవీంద్ర జడేజాను పక్కన పెట్టడం రియాన్ పరాగ్ చేసిన అతిపెద్ద తప్పు అని అశ్విన్ విమర్శించాడు. "డేటా, గణాంకాలను చూడటం మంచిదే కానీ, మ్యాచ్ పరిస్థితులను బట్టి నిర్ణయాలు తీసుకోవాలి. జడేజా ఇప్పటికే అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నప్పుడు, కేవలం బ్యాటర్లు ఎడమచేతి వాటం వారనే ఒకే ఒక్క కారణంతో అతనికి బౌలింగ్ ఇవ్వకపోవడం పరాగ్ అపరిపక్వతను సూచిస్తుంది. జడేజా కంటే తానూ లేదా రవి బిష్ణోయ్ మెరుగ్గా బౌలింగ్ చేయగలనని పరాగ్ అనుకోవడం హాస్యాస్పదం" అని అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో ఎద్దేవా చేశాడు. ఇలాంటి నిర్ణయాలు బౌలింగ్ యూనిట్ మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తాయని అశ్విన్ ఆవేదన వ్యక్తం చేశాడు. అనుభవం లేని బ్రిజేష్ శర్మకు 18వ, 20వ ఓవర్లు ఇవ్వడాన్ని కూడా అశ్విన్ తప్పుబట్టాడు. క్లిష్ట పరిస్థితుల్లో అంతర్జాతీయ అనుభవం ఉన్న జడేజాకు అవకాశం ఇచ్చి ఉంటే మ్యాచ్ ఫలితం రాజస్థాన్‌కు అనుకూలంగా ఉండేదని అభిప్రాయపడ్డాడు. "బ్యాటర్ల విషయంలో ఇలాంటి వివక్ష చూపిస్తారా? ఫామ్‌లో లేకపోయినా కీలక బ్యాటర్లను బ్యాటింగ్‌కు పంపకుండా ఉంటారా? మరి బౌలర్ల విషయంలోనే ఎందుకు ఈ నిబంధనలు?" అని అశ్విన్ ఘాటుగా ప్రశ్నించాడు. రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం కేవలం గణాంకాలకే పరిమితం కాకుండా, ఆటగాళ్ల ప్రతిభ, అనుభవంపై నమ్మకం ఉంచాలని అశ్విన్ హితవు పలికాడు.

## పంజాబ్ నయా రికార్డు..

ఐపీఎల్ 2026లో అన్ బీటెన్ గా ఉన్న ఏకైక టీమ్ పంజాబ్ కింగ్స్ జోరు కొనసాగుతోంది. వరుసగా మూడో విజయంతో హ్యాట్రిక్ సాధించి, పాయింట్ల పట్టికలో తన ప్లేస్ ను మరింత పటిష్టం చేసుకుంది. అలాగే ఈ టోర్నీలో ఐదో విజయాన్ని సాధించి, ప్లే ఆఫ్స్ వైపు వడివడిగా అడుగులు వేస్తోంది. ఇక ఆదివారం సొంతగడ్డ చండీగఢ్ మైదానంలో జరిగిన మ్యాచ్ లో లక్నో సూపర్ జెయింట్స్ పై 51 పరుగులతో ఘనవిజయం సాధించింది. అంతకుముందు టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 254 పరుగులు చేసింది. ఈ సీజన్లో ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. పంజాబ్ బ్యాటర్లు 21 సిక్సర్లతో సత్తా చాటారు. ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య తూఫాన్ ఇన్నింగ్స్ (37 బంతుల్లో 93, 4 ఫోర్లు, 9 సిక్సర్లు) తో సిక్సర్ల సునామీ సృష్టించాడు. బౌలర్లలో సిద్ధార్థ్, మహ్మద్ షమీకి రెండు వికెట్లు దక్కాయి. అనంతరం ఛేదనలో ఓవర్లన్నీ ఆడిన లక్నో.. 5 వికెట్లకు 200 పరుగులకు పరిమితమైంది. రిషభ్ పంత్ కెప్టెన్ ఇన్నింగ్స్ (23 బంతుల్లో 43, 1 ఫోర్, 4 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. మార్కో యాన్సెన్ కు రెండు వికెట్లు దక్కాయి. ఓవరాల్ గా ఈ విజయంతో పంజాబ్ 11 పాయంట్లతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని మరింత పటిష్ట పరుచుకుంది. సోమవారం అహ్మదాబాద్ లో జరిగే మ్యాచ్ లో ముంబై ఇండియన్స్ తో గుజరాత్ టైటాన్స్ తలపడనుంది. భారీ టార్గెట్ తో బరిలోకి దిగిన లక్నో.. ఓపెనర్లలో ఒక మార్పు చేసింది. విధ్వంసక మిషెల్ మార్ష్ (40)కు తోడుగా యువ బ్యాటర్ ఆయుష్ బదోనీ (35)ని పంపింది. అయితే ఈ మూవ్ ఓ మాదిరిగా పని చేసిందనే చెప్పాలి. ఆరంభంలో కాస్త నెమ్మదిగా ఆడిన ఈ జంట ఆ తర్వాత జోరు కనబర్చారు. ఓవర్ కు పది పరుగుల రన్ రేట్ తో పరుగులు సాధించిన లక్నో.. పవర్ ప్లేలో 61 పరుగులు సాధించి, ఆఖరు బంతికి ఆయుష్ వికెట్ ను కోల్పోయింది. వన్ డౌన్ లో వచ్చిన రిషభ్ పంత్ ఉన్నంత సేపు వేగంగా ఆడే ప్రయత్నం చేశాడు.

# రహానే ఖాతాలో చెత్త రికార్డు..



అజింక్య రహానే సారథ్యంలోని కోల్‌కతా నైట్ రైడర్స్ ఐపీఎల్ 2026లో ఎట్టకేలకు తమ మొదటి విజయాన్ని నమోదు చేసింది. ఆదివారం రాజస్థాన్ రాయల్స్ నిర్దేశించిన 156 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కేకేఆర్ కెప్టెన్ రహానే, టిమ్ సీఫెర్ట్ రూపంలో ఇద్దరు ఓపెనర్లు ఖాతా కూడా తెరవలేకపోయారు. 85 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి కోల్‌కతా కష్టాల్లో పడింది. అయితే రింకూ సింగ్ హాఫ్ సెంచరీ ఇన్నింగ్స్ కోల్‌కతాను ఓడిపోయే మ్యాచ్‌లో గెలిపించి తొలి విజయాన్ని అందించింది. కానీ ఈ మ్యాచ్‌లో రహానే పేరిట ఒక దారుణమైన రికార్డు నమోదైంది. ఓవైపు జట్టు వరుస ఓటములు, మరోవైపు బ్యాటర్‌గా సైతం రహానే విఫలం కావడం విమర్శలకు దారితీస్తోంది. కోల్‌కతా నైట్ రైడర్స్ కెప్టెన్ అజింక్యా రహానే ఐపీఎల్ చరిత్రలో అత్యధిక సార్లు డకౌట్ అయిన ఓపెనర్‌గా నిలిచాడు. రహానే ఇప్పటి వరకు మొత్తం 12 సార్లు డక్ అవుట్ అయ్యారు. దీనికి ముందు మ్యాచ్‌లో ఆయన 11 సార్లు ఓపెనర్‌గా సున్నాకే అవుట్ అయి, పార్థివ్ పటేల్ రికార్డును సమం చేశారు. రాజస్తాన్‌తో మ్యాచ్‌లో డకౌట్‌తో అత్యధిక డకౌట్లు అయిన ఓపెనర్‌గా చెత్త రికార్డును రహానే మూటకట్టుకున్నాడు. అజింక్యా రహానే ఈ ఐపీఎల్ తొలి మ్యాచ్‌లో 67 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడినా ఆ మ్యాచ్‌లో కోల్‌కతా ఓడిపోయింది. ఆ తర్వాత ఆడిన 6 ఇన్నింగ్స్‌లలో 4 సార్లు రహానే రెండంకెల స్కోరును కూడా అందుకోలేకపోయాడు. రాజస్థాన్ కంటే ముందు గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో కూడా రహానే ఖాతా తెవరకుండానే సున్నాకే అవుట్ అయ్యాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు జరిగిన 7 మ్యాచ్‌ల్లో రహానే 152 పరుగులు చేశారు. ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో ఫస్ట్ బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ రాయల్స్ కేవలం 155 పరుగులు మాత్రమే చేసింది. .

వరుణ్ చక్రవర్తి 4 ఓవర్లలో కేవలం 14 పరుగులిచ్చి 3 వికెట్లు తీయగా, కార్తీక్ త్యాగి 4 ఓవర్లలో 22 పరుగులిచ్చి 3 వికెట్లతో రాణించాడు. సునీల్ నరైన్ 2 వికెట్లు పడగొట్టాడు. టార్గెట్ ఛేదించే క్రమంలో కేకేఆర్ ఆరంభం చాలా దారుణంగా సాగింది. మొదటి ఓవర్‌లో టిమ్ సీఫెర్ట్ (0), రెండో ఓవర్‌లో అజింక్యా రహానే (0) డకౌట్ అయ్యారు. ఆ తర్వాత ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన అంగ్‌క్రిష్ రఘువంశీ (10) కూడా తక్కువ స్కోరుకే వికెట్ సమర్పించుకున్నాడు. కామెరూన్ గ్రీన్ (27), రోవ్‌మన్ పావెల్ (23) ఆదుకునే ప్రయత్నం చేశారు. రమణ్‌దీప్ సింగ్ (10) కూడా త్వరగానే అవుటయ్యాడు. 13.3 ఓవర్లలో జట్టు 6వ వికెట్ కోల్పోయినప్పుడు స్కోరు 85 పరుగులు మాత్రమే. దాంతో కోల్‌కతా జట్టుకు రమో ఓటమి తప్పదని అంతా అనుకున్నారు. అప్పుడు రింకూ సింగ్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్ది ఓడిపోయే స్థితిలో ఉన్న మ్యాచ్‌ను గెలిపించి కేకేఆర్ కు తొలి విజయాన్ని అందించాడు. రింకూ 34 బంతుల్లో 2 సిక్సర్లు, 5 ఫోర్ల సాయంతో 53 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అనుకూల్ రాయ్ అతడికి సహకరిస్తూ 16 బంతుల్లో 29 పరుగుల కీలక ఇన్నింగ్స్ ఆడాడు. దాంతో ఉత్కంఠపోరులో కేకేఆర్ 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

# ఆంధ్రప్రదేశ్

## భూ రికార్డుల సవరణకు లక్షన్నర లంచం

### ఎసిబికి చిక్కిన విఆర్‌వో

అనకాపల్లి,ఏప్రిల్20 : అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలంలో భూమి రికార్డుల సవరణ కోసం లంచం డిమాండ్ చేసిన వీఆర్వో పోతల శంకర్‌రావు ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. ఒక రైతు తన భూమి రికార్డుల్లో పేరు మార్పు చేసి, ఎల్పీఎం జారీ చేయించుకోవడానికి వీఆర్వోను సంప్రదించారు. ఈ పని చేయడానికి వీఆర్వో శంకర్‌రావు రూ. 1.50 లక్షల లంచం డిమాండ్ చేశారు. బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, వారు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు. బాధితుడి నుంచి వీఆర్వో నగదు తీసుకుంటుండగా అధికారులు మెరుపు దాడి చేసి పట్టుకున్నారు. వీఆర్వో శంకర్‌రావుకు గతంలో కూడా అవినీతి మరకలు ఉన్నట్లు ఏసీబీ అధికారుల విచారణలో తేలింది. గతంలోనూ అతనిపై పలు అవినీతి ఆరోపణలు రావడంతో ప్రభుత్వం శాఖాపరమైన చర్యలు తీసుకుందని అధికారులు వెల్లడించారు. అయినప్పటికీ అతని తీరు మారలేదని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ హర్షిణి ప్రజలకు పలు సూచనలు చేశారు: ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా పని కోసం లంచం డిమాండ్ చేస్తే వెంటనే 1064 అనే టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు. ప్రజలు ధైర్యంగా ముందుకు వచ్చి అవినీతిపై ఫిర్యాదు చేస్తేనే వ్యవస్థలో మార్పు వస్తుందని, బాధితులు నేరుగా ఏసీబీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. లంచం తీసుకోవడం, ఇవ్వడం రెండూ నేరమేనని, అవినీతికి పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. భూమి సమస్యలతో సతమతమవుతున్న సామాన్య రైతులను పీడించే ఇలాంటి అధికారులపై ఏసీబీ దాడులు చేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## కొల్లేరు అభయారణ్యం పరిధి 20వేల ఎకరాలు తగ్గింపు

### సరిహద్దుల మార్పులపై కేంద్రానికి ప్రభుత్వం లేఖ

అమరావతి,ఏప్రిల్20 : కొల్లేరు వన్యప్రాణి సంరక్షణ కేంద్రం సరిహద్దుల మార్పులపై కేంద్రానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లేఖ రాసింది. అభయారణ్యం పరిధిని సుమారు 20,000 ఎకరాలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ మేరకు కొల్లేరు సరిహద్దుల హేతుబద్ధీకరణపై కేంద్ర సాధికార కమిటీకి లేఖ పంపింది. నేషనల్ బోర్డ్ ఫర్ వైల్డ్‌లైఫ్ (ఎన్‌బీడబ్ల్యూఎల్) స్టాండింగ్ కమిటీ 48వ సమావేశం చేసిన సిఫార్సులను అమలు చేయాలని కోరింది. సరిహద్దుల నిర్ణయంపై స్థానిక ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతతోపాటు శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతున్నట్లు లేఖలో పేర్కొంది. ఈ ఏడాది ఫిబ్రవరి 24న జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో సరిహద్దుల మార్పుపై కేంద్ర సాధికార కమిటీ (సీఈసీ) అనుమతి కోరాలని తీర్మానించారు. ఈ నేపథ్యంలోనే 2018 నుంచి సరిహద్దుల మార్పుపై ఉన్న స్టేను ఎత్తివేసి, తదుపరి చర్యలకు అనుమతి ఇవ్వాలని సీఈసీకి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అటవీశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే లేఖ రాశారు.

## చంద్రబాబుకు టిటిడి తరపున వేదాశీర్వచనం

అమరావతి,ఏప్రిల్20 : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని అమరావతిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో టిటిడి తరపున శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీ వేంకటేశ్వర స్వామివారి అనుగ్రహంతో టిటిడి అర్చకులు వేదాశీర్వచనం నిర్వహించారు. టిటిడి అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి స్వామివారి తీర్థ, ప్రసాదాలు, శ్రీవారి చిత్రపటాన్ని అందజేశారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కృపాకటాక్షాలు ఆయనపై ఎల్లప్పుడూ ఉండాలని అర్చకులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టిటిడి అధికారులు, అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

## జగ్గంపేట ఎంపిడివో హఠాన్మరణం

విజయవాడ,ఏప్రిల్20 : జగ్గంపేట మండల పరిషత్ డిప్యూటీ ఎంపిడిఓ ఎ.వి.వి.ఎస్ ఎన్ మూర్తి (55) సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. గత ఏడాది బదిలీల్లో ఆయన రంగంపేట నుండి జగ్గంపేట సీనియర్ అసిస్టెంట్ గా వచ్చారు. కొద్ది నెలల్లోనే డిప్యూటీ ఎంపిడిఓ గా పదోన్నతి పొంది ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు. ఆయన మృతి పట్ల ఎంపిడిఓ ఎ వి ఎస్ చంద్రశేఖర్, తహసీల్దార్ జె వి ఆర్ రమేష్, సచివాల యాల డిప్యూటీ ఎంపిడిఓ శ్రీనివాస రెడ్డి, అర్ డబ్ల్యూ ఎస్ ఎఈ రాంజీ, ఉపాధి హామీ ఎపిఓ రమణ కుమార్, పిడిఓ లు కె శివ, శ్రీనివాస్, నరసిం హమూర్తి, నూకరాజు, ఉషారాణి, తదితర సిబ్బంది సంతాపం తెలిపారు.

## పేదల పెన్నిధి చంద్రబాబు

### అన్నక్యాంటీన్‌లో పేదలకు భోజనాలు వడ్డించిన కిమిడి

విజయనగరం,ఏప్రిల్20 : సీఎం నారా చంద్రబాబు పేదలపాలిట పెన్నిధి అని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి వెంకటరావు అన్నారు. చంద్రబాబు జన్మదినోత్సవం సందర్భంగా చీపురుపల్లి పట్టణంలోని అన్న క్యాంటీన్లో పేదలకు ఆయన భోజనాలు వడ్డించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు నిరంతరం పేదల సంక్షేమం కోసం పాటుపడే వ్యక్తి అని అన్నారు. గత తెదేపా ప్రభుత్వంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తే వైకాపా ప్రభుత్వం వాటిని రద్దు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వ ఏర్పాటయ్యాక మళ్లీ వాటిని పునరుద్ధరించి పేదల ఆకలి తీరుస్తుందన్నారు. అన్న క్యాంటీన్ల నిర్వహణకు ఏడాదికి రూ.273 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. ముఖ్యమంత్రి పిలుపుమేరకు దాతలు ముందుకు వచ్చి అన్న క్యాంటీన్ల నిర్వహణకు విరాళాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. అనంతరం కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో చంద్రబాబు పేరుపై ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో నాలుగు మండలాల నాయకుల సమక్షంలో కేక్ కట్ చేశారు. చీపురుపల్లి ప్రాంతీయ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొ÷–టటెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్, నాలుగు మండలాలకు చెందిన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కళ్యాణదుర్గంలో బాబు జన్మదిన వేడుకలు

కల్యాణదుర్గం,ఏప్రిల్20 : ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను కల్యాణదుర్గం పట్టణంలోని ప్రజావేదికపై నిర్వహించారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆంధ్ర రాష్ట్రానికి అమరావతిని రాజధాని ఏర్పాటు చేయడంలోనూ, రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసం అహర్నిశలు సీఎం కృషి చేశారన్నారు. ఇదే రోజున సీఎం సతీమణి నారా భువనేశ్వరి అన్నా క్యాంటీన్ కోసం రూ.76 లక్షలు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సీఎం బాటలోనే తాను నడుస్తూ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్నానన్నారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 3,625 మంది రక్తదానం చేశారు.

# రాష్ట్రవ్యాప్తంగా బాబు జన్మదిన వేడుకలు

### కేక్ కటింగ్‌లు, రక్తదాన శిబిరాలు దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ




అమరావతి,ఏప్రిల్ 20 : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ పుట్టినరోజు సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ కార్యకర్తలు, అభిమానులు ఘనంగా సంబరాలు చేసుకున్నారు. కేక్ కటింగ్, అన్నదానం, రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించి తమ నేతకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సోషల్ మీడియా వేదికగా కూడా సీఎంకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. చంద్రబాబు జన్మదినం సందర్భంగా అనంతపురంలో సంబరాలు అంబరాన్నంటాయి. టీడీపీ కార్యాలయం లో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ షరీఫ్, జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్.. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. పార్టీ కార్యాలయానికి టీడీపీ నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి సంబరాలు చేసుకున్నారు. సీఎం పుట్టిన రోజు సందర్భంగా కళ్యాణదుర్గంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు.. రక్త దానం చేసి శిబిరాన్ని ప్రారంభించారు. మెగా రక్తదాన శిబిరానికి వేలాదిగా టీడీపీ అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఇప్పటికే ఐదు వేల మందికి పైగా రక్తదానం చేశారు. మెగా రక్తదాన శిబిరంలో ఎన్టీఆర్ ట్రస్ట్, రెడ్ క్రాస్‌తో పాటు పలు జిల్లాలకు చెందిన స్వచ్ఛంద రక్తదాన సంస్థలు పాల్గొన్నాయి. నెల్లూరు జిల్లా ఆత్మకూరులో మంత్రి ఆనం రామనారాయణ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఏఎంసీ ప్రాంతంలో ఆనం భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి కూటమి పార్టీల నేతలు, శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చంద్రబాబు ఆయురారోగ్యాలతో ఉండాలని మంత్రి ఆనం కుటుంబసభ్యులు మహాయజ్ఞం నిర్వహించారు. పది వేల మంది మహిళలకు చీరలు, కుట్టు మిషన్ల పంపిణీకి ఏర్పాట్లు చేశారు. శ్రీ సత్య సాయి జిల్లా కదిరిలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా కదిరిలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఖాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో టీడీపీ నేతలు ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యమంత్రి ఆయురారోగ్యాలతో జీవించాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, టీడీపీ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూటమి నేతలు ఆలయంలో కొబ్బరికాయలు కొట్టారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆర్థిక విధ్వంసం, అరాచకం నుంచి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న నేత ముఖ్యమంత్రి చంద్రబాబు అని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. భారతదేశ రాజకీయాలు చంద్రబాబు చుట్టూ తిరుగుతున్న పరిస్థితి ఉందన్నారు. తెలుగుజాతి రాజకీయాలలో చంద్రబాబు ఒక చరిత్ర అని చెప్పుకొచ్చారు. నిరంతరం రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి ఆయురారోగ్యాలతో కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆకాంక్షించారు. సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో సీబీఎన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కుప్పం ప్రజల దాహార్తి తీర్చిన అపర భగీరథుడు చంద్రబాబు చిత్ర పటానికి మూడువందల బిందెల కృష్ణా జలాలతో మహిళలు అభిషేకం చేశారు. వంద ట్రాక్టర్లతో సీఎం చిత్రాలతో పల్లకీలతో ఊరేగింపు, భారీ బైక్, ఈ సైకిళ్లతో ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు పేరుమీద నియోజకవర్గంలోని గ్రామ గ్రామాన ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్విమ్స్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి.. సుమారు వెయ్యి మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. నాలుగు మండలాల్లో పేదలకు అన్న క్యాంటీన్ల ద్వారా ఉచిత భోజనం పంపిణీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్నదానం, రక్తదాన శిబిరాలు, వృద్ధులు, వికలాంగులకు వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. తణుకులో సీఎం జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఘనంగా నిర్వహించారు. మహిళలు చే కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు ఎమ్మెల్యే. వ్యాపార ఉపాధి కల్పన కోసం 15 మందికి తోపుడు బండ్లు, 8 మందికి ఎగ్ కార్ట్‌ను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. చంద్రబాబు జన్మదినం సందర్భంగా కాణిపాకం పుణ్యక్షేత్రంలో చైర్మన్ మణి నాయుడు, ఎమ్మెల్యే మురళీమోహన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రబాబుకు నిండు నూరేళ్ల జీవితాన్ని... ఆయురారోగ్యాలను ప్రసాదించాలని, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని టీడీపీ నేతలు ప్రార్థించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా టీడీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షులు, విశాఖపట్నం 44వ వార్డు ఇన్‌ఛార్జ్ కోయిలాడ వెంకటేశ్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెంలో 500 మందికి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కాకినాడ జిల్లా టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు వైభవంగా నిర్వహించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు రక్తదానం చేశారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీ రాజశేఖర్.. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఏలూరు టీడీపీ జిల్లా కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకల్లో భాగంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఎమ్మెల్యే బడేటి చంటి కేక్ కట్ చేసి ముఖ్యమంత్రికి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. కడప జిల్లా వ్యాప్తంగా సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. టీడీపీ నేతలు జిల్లాలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానాలు నిర్వహించారు. హనుమాన్ జంక్షన్‌లో ఆశాజ్యోతి దివ్యాంగుల ఆశ్రమంలో విజయ డైరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు జరిగాయి. హ్యాండిక్యాప్డ్‌లతో కలిసి చలసాని ఆంజనేయులు కేక్ కట్ చేశారు. ఆపై చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన వ్యక్తి సీఎం చంద్రబాబు అని తెలిపారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయిలో గుర్తించే విధంగా రూపుదిద్దిన శ్రమజీవి అని కొనియాడారు. నిపుణుల కన్నా అడ్వాన్స్‌గా ఆలోచించగలిగే వ్యక్తి సీఎం చంద్రబాబు అని అన్నారు. భవిష్యత్తులో ఆంధప్రదేశ్ ముందంజలో ఉండాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు.

## పేదల ఆకలి తీర్చే లక్ష్యంతో అన్న క్యాంటీన్లు

### విజయవాడ పటమటలో అన్నక్యాంటీన్ ప్రారంభం

### ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రారంభించామన్న చంద్రబాబు

విజయవాడ,ఏప్రిల్20 : ప్రతి ఒక్కరి కడుపు నిండాలని.. ఎవరూ ఆకలిలో ఉండకూడదనేదే అన్న క్యాంటీన్ల ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అన్న ఎన్టీఆర్.. తిరుమలలో ప్రారంభించిన అన్నప్రసాదం కార్యక్రమం స్ఫూర్తితో ఈ అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామన్నారు. సోమవారం విజయవాడ పటమటలో అన్న క్యాంటీన్‌ను సీఎం చంద్రబాబు దంపతులు ప్రారంభించారు. అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. పేద వారికి కేవలం దానం చేసినట్లుగా కాకుండా, వారు గౌరవ ప్రదమైన వాతావరణంలో.. శుభ్రమైన, నాణ్యమైన పౌష్టికాహారాన్ని పొందేలా చూడటమే ఈ కార్యక్రమం ప్రత్యేకత అని చెప్పారు. ?ఇక్కడ ప్రత్యేకమైన క్యాంపస్, కాంపౌండ్ వాల్, పరిశుభ్రమైన వాతావరణం ఉంటుందని పేర్కొన్నారు. కేవలం రూ.5లకే ఉదయం, మధ్యాహ్నం, రాత్రి మూడు పూటలా భోజనం అందిస్తున్నారని వివరించారు. ఆటో డ్రైవర్లు, ముఠా కార్మికులు, రోడ్లు ఊడ్చేవారు, ఇతర సామాన్య ప్రజలకు ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన ఆశాబావం వ్యక్తం చేశారు. ఇస్కాన్ ఫౌండేషన్ వారు సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా చాలా రుచికరమైన, నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 269 అన్న క్యాంటీన్లు పని చేస్తున్నాయని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. ఇటీవల 62 కొత్త క్యాంటీన్లను ప్రారంభించా మన్నారు. త్వరలోనే మరో 5 క్యాంటీన్లు ప్రారంభించి.. వాటి సంఖ్యను 274 కు చేర్చనున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లలో రూ.76 లక్షల వ్యయంతో మూడు పూటలా ఉచిత భోజనం అందించేందుకు ముందుకు వచ్చిన తన సతీమణి నారా భువనేశ్వరిని ఈ సందర్భంగా చంద్రబాబు అభినందనలతో ముంచెత్తారు. ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా.. ఒక పూట భోజనం లేదా ఒక రోజు క్యాంటీన్ ఖర్చును భరించడం ద్వారా ఈ అన్నదాన కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ప్రజలను కోరుతున్నామన్నారు. ఇది కేవలం ప్రభుత్వం చేసే పని మాత్రమే కాకుండా, ప్రజలందరూ ఒక స్ఫూర్తితో కలిసి రావాల్సిన వేదిక ఇది అని పేర్కొన్నారు. ప్రజలను ఆదుకునే కార్యక్రమాలు నిరంతరాయంగా జరగాల్సి ఉందన్నారు. ఇది కేవలం ఒక పూట ఆహారం అందించడంతో ముగిసిపోయేది కాకూడదని.. ?ప్రజల అభివృద్ధి కోసం దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు వెళ్లాల్సి ఉందని చెప్పారు. వారిని మనతో సమానంగా అన్ని రంగాల్లో పైకి తీసుకురావాల్సి ఉందని చెప్పారు. సమాజంలో ఉన్న ఆర్థిక అసమానత లను తగ్గించే దిశగా ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అదే నిజమైన ప్రజాస్వామ్యం, సమాజానికి స్ఫూర్తి కూడా అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అంటేనే 'అన్నపూర్ణ' అని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఎవరూ కూడా ఆకలితో అలమటించ కూడదన్నారు. గత ప్రభుత్వం పేదలకు అన్నం పెట్టే 'అన్న క్యాంటీన్లను' మూసివేసిందని విమర్శించారు. భోజనం పెట్టే వారిపై తప్పుడు కేసులు పెట్టి అరెస్ట్ చేయడం వారి ప్రవర్తనకు నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పేదలను ఆదుకోవడానికి అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలంటూ ప్రజలకు ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

## తిరుమలలో బ్లాక్ టిక్కెట్ల దందా

### విజిలెన్స్ అధికారులే సూత్రధారులు

### టిటిడి మాజీ చైర్మన్ భూమన ఆరోపణలు

తిరుపతి,ఏప్రిల్20 : కూటమి అధికారంలోకి వచ్చాక తిరుమలలో అనేక అపచారాలు జరుగుతున్నాయని ఆరోపించారు టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి. బీఆర్ నాయుడు చైర్మన్ అయ్యాక అపచారాలు పరాకాష్టకు చేరుకున్నాయి. ముఖ్యంగా బ్లాక్ టిక్కెట్ దందాలు పెరిగాయని అన్నారు. 300 రూపాయల టికెట్‌ను మూడు వేలకు అమ్ముకుంటున్నారని అన్నారు. విజిలెన్స్ అధికారులే ఈ పాపానికి ఒడిగడుతున్నారు అంటూ మండిపడ్డారు. టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ..'తిరుమలను ప్రక్షాళన చేస్తాం అనేవి కూటమి నేతల మాయమాటలు మాత్రమే. తాబేదారులతో అడ్డూ అదుపు లేకుండా అపచారాలు చేస్తున్నారు. 2008లో నేను పాలకమండలి అధ్యక్షునిగా ఉన్న సమయంలో బాలమురళి కృష్ణను ఆస్థాన విద్వాంసుడిగా నియమించాం. ఆయన చేత ఆలయం ముందు సంగీత కార్యక్రమం నిర్వహించాం. ఇది శాశ్వతంగా ఉండాలని నాదనీరాజన ప్రాంగణం వెలసింది. ఆ వేదికలో సాంస్కృతిక వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసేలా కార్యక్రమం జరుగుతూ వచ్చాయి. ప్రస్తుతం ఆ వేదికపై అవినీతి కంపు కొడుతోంది. దీని కోసం భాస్కర్ అనే అధికారిని నియమించారు. ఆయనకు అర్హత అసలు లేదు. సీఎం, చైర్మన్ అండదండలతో భాస్కర్ పేట్రేగి పోతున్నారు. ప్రోగ్రాం ఇచ్చేందుకే కమీషన్లు, పారితోషికంలో కమీషన్లు తీసుకుంటున్నారు. వీఐపీ, బ్రేక్, 300 రూపాయల దర్శనం టికెట్లు అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. 300 టికెట్లను మూడు వేలకు అమ్మేస్తున్నారు. విజిలెన్స్ అధికారులే ఈ పాపానికి ఒడిగడుతున్నారు. శ్రీవాణి టికెట్లను 15 వేలకు అమ్మేస్తున్నారు. ఎస్వీబీసీలో అనర్హులకు పదవి ఇచ్చి నాశనం చేశారు. రూ.50 కోట్లతో ఎస్వీబీసీని స్వయం ప్రతిపత్తి సంస్థగా తీర్చి దిద్దే ప్రయత్నం వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగింది. కరోనా సమయంలో ఎస్వీబీసీ ద్వారా ప్రేరణ పొందేలా చేశాం, ధైర్యం పెంచాం. ఈ కూటమి ప్రభుత్వం కుప్ప విశ్వనాథ శర్మను ఎస్వీబీసీ నుంచి పంపేశారు. చతుర్వేద యాగాలు పూర్తిగా నిలిపివేశారు. 700 మంది వేద పారాయణదారుల నియామకం కాలేదు. కన్వీనర్ కోట్ల రూపాయలు అభ్యర్థుల వద్ద నుంచి కాజేసినా చర్యలు లేవు. నృత్య, సంగీత కళాశాలను పూర్తిగా నిర్వీర్యం చేసే విధంగా టీటీడీ చర్యలు తీసుకుంటోంది. అర్హత లేని వ్యక్తిని హిందూ ధర్మ ప్రచార పరిషత్‌కు నియమించారు. ఆన్‌లైన్ పెట్టిన అనంతరం 800 టికెట్లు ఎలా పూర్తి అవుతాయి. ఒక్కో టికెట్ కొట్టడానికి ఎంత సమయం పడుతుంది. కొండపై బ్రోకర్లు ఉన్నారు. రూ.15 వేలు ఇస్తే టికెట్లను బ్రోకర్లు అమ్మేస్తున్నారు. 400 నుంచి 600 టికెట్లు అమ్మేస్తున్నారు. రోజుకు శ్రీవాణి టికెట్ల ముసుగులో 15 లక్షలకు పైగా అవినీతికి పాల్పడుతున్నారు అంటూ ఆరోపించారు.

## చంద్రబాబు ప్రచారంతో ఒరిగేదేమీ లేదు: నారాయణ

హైదరాబాద్,ఏప్రిల్20 : ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఫైర్ అయ్యారు. తమిళనాడు రాష్ట్ర ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి ప్రచారం చేస్తున్న చంద్రబాబు నాయుడుకి శృంగభంగం తప్పదని పేర్కొన్నారు. నాడు జయలలిత అధికారంలో ఉన్నప్పుడు తమిళనాడు రాష్ట్రంలోని తెలుగు భాష బోధించే పాఠశాలను మూసేస్తామని అసెంబ్లీలో తీర్మానం తీసుకొచ్చినప్పుడు తమిళనాడు రాష్ట్రంలో నివసిస్తున్నటువంటి తెలుగు ప్రజలు దీనిపై స్పందించాలని చంద్రబాబు నాయుడుని నేరుగా కలిసి విన్నవించుకున్నా పట్టించుకోలేదన్నారు. అలాంటి చంద్రబాబు ప్రస్తుతం మోడీనికాపాడేందుకు ఎన్డీఏ తరపున తెలుగు ప్రజల మధ్య ప్రచారానికెళ్లడం విడ్డూరమన్నారు. తమిళనాడు ఎన్నికల్లో స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల కూటమి గెలుపు ఖాయమన్నారు.

## చంద్రబాబుకు వైఎస్ జగన్ శుభాకాంక్షలు

### నేడు పులివెందుకు జగన్ రాక

అమరావతి,ఏప్రిల్20 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి పుట్టినరోజు సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. చంద్రబాబుగారూ.. మీకు పుట్టినరోజు శుభాకాంక్షలు. ఆరోగ్యకరమైన, ప్రశాంతమైన దీర్ఘాయుష్షు మీకు కలగాలని కోరుకుంటున్నా అంటూ ఎక్స్ ఖాతాలో వైఎస్ జగన్ ఓ ట్వీట్ చేశారు. చంద్రబాబు నాయుడికిది 76వ పుట్టినరోజు సందర్భంగా శు భాకాంక్షలు తెలిపారు. ఇదిలావుంటే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన సొంత నియోజకవర్గం పులివెందులలో పర్యటించనున్నారు. మూడు రోజుల పాటు ఈ పర్యటన కొనసాగనుంది. తన పర్యటనలో బాగంగా వైఎస్ జగన్ మంగళవారం సాయంత్రం పులివెందులకు చేరుకుంటారు. అక్కడ భాకరాపురం క్యాంప్ ఆఫీస్‌లో ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. రాత్రికి అక్కడి నివాసంలో బస చేస్తారు. మరుసటిరోజు22న ఉదయం పులివివెందుల నుంచి బయలుదేరి లింగాల మండలం ఇప్పట్ల వెళతారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నేత సుధాకర్ రెడ్డి ఇటీవలె మరణించారు. ఈ నేపథ్యంలో ఆయన కుటుంబాన్ని వైఎస్ జగన్ ఓదార్చనున్నారు. తిరిగి పులివెందుల క్యాంప్ కార్యాలయానికి చేరుకుని ప్రవిజాదర్బార్ నిర్వహిస్తారు. 23వ తేదీన ఉదయం పర్యటన ముగించుకుని పులివివెందుల నుంచి తిరుగు పయనమవుతారు.

## ఘనంగా సింహాద్రి అప్పన్నస్వామి చందనోత్సవం

### తొలచందన దర్శనం చేసుకున్న అశోకగజపతి

### ప్రభుత్వం తరపున హోంమంత్రి అని పట్టువస్త్రాలు సమర్పణ


### భారీగా తరలి వచ్చిన భక్తులు

విశాఖపట్టణం,ఏప్రిల్20 : సింహాద్రి అప్పన్నస్వామి చందనోత్సవం ఘనంగా జరుగుతోంది. సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామున ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త, గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు కుటుంబం స్వామివారికి తొలి చందన సమర్పణ చేసి దర్శనం చేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున హోం మంత్రి అనిత స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం తితిదే దేవస్థానం స్వామికి పట్టువస్త్రాలు సమర్పించింది. మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, కొల్లు రవీంద్ర తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి నిజరూప దర్శనానికి లక్షల మంది భక్తులు తరలిరానుండటంతో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు అయితే సింహాచలం చందనోత్సవంలో భక్తుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. సింహాచలం అప్పన్నస్వామి చందనోత్సవానికి భక్తులు భారీగా తరలిరావడంతో కొంద ఇబ్బంది ఏర్పడింది. దాంతో భక్తులు గంటల తరబడి సింహాచలం బస్టాండ్‌లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. బస్టాండ్‌లో సైతం భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో పోలీసులు వారిని కంట్రోల్ చేయలేకపోయారు. బస్టాండ్‌కు నుంచి సింహాచలం కొండపైకి వెళ్లే బస్సుల్లో భక్తులు కిక్కిరిసి పోయారు. బస్సులు ఎక్కడానికి ఎగబడిపోయారు. సరైన ఏర్పాట్లు చేయకపోవడంత భక్తుల అవస్థలు తప్పడం లేదు. గంటల తరబడి క్యూలైన్లలోనే ఉంటున్నామని, కనీస సౌకర్యాలు కూడా ఏర్పాట్లు చేయలేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



## పెద్దిలో స్పెషల్ సాంగ్ కోసం
# సంయుక్త మీనన్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'పెద్ది'. ఈ సినిమా అనౌన్స్ చేసినప్పటి నుండి దీనిపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. తాజాగా ఈ సినిమా గురించి ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో ఒక ప్రత్యేక గీతం కోసం 'గోల్డెన్ లెగ్' సంయుక్త మీనన్‌ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. రామ్ చరణ్ సినిమాల్లో పాటలు, ముఖ్యంగా మాస్ సాంగ్స్ ఏ రేంజ్‌లో ఉంటాయో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. 'పెద్ది' కోసం ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అదిరిపోయే ట్యూన్ సిద్ధం చేశారని సమాచారం. ఈ మాస్ నంబర్‌లో రామ్ చరణ్ సరసన సంయుక్త మీనన్ ఆడిపాడనుందనే వార్త ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్ అయ్యింది. సంయుక్త తొలిసారిగా అఖండ 2 లో బాలయ్య సరసన జాజికాయ అనే స్పెషల్ సాంగ్ లో నటించి మెప్పించింది. ఇప్పుడు మరోసారి స్పెషల్ సాంగ్‌లో మెగా హీరోతో స్క్రీన్ షేర్ చేసుకోవడం విశేషం. అయితే ఈ స్పెషల్ సాంగ్ లో చరణ్ సరసన మానస వారణాసి, మృణాల్ ఠాకూర్, పూజాహెగ్డే వంటి భామల పేర్లు వినిపించాయి కానీ చివరికి సంయుక్తకు డైరెక్టర్ బుచ్చిబాబు గ్రీన్ సిగ్నల్ ఇసినట్టు తెలుస్తోంది. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ డ్రామాగా 'పెద్ది' రూపొందుతోంది. ఇందులో రామ్ చరణ్ మునుపెన్నడూ లేని విధంగా ఒక కొత్త లుక్‌లో కనిపించబోతున్నారు. ఇప్పటికే జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఇప్పుడు సంయుక్త మీనన్ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలవనుంది. ఈ స్పెషల్ సాంగ్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని, బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాయడం ఖాయమని ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు.




# యూత్ మూవీకి రిషబ్ శెట్టి ఫిదా

ఇటీవల విడుదలై మంచి ఆదరణ సొంతం చేసుకుంటోంది 'యూత్' మూవీ. ఇప్పటికే దీనిపై ఎంతోమంది సెలబ్రిటీలు ప్రశంసలు కురిపించగా.. తాజాగా రిషబ్‌శెట్టి కూడా దీనికి ఫిదా అయ్యారు. ఎక్స్ వేదికగా దీనిపై పోస్ట్ పెట్టారు. చాలాకాలం తర్వాత, ఒక సినిమా చూస్తున్నంతసేపు నేను నవ్వుతూనే ఉన్నాను. 'యూత్' సినిమాలో ఎన్నో భావోద్వేగాలున్నాయి. తల్లిదండ్రులకు ఇచ్చిన గొప్ప బహుమతి 'యూత్'. తెరపై నటీనటులంతా చాలా సహజంగా కనిపించారని రిషబ్ అన్నారు. దర్శకుడి గురించి ప్రత్యేకంగా ప్రస్తావించిన రిషబ్ సినిమా రంగానికి కెన్ కరుణాస్ ఒక గొప్ప ఆస్తి అని పేర్కొన్నారు. 'యూత్' కథేంటంటే..: మధ్యతరగతి కుటుంబానికి చెందిన టీనేజర్ ప్రవీణ్ (కెన్ కరుణాస్). అతడి అల్లరి పనుల వల్ల స్కూల్‌లో ఏ అమ్మాయీ తనవైపు కన్నెత్తి కూడా చూడదు. కానీ, ప్రవీణ్ మాత్రం తన స్కూల్ లైఫ్ పూర్తయ్యేలోపు ప్రేమించాలన్న లక్ష్యంతో ప్రయత్నాలు చేస్తుంటాడు. ఈ క్రమంలోనే గంగవల్లి (అనీషా అనిల్ కుమార్), ప్రేషిక (మీనాక్షి దినేష్), సోనాల్ (ప్రియాన్షీ యాదవ్) తన జీవితంలోకి వస్తారు. మరి ఆ ముగ్గురి వల్ల ప్రవీణ్ జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది? ప్రేమ, బ్రేకప్, అవమానాలు లాంటి అనుభవాలతో అతడు నేర్చుకున్న జీవిత పాఠమేంటి? ఈ ప్రయాణంలో తన తల్లిదండ్రులు ఉన్నికృష్ణన్ (సూరజ్ వెంజరమూడు), సరోజ (దేవదర్శిని) పాత్రలకి ఉన్న ప్రాధాన్యం ఏంటి? వారి కలల్ని హీరో నెరవేర్చాడా? అన్నది మిగిలిన కథ.





# పెద్ద మనసు చాటుకున్న చిరంజీవి

ప్రముఖ నటుడు చిరంజీవి మరోసారి పెద్ద మనసు చాటుకున్నారు. ఆపదలో ఉన్న తన సిబ్బందిని ఆర్థిక సాయంతో ఆదుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. మేకప్ ఆర్టిస్ట్ శివనాథ్ హార్ట్ సర్జరీ కోసం రూ.10.5 లక్షలు, మాజీ మేనేజర్ నరసయ్య సతీమణి బైపాస్ సర్జరీకి రూ.9.5 లక్షలు అందజేశారు. సాయం చేయడమే కాదు శస్త్ర చికిత్సల ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించి, ఆ కుటుంబాలకు అండగా నిలిచారు.




# హోంబలే నుంచి మహావతార్ పరశురామ్


కేజీఎఫ్, కాంతారా, సలార్, మహావతార్ నరసింహ.. ఇలా వరుస బ్లాక్‌బాస్టర్స్‌తో సినిమా స్థాయిని పెంచిన నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ నుంచి రాబోతున్న మరో యానిమేటెడ్ దృశ్యకావ్యం 'మహావతార్ పరశురామ్' రాబోతోంది. పరశురామ జయంతి సందర్భంగా 'మహావతార్' సినీమాటిక్ యూనివర్స్‌ని ప్రజెంట్ చేస్తూ ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ని, గ్లింప్స్‌ని ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. గొడ్డలి చేతబట్టి నరమేధాన్ని సృష్టిస్తున్న పరశురాముడ్ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. పరశురాముడి ముఖాన్ని చూపించకుండా, ఆయన చేతిలో రక్తంతో తడిసిన పరశును(గొడ్డలి), రక్తంతో తడిచి ముద్దయిన యుద్ధభూమిని, దూరంగా భీతితో చూస్తున్న సైన్యాన్ని పోస్టర్‌లో చూపిస్తూ కథపై మరింత ఆసక్తిని పెంచారు మేకర్స్. మహావిష్ణు అవతారాల నుంచి స్ఫూర్తి పొందిన ఈ కథ మోడ్రన్ విజువల్ వండర్‌గా, గ్రేట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌తో అలరిస్తుందని మేకర్స్ చెబుతున్నారు. సామ్ సిఎస్ ఈ చిత్రానికి సంగీత దర్శకుడు.


# వచ్చేయేడు స్టార్ హీరోల సందడి


## భారీ బడ్జెట్‌తో వస్తున్న ప్రముఖ హీరోల మూవీస్

తెలుగు చలనచిత్ర పరిశ్రమకే కాదు.. ఇండియన్ సినిమా హిస్టరీలో 2027 సంవత్సరం ఒక మైలురాయిగా నిలవబోతోంది. స్టార్ హీరోలందరూ గ్లోబల్ మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకుని భారీ బడ్జెట్ చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఇండియన్ సినిమా స్థాయిని పెంచేలా, మునుపెన్నడూ లేని విధంగా ఈ క్రేజీ ప్రాజెక్టులు విడుదల కానున్నాయి. ప్రభాస్, మహేష్ బాబు, ఎన్టీఆర్, అల్లు అర్జున్ భారీ సినిమాలు బ్యాక్ టు బ్యాక్ విడుదల కాబోతున్నాయి. ప్రభాస్, సందీప్ రెడ్డి వంగ కలయికలో రాబోతున్న 'స్పిరిట్' మూవీ 2027 మార్చి 5న విడుదల కానుండగా.. ఈ పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామా బాక్సాఫీస్ విధ్వంసం సృష్టిస్తుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఇందులో ప్రభాస్ పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతున్నాడు. ఇక దర్శక దిగ్గజం రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో రాబోతున్న భారీ ప్రాజెక్ట్ 'వారణాసి' ఏప్రిల్ 7న రిలీజ్ కానుండగా, భారతీయ సినిమాకు హాలీవుడ్ స్థాయిలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతుందనే అంచనాలున్నాయి. ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రాబోతున్న డ్రాగన్ కూడా వచ్చే ఏడాదిలోనే రిలీజ్‌కు సన్నాహాలు చేస్తున్నారు. 2027 ద్వితీయార్థంలో ఈ హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ విడుదల కానుందని తెలుస్తోంది. ఇక పుష్ప తర్వాత ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, మాస్ డైరెక్టర్ అట్లీతో చేస్తున్న సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ 'రాకా' కూడా నెక్ట్స్ ఇయర్ ఎండింగ్‌లో రిలీజ్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ సినిమాలో బన్నీ సరికొత్త అవతారంలో కనిపించబోతుండగా.. బాక్సాఫీస్ షేక్ అవడం గ్యారెంటీ అనే హైప్ ఉంది. మొత్తంగా.. వచ్చే ఏడాదిలో ఈ నలుగురు హీరోలు వెయ్యి కోట్ల సినిమాలు ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు. ఖచ్చితంగా ఈ సినిమాలతో తెలుగు సినిమా స్థాయి మరింత పెరగడం ఖాయం.





Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor,
MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published
at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com